
ఆంధ్రప్రదేశ్



నియంతృత్వానికి నీతిపాఠం

అక్టోబరు 1965
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9
సంచిక : 12
ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

అక్టోబరు, 1965
ఆశ్వయుజ-కార్తీక 1887 శకం
సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఈ సంచికలో

ముఖచిత్రం :
పాటన్‌లను చెండాడిన పరాక్రమవంతులు.

రెండవ చిత్రం :
శ్రీనగర్ విమానాశ్రయంలో, సెప్టెంబర్ 7వ తేదీన పాకిస్తాన్ సాబ్రే జెట్ విమానంచేత దెబ్బతిన్న ఐక్యరాజ్యసమితి విమానం.

మూడవ చిత్రం :
ముష్కర పాకిస్తాన్ దాడినుండి మన సరిహద్దుల సంరక్షించిన ఫల్గుణులకు జై జైలు.

నాల్గవ చిత్రం :
సెప్టెంబరు 2వ తేదీన పాకిస్తాన్ విమాన దాడి ఫలితంగా ఛాంబ్ సెక్టర్‌లోని జారియన్‌లో ఉన్న రెండువందల సంవత్సరాలనాటి మసీదు ఒకటి విధ్వంసమయిపోయింది.

---

* ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు.

ఇక ముందున్న కర్తవ్యం



గత రెండు ప్రపంచ సంగ్రామాలలో మనదేశం పరోక్షంగా పాల్గొన వలసి వచ్చింది. విదేశ భూభాగాలలో యితరులకొరకు మన సైనికదళాలు యుద్ధాలలో ప్రవేశపెట్టబడ్డాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో మన సరిహద్దులవరకు సమరం విస్తరించే అవకాశం కూడ ఏర్పడింది. అదృష్టవశాత్తుయిది సంభవించలేదు.

మూడు సంవత్సరాల క్రితం కమ్యూనిస్టు చైనా మన హిమాలయ సరిహద్దులపై దాడి జరిపి సమరరంగాన్ని నేఫా ప్రాంతానికి విస్తరింపజేసింది. మన భూభాగంలో యుద్ధానుభవం కలగడం మనకు యిదే ప్రథమం. అయితే అర్థాంతరంగానే ఆ సమరం ముగిసింది.

ఈ సంవత్సరం ఆరంభంలో మన పొరుగు దేశమైన పాకిస్తాన్ మొదట్లో కిచ్‌రాన్‌లో మనపై దాడిజరిపింది. ఇప్పుడు కాశ్మీరు సరిహద్దులపై దాడి ప్రారంభించింది. మనదేశాన్ని లొంగదీయాలనే పాకిస్తాన్ బృహత్ప్రణాళికలో యీ రెండుదాడులు భాగమై ఉన్నాయి. అందువల్ల స్వరక్షణ ఉద్దేశంతో పోరాడటానికి మన సేనలు ముందుకు నడవాల్సిన అవసరం ఏర్పడింది. దురాక్రమణదారుని దురుద్దేశాలను వమ్ముచేసి, ఆశలను అడియాసలు చేయటానికి వీలుగా మనసేనలు అతని భూభాగంలోకి చొచ్చుకొనిపోయి సరఫరా, కమ్యూనికేషన్‌లను చిన్నాభిన్నం చేయాల్సి వచ్చింది. ఆగస్టు 5 వ తేదీనుంచి యీ సంఘర్షణ కొనసాగుతూనే ఉన్నది.

ఇప్పుడు అన్ని రంగాలలోను మనది పైచేయిగా ఉన్నది. అయితే పరిస్థితులను అనుసరించి అప్రమత్తతగా ఉండాలి, ప్రతి సమరంలోను ఎగుడుదిగుడులు ఉంటూనే ఉంటాయి. ఇప్పుడు పశ్చిమోత్తర సరిహద్దులవరకు మాత్రమే సైనికచర్యలు పరిమితమై ఉన్నా, యితర సరిహద్దులలో ప్రశాంతత ఉంటుందని భావించరాదు శత్రువులు (లేక వారి దురాక్రమణ సహచరులు) సైనిక రీత్యా యితర రంగాలలో యుద్ధాన్ని ప్రారంభించవచ్చు, లేదా వెనుకంజ వేసిన నిస్పృహతో మనను మరింత రెచ్చగొట్టవచ్చు. అందువల్ల జాతి సర్వసిద్ధమై ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొ౦డానికి వీలుగా అన్ని రంగాలలోను నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి.

శత్రువుకానీ, అతని కూటమి సహచరులుగానీ ఎక్కడ తలెత్తినా ఎదుర్కొనడానికి మన పదాతిదళం, వైమానిక దళాలు సిద్ధంగా ఉంటాయనడంలో సందేహంలేదు. యుద్ధరంగంలో పోరాడుతున్న మన సైనికులకు బాసటగా దేశంమొత్తంలో ప్రజలు అనేక విధాలుగా ప్రముఖపాత్ర వహించి దేశంలో శాంతిభద్రతలు కాపాడవలసి ఉంటుంది. మనం నిర్వహించాల్సిన అత్యవసరమైన కృషిని గూర్చి నేను ప్రస్తావిస్తాను.

మత సామరస్యం

పాకిస్తాన్ వలెగాక మనది సెక్యులర్ ప్రజాస్వామికదేశం. అన్నికులాలు, మతాలు, వర్గాలకు చెందిన పౌరులు మన దేశంలో ఉన్నారు. వీరందరికీ సమానమైన హక్కులు, అధికారాలు ఉన్నాయి. ప్రజాస్వామ్య దేశంగా మనడానికి యీ సామరస్యం ఎంతో ప్రాధాన్యంవహిస్తుంది. ఏ విధంగానైనా ఈ సామరస్యాన్ని పెంపొందించాలి. ముత్యాలహారంలో అదృశ్యంగా ఉండే దారంగా వైవిధ్యంగల అన్ని వర్గాలలోను ఏకత్వం కనిపిస్తుంది. ఎట్టి పరిస్థితులలోను ఏ సమయంలోనైనా యీ బంగారు బంధం త్రెంపడానికి ప్రయత్నించకూడదు. దుష్టకృత్యాలుచేసే యేవర్గానికి చెందిన వ్యక్తినైనా కఠినంగా శిక్షించడానికి అధికారాన్ని వినియోగించడానికి ప్రభుత్వం వెనుకాడబోదు.

వదంతులు

యుద్ధం ప్రజలలో అస్థిమితాన్ని, అలజడిని కలిగిస్తుంది. తన సహజస్థితిని నిల్పుకోలేనప్పుడు సాధారణ మానవుడు ఈ అలజడుల వల్ల కొంత భీతిచెందుతాడు. ఈ విషయంలో ప్రతివ్యక్తీ కొంత ప్రయత్నంతో కృషి చేస్తే కొంత బరువుభారం తగ్గుతుంది. వ్యక్తినిగానీ సమాజాన్నిగానీ స్వాస్థ్యం లేకుండా చేయగల వాటిలో వదం

తులు ముఖ్యమైనవి. సాధారణ పరిస్థితులలో వదంతులు అంత నష్టాన్ని కలిగించలేవు. అయితే క్లిష్టపరిస్థితులలో యివి విపరీతఆందోళనను కలిగిస్తాయి. అందువల్ల వదంతులను వ్యాపించ నీయరాదు.

కొందరు వ్యక్తులు ఉద్దేశ రహితంగానే వదంతులను సృష్టించవచ్చు. మన ధైర్యాన్ని సడలింపజేసి శత్రువుకు తోడ్పడడానికి వీలుగా ఉద్దేశ పూర్వకంగా మరికొందరు వదంతులను సృష్టిస్తారు. యీ రెండు విధాలైన వదంతులను మొగ్గలోనే త్రుంచివేయాలి. ఈ విషయంలో మూడు ఉత్తమ వానరుల "చెడునుచూడకు, చెడునువినకు, చెడును మాట్లాడకు" అనే సూక్తిని ఆచరించడం చాలా అవసరం. వదంతులను కల్పించే వ్యక్తులను తోటివారు అదుపులో ఉంచనితీరున ప్రభుత్వమే వారిని తగిన విధంగా శిక్షిస్తుంది. ఇటివంటి దుష్టస్వభావులను నిర్భయంగా తమ సమీపంలోని అధికారులకు పట్టి ఇవ్వాలి. ఈ పంచమాంగ దళంవారిని నిర్మూలించడంలో ప్రతి పౌరుని సహాయ సహకారాలను నేను కోరుతున్నాను.

ధరల అదుపు

విపరీత పరిస్థితులలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం జరుగుతుంటుంది. ఈ సమయంలో కొందరు వ్యాపారస్థులు సరకును దాచి కృత్రిమకొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ప్రత్యేకించి దేశం యుద్ధం కొనసాగిస్తున్నప్పుడు యిటువంటి చర్యనేరంగా పరిగణింప బడుతుంది. సమరంలో పోరాడుతున్న మన సైనికులకు ఆహారం, యితర వస్తువులను సంతతధారగా సరఫరా చేయడం మన పవిత్ర కర్తవ్యం. ధరలను విపరీతంగా పెంచడం వల్ల వారి అవసరాలకు సంతృప్తికరంగా అందజేయడం కష్టతరం అవుతుంది. అంతేగాక పౌర జీవనంకూడా సంతృప్తికరంగా కొనసాగాల్సి ఉంటుంది. ధరల విపరీత పెరుగుదల ఫలితంగా నిత్యావసర వస్తువుల వాడకాన్ని విసర్జించడంవల్ల విస్మృహ జనించి దేశరక్షణకు ప్రాణప్రదమైన వారి ద్రుఢసంకల్పం సడలే ప్రమాదంకూడ జరగవచ్చు. అందువల్ల ప్రస్తుతం ఉన్న ధరల స్థితిని యీ విధంగానే అదుపు చేయడం చాలా అవసరం. ఈ విషయంలో మన వ్యవసాయదారులు, వ్యాపారస్తులు తమ సహకారాన్ని అందజేయడానికి ముందుకు రావడం నాకు చాలా సంతోషం కలిగిస్తున్నది. ధరలను అదుపులో ఉంచడానికి రాష్ట్రప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి కల్పించబడదని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

ఉత్పత్తులు

యుద్ధాన్ని విజయవంతంగా కొనసాగించడానికి ఉత్పత్తి, సరఫరాలను యితోధికం చేయడం అత్యంత అవసరం. అందువల్ల వ్యవసాయదారులు, పరిశ్రమదారులు, కార్మికుల హృదయపూర్వక యితోధిక సహకారంతో అధికోత్పత్తిని సాధించడానికి కూడా వీలు కలుగుతుంది. క్లిష్ట పరిస్థితులలో కూడ ఉత్పత్తులను అధికంచేస్తామని ఉత్పత్తిదారులు, కార్మికులు స్వచ్ఛందంగా దీక్ష వహించడం ముదావహం. వారి యీ మహత్తర కార్యసాధనలో జాతివారికి అండగా ఉంటుంది.

అసాంఘిక శక్తులు

ప్రతి సమాజంలోను కొన్ని అసాంఘిక శక్తులు ఉంటుంటాయి. సాధారణ పరిస్థితులలో వారి చర్యలను మనం విస్మరించ గలుగుతాము. కాని యుద్ధసమయంలో ఆ విధంగా చేయలేము. దురాక్రమణ దారునితో వ్యవహరించిన విధంగానే శత్రుతుల్యులైన యిటువంటి దుష్టులతోను వ్యవహరించాల్సి ఉంటుంది. వారి దుష్టచర్యలను అరికట్టడంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందనడంలో సందేహంలేదు. అయితే యిటువంటి అసాంఘిక శక్తులను బయటకు లాగడం ప్రతి పౌరుని విద్యుక్త ధర్మం.


పౌర రక్షణ

రెండవ ప్రపంచ యుద్ధంలో అమలుజరిపిన పౌర రక్షణ కార్యక్రమాలలో కొందరికి బాగా అనుభవం ఉండవచ్చు. ప్రమాద పరిస్థితులు సంభవించే ప్రాంతాలలో యీ కార్యక్రమాలను పూర్తిగా అమలు జరుపుతారు. భవిష్యత్తులో యిటువంటి ప్రమాదస్థితి సంభవిస్తే తట్టుకోవడానికి వీలుగా యితర ప్రాంతాలలో కూడ యీ కార్యక్రమాలను జరుపుతున్నారు. పౌరులందరి భద్రతకు, ఆస్తి రక్షణకు ముందు జాగ్రత్త సూచనగా యీ కార్యక్రమాలను యిక్కడ కూడా అమలుజరుపు తున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా అమలుజరుపడానికి ప్రజల సహాయం చాలా అవసరం. వ్యక్తిపరంగాను, సమాజ పరంగాను దేశభద్రతకు యిది ఆవశ్యకం.

జవానులకు సహాయం

మనదేశ రక్షణకు తమ ప్రాణాలను సహితం ఒడ్డి వీరోచితంగా పోరాడుతున్న మన సైనికులకు, జవానులకు సహాయపడడం దేశభక్తుడైన ప్రతి భారతీయుని ప్రథమ కర్తవ్యం. మూడు సంవత్సరాలక్రింద చైనా మనపై దండయాత్రచేసిన తరుణంలో దేశం మొత్తం ఒక్కటిగా నిల్చి మన సైనికదళాలకు, వారి కుటుంబాలకు ఎంతో సహాయపడింది. ఈ సమయంలో కూడ అదే ఉత్సాహంతో జాతి యావత్తు వారికి సహాయ పడుతుందనడంలో నాకు ఏ మాత్రం సందేహం లేదు.

జై హింద్!



కనీసం నడ్డివిరిగే దెబ్బలుతిన్న తరువాతనయినా, భారతదేశంతో పోల్చినపుడు పాకిస్తాన్ చిన్నదేశం అని మిస్టర్ భుట్టో గుర్తించడం ఉత్తమమైన సంగతి. ఆ దశలో అతను "స్వతంత్ర కాశ్మీరు"ను గురించి ప్రస్తావించడం విషాదభరితమైన విదూషకత్వంవలె ఉన్నది.

కుక్కకాటుకు చెప్పుదెబ్బ

గడచిన ఆగస్టు 5వ తేదీన 7వేలమంది దుండగులను కాశ్మీరులో అనేకచోట్ల యుద్ధవిరమణరేఖను దాటించింది పాకిస్తాను. వీరంతా కాశ్మీరు కర్షకుల మాదిరిగా వస్త్రాలు ధరించారు. అయితే ఈ దుండగులు ప్రతి ఒక్కరివద్దగా మరతుపాకులు, చేతి బాంబులు వంటి అత్యంత ఆధునిక ఆయుధాలు వున్నాయి. మందుగుండు సామగ్రి, తుపాకులు, వైర్‌లెస్ సెట్లు వున్నాయి, 'జీబ్రాల్టరు దళాలు' అని వీరికి పేరు. పాకిస్తాను వీరికి యీపేరు ఎందుకు పెట్టిందో అర్థంకాదు. ఈ దుండగులు శ్రీనగర్ సరిహద్దులవరకు కూడా రాగలిగారు. వీళ్ళ ఉనికి తెలియడంతోనే మన భద్రతా దళాలు వెళ్ళి, వారు దాగిన చోట్లనుండి వారిని తరిమికొట్టారు. ఈ దుండగులను తట్టుకోవడంలోనూ, ఏరివేయడంలోనూ మాతృదేశాభిమానులైన కాశ్మీరు ప్రజలు ఎంతగానో సహకరించారు.

ఈ ప్రయత్నం పూర్తిగా విఫలం కావడంతో పాకిస్తాను వెనువెంటనే— ఇంతకుపూర్వం తాను సిద్ధపరచుకున్న కార్యక్రమానికి యింకా ముందుగానే— తన సైన్యాన్ని పంపి బాహాటంగా కాశ్మీరుపై దురాక్రమణకు పూనుకుంది. అమెరికా నిర్మిత పాటన్ టాంకులు, సేబర్ జట్ విమానాల మద్దతుగా నిలుపుకుని పాకిస్తాను సైన్యాలు అంతర్జాతీయ సరిహద్దును దాటి భారత భూభాగంలోకి చొచ్చుకుని వచ్చాయి. ఈ దురాక్రమణను ఎదుర్కొంటూ చాంబ్ రంగంలో శత్రువు వత్తిడిని తగ్గించడానికీ, శత్రువును నిర్మూలించడనికీ, శత్రువార్తాసౌకర్యాలను వమ్ము చేయడానికీ మన బలాలు పశ్చిమ పంజాబులోకి అడుగుపెట్టాయి. సంఘటనలు యిలా ఎదురుతిరగడంతో సైనికబలమదాంధుడైన పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ రావల్పిండిలో రేడియో ప్రసంగం చేస్తూ అల్లా ఆశీస్సులను అర్థిస్తూ భారతదేశంపై యుద్ధాన్ని ప్రకటించాడు.

"కోట్లాది పాకిస్తాను ప్రజలకు క్లిష్టపరిస్థితి ఏర్పడింది. ఈ తెల్లవారుఝామున లాహోరు రంగంలో భారతసైన్యం పాకిస్తాను భూభాగంమీద విరుచుకుపడింది. అంతేకాదు, వజీరాబాదులో నిలిచివున్న ఒక ప్రయాణీకుల రైలుమీద భీరువుల్లాగ విమానాలతో దాడిచేసింది.

"గత అయిదునెలలుగా భారతపరిపాలకులు బుద్ధిపూర్వకంగా కొనసాగిస్తున్న దురాక్రమణచర్యల పరంపరకు యిది పరాకాష్ఠ. మే నెలలో కార్గిల్ రంగంలో యుద్ధవిరమణశ్రేణిని అధిగమించి మనవైపున గల మూడు స్థావరాలను ఆక్రమించడంతో వీరి దురాక్రమణ కృత్యాలకు నాంది జరిగింది. ఐక్యరాజ్యసమితి జోక్యం కలిగించుకొనడంతో యీ స్థావరాలని భారతసైన్యం అప్పుడు తాత్కాలికంగా ఖాళీ చేసి యిప్పుడు వాటినీ, మరికొన్నింటినీ ఆక్రమించుకుంది. దురాక్రమణ దుర్బుద్ధితో భారత సైన్యం టిత్వాల్ రంగంలోని స్థావరాలను ఆక్రమించుకోవాలని కదలివచ్చి, ఆపైన యూరీ-పూంచ్ ప్రాంతంవైపు పూర్తి బలగంతో కదులుతోంది."

"యుద్ధ విరమణ రేఖను అతిక్రమించడంతో వీరు సంతృప్తి చెందక పాకిస్తాను భూభాగంలోని అవాన్ అన్న గ్రామంమీద కాల్పులు సాగించారు. భారతదేశం యింతగా కవ్వింపు చర్యల్ని చేస్తున్నా మనం చూపిస్తున్న సహనాన్ని వారు తప్పుగా అర్థం చేసుకున్నారనేది సుస్పష్టమైంది. భారతదేశం కొనసాగిస్తున్న యీ దురాక్రమణ చర్యల్ని అరికట్టడానికి 'అజాద్ కాశ్మీర్' బలాలు భీంబర్ రంగంలో ప్రవేశించడానికి అంగీకరించాయి. భారతీయులు నిర్లక్ష్యంగా వైమానిక దళాన్ని కూడా యీ చర్యల్లోకి లాగి అత్యంత ప్రమాదభరితమైన పరిస్థితుల్ని సృష్టించారు. కాశ్మీరులో భారతదేశం చేసిన దురాక్రమణ పాకిస్తానుపై దండెత్తడానికి భారత్ పన్నిన పన్నాగంలో తొలిచర్య అనేది యావత్ప్రపంచానికీ వెల్లడైంది. దేశ విభజన జరిగిన నాటినుండికూడా పాకిస్తాను యెడ భారతదేశం క్రూరంగానే ప్రవర్తిస్తూ వస్తున్నది. వారి చెడుతలపులకు యీనాటి వారిచర్య అంతిమ సాక్ష్యం."

"ముసల్మానులు తమ స్వంత దేశాన్ని నిర్మించుకో గలిగే స్వతంత్ర పాకిస్తాను ఏర్పాటుకు భారత పరిపాలకులు ఎప్పుడూ సమాధానపడలేదు. గత పద్దెనిమిదేళ్లుగా వారు చేస్తున్న సైనిక కార్యకలాపాల లక్ష్యం మన మీదనే. పశ్చిమానగల మన స్నేహితులు కొందరివద్దనుంచి భారీఆయుధ సహాయాన్ని సంపాదించుకోవడానికి వారు చైనాబూచి మిషచూపించారు. భారత పరిపాలకుల మనస్తత్వాన్ని మన మిత్రులు అర్థం చేసుకోలేక వారికి ఆయుధసహాయం సమృద్ధిగా వుంటే చైనాతో పోట్లాడగలరనే వుద్దేశంతో సహాయాన్ని అందజేశారు."

"ఈ ఆయుధాల్ని వారు మనమీదనే ప్రయోగిస్తారని మనకు తెలుసు. కాలమే దీనిని వ్యక్తం చేసింది. ఇప్పుడు భారత పరిపాలకులు తమ సంప్రదాయసిద్ధమైన పిరికి తనమూ, మోసముతో ముందుగా యుద్ధాన్ని ప్రకటించకుండా పాకిస్తాను పవిత్రభూమి మీదకు దండెత్తి వచ్చారు. భారతదేశం తన రాజ్య విస్తరణ కాంక్షకు తిలోదకాలు యివ్వడానికి తగినట్టుగా దానికి బుద్ధి చెప్పవలసిన తరుణం మనకు ఆసన్నమైంది. శత్రువును ముందుగా ఎదుర్కొనే పనికి సాహసవంతులైన లాహోరు ప్రజలను ఎన్నిక చేయడం జరిగింది. శత్రువును నాశనం చేయడానికి కొన వూపిరివరకు పోరాడే వీరులుగా వీరు చరిత్రలో నిలిచిపోతారు."

"'లా ఇల్లా ఇల్ ఇల్లా మహమ్మద్ రసూల్ ఇల్లా' అన్న శబ్దం హృదయాల్లో స్పందించే కోట్లాది పాకిస్తాను ప్రజలు, భారత తుపాకుల్ని శాశ్వతంగా విద్రపోయేట్టు చేసేవరకూ విశ్రమించరు.''

"తాము యుద్ధానికి తలపడుతున్న ప్రజలు ఎలాంటి వారో భారతదేశపు నాయకులు గుర్తించినట్టులేదు. తమ విశ్వాసానికి అంకితమై తమ పోరాటకారణాన్ని గుర్తించి, సత్యం జయిస్తుందని ఎలుగెత్తిచాటిన దేవుడి పేరున అందరూ ఒక్కటై పోట్లాడే ప్రజలు వీరు.''

"అత్యయిక పరిస్థితి ప్రకటించబడింది. మనం యుద్ధంలో నిమగ్నులమై వున్నాం. శత్రువును తరిమికొట్టడానికి మన వీరసైనికులు వెళ్ళారు. పాకిస్తాను సాయుధబలాలు తమ శక్తిని నిరూపిస్తాయి. స్థిరసంకల్పమనే అజేయశక్తిని ఆయుధంగా ధరించి మన సాయుధ బలాలు శత్రువును చావుదెబ్బలు కొట్టగలవు."

"ఈ సమస్యను ఎదుర్కోవడానికి పాకిస్తాను సైన్యం సర్వ సన్నద్ధంగా వుంది. ఇందుకు మనం మన అన్నివనరులను పణంగా ఒడ్డాలి. దురాక్రమణదారునితో మనం చేసే యీ పోరాటానికి, శాంతి స్వాతంత్ర్యాలు కాంక్షించే వారందరి సానుభూతి, సహాయాలు లభిస్తాయనడంలో సందేహంలేదు.''

"ఐక్యరాజ్యసమితి పత్రంలోని 7వ అధ్యాయంలో గుర్తింపబడిన వ్యక్తిగత, సామూహిక స్వీయరక్షణహక్కును అనుభవించే అధికారాన్ని మాకు ప్రసాదించమని సమితి పత్రాన్ని అర్థిస్తున్నాం."

"ప్రియమైన నా దేశప్రజలారా! యీ క్లిష్ట పరిస్థితుల్లో మీరు ప్రశాంతంగా వుండండి. పూర్తిగా మిమ్మలను మీరు అంకితం చేసుకోవలసిన బృహత్తరమైన, పవిత్రమైన కర్తవ్యం యిది అని గుర్తించండి.''

"అపార కరుణా సమన్వితుడైన భగవంతుడు మీకు విజయాన్ని ప్రసాదిస్తాడు. న్యాయం గురించి పోరాడేవారికి విజయాన్ని ప్రసాదించగలననికూడా భగవంతుడు చెప్పివున్నాడు. సరిహద్దులను అతిక్రమించి మనవైపు పొడుచుకొచ్చిన శత్రువును చావుదెబ్బలు కొట్టి నాశనం చేయడానికి సంసిద్ధులు కండి. ముందుకు కదలండి. శత్రువును ఎదుర్కోండి: దేవుడు మీవెంట వున్నాడు."

కమాండర్ జెనరల్ మూసా ఆరోజున తన సైన్యానికి ఉత్తర్వులిస్తూ యిలా అన్నాడు. "ఇప్పుడు మీ పళ్ళమధ్య శత్రువు చిక్కుకున్నాడు. గట్టిగా, యింకా గట్టిగా, శత్రువు నాశనం అయ్యేవరకూ కరవండి"— దీనితో అతని తోడేలు గుణం బైట బడిపోయింది.

తమ అధ్యక్షుని మాటలు, సైన్యాధిపతి ఆజ్ఞలు విని రెచ్చిపోయి, భారత సైనికబలాల శక్తిని గమనించక, పాకిస్తానీ పిండారీలు గుడ్డిగా యుద్ధరంగంలోనికి దుమికారు. కాని మన సైన్యాల దెబ్బ తిన్న తరువాత యిక వారికి తక్షణ విజయం భ్రమ తొలగిపోయింది. ఆయుధాలలోను, విమానాలలోను వారికి తీవ్రమైన నష్టం కలిగింది; యీ ప్రమాదాన్ని గుర్తించి పాకిస్తానీ పిండారీలు తోక ముడుచుకొని పలాయన మంత్రం పఠించసాగారు.

ఎప్పుడైతే భారత, పాకిస్తాన్ దేశాలమధ్య సంఘర్షణ తీవ్ర స్వరూపం దాల్చిందో అప్పుడు ఐక్యరాజ్యసమితి, మామూలు పద్ధతిలో, ఐక్యం కలుగజేసుకోవడానికి ప్రయత్నించి తక్షణ యుద్ధ విరమణను వాంఛించింది. యుద్ధవిరమణను గురించి సంప్రదించడానికి ఐ. రా. స. రెండు దేశాలకు ప్రధాన కార్యదర్శిని గూడ పంపించింది. మొండి వైఖరితో యుద్ధవిరమణ ప్రతిపాదనను తిరస్కరించివేసి మిస్టర్ భుట్టో యీ క్రింది మూడు అసాధ్యమైన షరతులను ప్రతిపాదించాడు.

1. భారతదేశం, పాకిస్తాన్ దేశాల క్రిందనున్న కాశ్మీరు భూభాగాల నుండి ఒకేసారి అన్ని సైన్యాలను విరమింపజేయాలి.
2. మూడు నెలలలోపల జనవాక్య సేకరణ జరుగాలి.
3. ఆసియా, ఆఫ్రికా దేశాలనుండి ఎంపికచేసిన సైన్యాలతోకూడిన ఐక్యరాజ్యసమితి శాంతిసేన సంపూర్ణ ఆధీనంలో జమ్మూ కాశ్మీరు ఉండాలి; మరియు కాశ్మీరీలు భారతదేశంలో చేరుతారా లేక పాకిస్తాన్‌లో చేరుతారా అనే విషయాన్ని నిర్ధారించడానికొరకు యీ సేన మూడు నెలలలోపల జనవాక్య సేకరణకై అన్ని యేర్పాట్లు చేయాలి.

ఈ మూడు షరతులు యెంత అసంగతంగా ఉన్నాయంటే వీటిని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శికూడా లెక్కచేయలేదు. యుద్ధవిరమణరేఖను బలపర్చడంవలన కాశ్మీరీలమీద భారతదేశం పెత్తనం మరింత గట్టిపడగలదనీ, 11,000 మైళ్ళ దూరాన ఉన్న భద్రతాసమితి యీ సమస్యను సరిగా అర్థంచేసుకోలేదనీ మిస్టర్ భుట్టో అన్నాడు. ఒకవేళ భారతదేశం తన మూడు సూత్రాల పథకాన్ని నిరాకరించితే "యుద్ధం కొనసాగగలదని" ఆయన ప్రకటించాడు; పాకిస్తాన్‌దేశపు మొగల్ ప్రభువువలె అతను మాట్లాడినాడు. మొదట కత్తులు ఝళిపించినట్లు మాట్లాడినా తరువాత కొంచెం తగ్గి, "మాది చిన్న దేశం అని మాకు తెలుసు.

కాని అవసరమయితే స్వతంత్ర కాశ్మీరుకొరకు మేము వేయి సంవత్సరాలవరకయినా పోరాటాన్ని కొనసాగించగలము" అని అతనన్నాడు.

కనీసం నడ్డివిరిగే దెబ్బలు తిన్నతరువాతనయినా, భారతదేశంతో పోల్చినపుడు పాకిస్తాన్ చిన్నదేశం అని మిష్టర్ భుట్టో గుర్తించడం ఉత్తమమైన సంగతి. ఆ దశలో అతను "స్వతంత్ర కాశ్మీరు"ను గురించి ప్రస్తావించడం విషాదభరితమైన విదూషకత్వంవలె ఉన్నది. ఏ కొద్ది స్వాతంత్ర్యం పాకిస్తాన్‌లో ఉన్నా అది ప్రమాదంలో ఉన్నదని అతను గుర్తించవలసి ఉండెను; అతను కాశ్మీరు స్వాతంత్ర్యాన్ని గురించి మాట్లాడడం హాస్యాస్పదమైన ప్రహసనంవంటిదితప్ప మరొకటికాదు. మన దేశంతో సంఘర్షణను కొనసాగించడానికి తాను వేయిసంవత్సరాలు బ్రతుకుతానని మిష్టర్ భుట్టో అనుకోవడం నిజంగా విచిత్రమైన విషయం.

అన్నిరంగాల్లోను పాకిస్తాన్ సేనలకు యెదురయిన పరాజయాలు పాకిస్తాన్ యుద్ధోన్మాద పాలకుల నరాలను ఛిన్నాభిన్నం చేసివేసినవి. ఇక మౌనం వహించడమే మంచిదని మిష్టర్ భుట్టో అనుకున్నాడు. అందువల్ల తన ప్రజలకు ధైర్యాన్ని, మనోనిబ్బరాన్ని కలిగించవలసిన బాధ్యత అధ్యక్షుని భుజస్కంధాలమీద పడింది. బలహీనపడిపోతున్న తన సైనికబలాల శక్తి పునరుజ్జీవింప చేయడానికొరకు యిక ఖ్వయ్యద్ అజమ్ జిన్నా పేరును తీసుకురావడం మంచిదని అత ననుకొన్నాడు. అనుకొని అతను యీ విధంగా వాదించాడు :

"పాకిస్తాన్‌పట్ల ద్వేషము, విశ్వాసఘాతుకత్వము రెండూ సమానంగా ఉన్న శత్రువుతో 10 కోట్ల పాకిస్తానీలు భయంకర యుద్ధంలో మునిగియున్న సమయాన యీ సంవత్సరం వచ్చింది. పుట్టుకలోనే పాకిస్తాన్‌ను వలిపివేయాలని భారతదేశం ప్రయత్నించింది. దాని కుట్రలకు భయపడకుండా 'పాకిస్తాన్ శాశ్వతంగా ఉండడానికి యేర్పడింది' అని ఖ్వయ్యద్ అజమ్ ఉద్ఘాటించారు. భగవంతుని దయవలన అది శాశ్వతంగా ఉండగలదు. తమ మాతృభూమి సంరక్షణకొరకు పాకిస్తానీలు చేస్తున్న త్యాగాలు వృధాకావు."

"శత్రువును దెబ్బమీద దెబ్బ కొట్టడ మొక్కటే పాకిస్తానీ ప్రజలు ఖ్వయ్యద్ అజమ్‌కు ఘటించవలసిన ఉత్తమ శ్రద్ధాంజలి. తమ భూభాగంనుండి శత్రువును తరిమివేయడమేగాక శత్రుదేశంలోనికే సమరాన్ని విస్తృతం చేయడానికి పాకిస్తానీలు దృఢనిశ్చయులై ఉన్నారు."

అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ మరియు అతని ముఠా యిటువంటి భారత వ్యతిరేక విద్వేష ప్రచారంతో పాకిస్తానీ ప్రజలను మోసం చేస్తున్నారు. ఎప్పుడుగూడా భారతదేశం పాకిస్తాన్ పట్ల చెడుభావాన్ని కలిగిఉండలేదు. పాకిస్తాన్ సుఖసంతోషాలతో ఉండాలని మన నాయకులు పదేపదే తమ శుభాకాంక్షలను ప్రకటించుతున్నారు. క్లిష్టమైన యీ సమయంలోగూడా మన ప్రధానమంత్రి యిదే అభిప్రాయాన్ని స్పష్టమైన మాటలలో పునరుద్ఘాటించినారు. కాని రావల్పిండి యుద్ధోన్మాదులకు యిది నచ్చదు; తమ ప్రజలు భారతదేశాన్ని ద్వేషించాలన్న దొక్కటే వారి అభిమతం. తరువాత జరిగిన సంఘటనల్ని పరిశీలించినప్పుడు ఆయూబ్‌ఖాన్ ప్రసంగం బధిరశంఖారావ మైనట్లు బోధపడగలదు.

శత్రువు భూభాగంలో ప్రవేశించినతరువాత మన సైనిక దళాలు యిక వెనుకకు తిరుగలేదు; వారు అచంచలంగా పురోగమించారు, శత్రువుల సాయుధ కవచబలాలుగాని, వైమానిక శక్తిగాని మన సేనల పురోగమనాన్ని ఆపలేకపోయినవి. కీలకమైన, ప్రియమైన లాహోరు, సియాల్‌కోటవంటి నగరాలు మన సేనల పురోగమన దుందుభిచేత కంపించిపోతున్న విషయాన్ని గమనించిన అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్‌కు ఆశలు ఉడిగిపోయినవి. అత నొక కాగితం పులివలె తయారయినాడు. ఊహాలోకపు ఉన్మాదంనుండి క్రిందికి కూలబడి వాస్తవికతను గుర్తించి యుద్ధవిరమణను గూర్చి మాట్లాడడం ప్రారంభించినాడు. సెప్టెంబరు 15వ తేదీన పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ యీ విధంగా అన్నాడు:


"మూల్యం ఎంతైనా జీవన్మరణ సంగ్రామాన్ని సాగించడానికి పాకిస్తాన్ దృఢంగా నిశ్చయించింది. అవసరమైనంత కాలం మేము పోరాటాన్ని కొనసాగించగలం. పోరాటాన్ని కొనసాగించి భారతదేశం యేమిసాధించగలదో నాకు తెలియదు. కాశ్మీరుకు సంపూర్ణ స్వాతంత్ర్యం అన్నది ఆచరణాత్మకం కాదు. అంతర్జాతీయ ముఠా రాజకీయాలకు యిది మరొక పాచికగా, కేంద్రంగా తయారుకాగలదు. ఇంగితజ్ఞానంతో నేను యుద్ధవిరమణమీద ఆశలు పెట్టుకొంటున్నాను. యుద్ధాన్ని విస్తృతం చెయ్యాలన్న ఉద్దేశ్యం పాకిస్తాన్‌కు లేదు; ఆత్మరక్షణకొరకు మాత్రమే ప్రయత్నిస్తున్నది. పాకిస్తాన్‌తో పోరాటంలో భారతదేశం యిరుక్కొనక పోయివుంటే ఆసియాలోను, మొత్తం ప్రపంచంలో దాని స్థానం మరొక విధంగా ఉండిఉండేది. పాకిస్తాన్ భారతదేశం స్థానాన్ని ఆక్రమించలేదు. రెండు దేశాలు అస్తిత్వంలోనికి వచ్చినవి గనుక మనం కలిసి ఉండడాని కొక పథకం అవసరమని 'వివేకం' చాటుతున్నది. యుద్ధవిరమణను సాధించడానికి అమెరికాగాని లేక కామన్వెల్తు దేశాలు సంయుక్తంగా గాని చేసే యే ఆచరణాత్మక ప్రయత్నాన్నైనయినా నేను ఆహ్వానించగలను. అమెరికా చాల ప్రముఖమైన పాత్రను నిర్వహించగలదు. ఈ సంకటస్థితి తన కిష్టంగాదని అమెరికా భారతదేశానికి, పాకిస్తానుకు చెప్పవచ్చును.

"అహా! ఎంత పతనం బాదుషా ఆయూబ్" అనడం ఒక్కటే యీ ప్రకటనమీద మనం యిప్పుడు చేయవలసిన వ్యాఖ్య.

—ప్రధాన సంపాదకుడు.

మనకు జంకులేదు. తొట్రుపాటులేదు. ఉన్నత విలువల సంరక్షణ నిమిత్తం మనం ఈ సవాలును ఎదుర్కొంటాం.

అచంచలమైన దీక్షతో సమరం సాగిస్తాం



డా. జాకిర్ హుస్సేన్

> "కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగంగా ఉండడం మన సాంస్కృతిక ఔన్నత్యానికి, మానవజాతి సాంస్కృతిక విశిష్టతకూ ఉత్తమ చిహ్నం"

భారత ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్ దేశప్రజల నుద్దేశించి ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి ఈ రాత్రి 8-30 గంటలకు ప్రసంగిస్తూ ఇలా అన్నారు.

ఒక మహదాశయ సాధనకు సర్వశక్తి సంపత్తులనూ సమీకరిస్తూ ఆ మహదాశయంలో విశ్వాసాన్ని ఆత్మస్ఫూర్తితో పునరుద్ఘాటించ వలసిన సమయాలు ప్రతి జాతి జీవితంలోనూ వస్తూ వుంటాయి. రణరంగంలో మన సైన్యాలు కదను త్రొక్కుతున్నాయి. తమ ప్రాణాలను కూడా త్యాగం చేయడానికి సిద్ధపడుతూ వీరోచిత పాత్రను ఘనంగా నిర్వహిస్తున్న సిబ్బంది మనకున్నారు. వారి కర్తవ్యనిష్ఠ స్వార్థరహితమైనది. బేషరతుగా, మారుమాట్లాడకుండా వారు తమ విధులను నిర్వహిస్తున్నారు. వారికి మన అండదండలు సంపూర్ణంగా వున్నాయని ఆచరణరీత్యా ప్రకటించడం మనవిధి. మనం ఎలా అయితే వారి త్యాగాలను హర్షిస్తూ గర్వపడతామో అలాగే, మన ఆలోచనా సరళికీ, క్రియలకూ వ్యాఖ్యానం చెప్పే తరుణంలో వారి వీర గాథలను స్మరిస్తూ భావికాలాలవారు గర్వపడేట్లు చూడవలసిన బాధ్యత మనది. ఈనాడు మనం చేయవలసి వస్తున్న యుద్ధం మనం కోరి తెచ్చుకున్నది కాదు.

బలవంతంగా ఇది మనపై రుద్దబడింది. మన జాతీయాశయమైన శాంతిరక్షణకు కృషి చేయడంలో మనం ఏ దేశ ప్రజలకూ తీసిపోము. హృదయపూర్వకంగా మనం శాంతిని కోరాము. మన శక్తులన్నీ కేంద్రీకరించి అందుకోసం కృషిచేశాము. ఎవరూ చెడిపోవాలని మనం కోరలేదు. ఇతరుల భూభాగం ఆవంతైనా మనకక్కరలేదు. అయితే మన దేశానికీ మన సమస్త జీవన భావానికీ ప్రాతిపదికగా నిలుస్తున్న సూత్రాలకు తిలోదకాలు యివ్వలేము. వాటి పరిరక్షణే మన కర్తవ్యం. కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగం; సుందరనందనోద్యానంలాంటిది. కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగంగా ఉండడం మన సాంస్కృతిక ఔన్నత్యానికి, మానవజాతి సాంస్కృతిక విశిష్టతకూ ఉత్తమ చిహ్నం.

మన స్వాతంత్ర్య సిద్ధికి షరతుగా దేశాన్ని విభజించాలన్న ఒత్తిడిరావడం దురదృష్టం. దేశ విభజనను కోరినవారు దానివల్ల కలిగే దుష్ఫలితాలను గుర్తించలేదు. తాము ముస్లింలు కావడంచేత, తాము భారతదేశంలో ఉండలేమన్న తప్పుడు వివాదానికి మద్దతు ఇవ్వవలసిందని భారత ముస్లింలను కోరడం జరిగింది. తమ తండ్రులూ, తాతలూ పుట్టిపెరిగి భారతీయ ఉమ్మడి సంస్కృతికి అనేక శతాబ్దాలుగా ఎంతో దోహదం చేసిన భారతదేశాన్ని వదలి రావలసిందని కోరడం జరిగింది. ఇళ్లూ, వాకిళ్ళనూ, మిత్రులనూ, పొరుగువారినీ, సౌహార్దాన్నీ, సాంస్కృతినీ అన్నింటినీ వదులుకోవాలని ముస్లింలను కోరారు. ఇప్పుడు భారతీయులకు అంటే హిందువులకూ, ముస్లిములకూ, సిక్కులకూ, క్రైస్తవులకూ, పార్శీలకూ ఇప్పుడూ, ఎప్పుడూ మాతృదేశంగా వున్న భారతదేశాన్ని తుపాకి కాల్పులతో బెదరిస్తూ కాశ్మీరులో అధిక సంఖ్యాకులు ముస్లిములు కాబట్టి కాశ్మీరు భారతదేశానికి చెందడం అన్యాయమనీ, దానిని పాకిస్తాన్‌కు దత్తం చేయాలనీ కోరడం జరుగుతోంది.


ఈ సమయంలో మనం స్వశక్తితోనూ, స్వీయ ఆదర్శాలతోనూ మన విశ్వాసాన్ని పటిష్ఠం చేసుకోవడం అవసరం. మనమంతా ఒకే జాతి అని సమాన ఆదర్శాలూ, ప్రయోజనాలూగల ఏక కుటుంబ

మని మన సమైక్యత ఏ సందర్భంలోనూ చెక్కుచెదరదని నిరూపించేందుకు ఈ మన వీరులు హిందువులూ, ముస్లిములు, సిక్కులూ, క్రైస్తవులూ, పార్శీలూ తమ ప్రాణాలను ఒడ్డుతున్నారన్న విషయాన్ని మనం గుర్తించాలి. మనలోని ముస్లిములు దైవేచ్ఛ ద్వారానే ఇక్కడ ఉన్నామని భారత పౌరసత్వం నైసర్గికంగానూ, ఆధ్యాత్మికంగానూ ఎంతో పవిత్రమైనదనీ గుర్తించాలి. నిజమైన ఇస్లాము మతానువర్తిగా వ్యవహరించాలి, స్వార్థానికీ, ద్వేషానికీ, రాజకీయ సాంఘిక బెడదలకూ మూలకందమైన భయాన్ని విడనాడాలి. సౌహార్దాన్నీ విశ్వాసాన్నీ పెంపొందించుకోవాలి. నిస్వార్థ సేవ చెయ్యాలి. పరమార్థ దృక్పథం అలవరుచుకోవాలి. ఈ బాధ్యతను తోటి ముస్లిం పౌరులు సదా గుర్తిస్తూవుండాలి. ఎట్టి అనుమానాలకూ తావు యివ్వరాదు. అధిక సంఖ్యాకుల నమ్మకాలనూ, విశ్వాసాలనూ గౌరవిస్తూ ఉమ్మడి ప్రయోజన సాధనకు కృషిచేయాలి.


యుద్ధరంగంలో పోరాడేందుకు, మన గౌరవ ప్రతిష్ఠలను కాపాడేందుకు, దేశం శాంతి భద్రతలను పరిరక్షించేందుకు మనకు సైన్యం ఉన్నది. మన సైన్యాలు తమ విధులను అత్యుత్తమంగా నిర్వహించాయి. మనమంతా వారికి ఋణపడ్డాం. అందువల్ల మనం అంతా వివేకవంతులైన సుశిక్షితులైన పౌరులవలె మెలగుతూ మన ఆదర్శాల సాధనకై విధులన్నింటినీ మనంతటమనం ఉత్సాహంగా హృదయపూర్వకంగా నిర్వహించవలసి ఉన్నది. యుద్ధరంగంలో సైనికులకు ఉత్తరువులు ఇచ్చేందుకు పైన సేనాధిపతులు ఉంటారు. ఇక్కడ మనమే అధికారులం. యుద్ధంలో విజయ సాధనకై వ్యూహరచన చేసినట్లుగా ఇక్కడ మనం చెయ్యవలసిన పని అంతా ఎలా చెయ్యాలో మనమే నిర్ణయించుకొని ప్రణాళిక తయారు చేసుకోవాలి. లక్ష్యసాధనకై మనమంతా పూర్తి జాగరూకత, మన శక్తి సామర్థ్యాలు, క్రమశిక్షణ ప్రదర్శించవలసిన తరుణం ఇది. వృథా చర్చలకు ఇది సమయంకాదు. మన ఆలోచనలు అతిచురుకుగా, ప్రయోజనాత్మకరమైన పద్ధతిలో పని చెయ్యాలి. మనలో అత్యుత్తమ ఆదర్శాలు గలవారినీ, మంచి అనుభవం కలవారినీ మనకు మార్గదర్శకత్వం వహించడానికి అవకాశం కల్పించాలి. వారిని మనం అనుసరించాలి. ఇలా అనుసరించడంలో మంచిచెడ్డలు మనంతట మనం స్వయంగా నిర్ణయించుకోవాలి. ప్రజాస్వామ్య వ్యవస్థకు చెందిన పౌరులం కావడంచేత మనకు మన వ్యక్తిత్వాన్నీ, వ్యక్తిగత స్వేచ్ఛనూ ప్రదర్శించడానికి హక్కు ఉన్నది. ప్రస్తుత సమయంలో ఈ హక్కును కాపాడుకోడానికే మనం సన్నద్ధం కావాలి. ప్రస్తుత సమయంలో పొలాల్లో, గనులలో, ఫ్యాక్టరీలలో కార్మికులు యావన్మందీ ఇంకా ఎక్కువ కష్టించి ఉత్పత్తి పెంపొందించాలి. ఆ విధంగా వారు మాతృదేశానికి అత్యుత్తమ సేవచేసినవారు కావాలి. యుద్ధంలో విజయం సాధించడానికి ఇది దోహదకారి అవుతుంది. ఇటు విద్యారంగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లూ ఇద్దరూకూడా ప్రజాసేవకై తమ జీవితాలను అంకితంచేసి తమ శక్తిసామర్థ్యాలను పెంపొందింపచేసుకోడానికి తీవ్రకృషి జరపాలి. వర్తకులుకూడా గురుతరమైన బాధ్యత నిర్వహించవలసి ఉన్నది. వస్తువుల ధరలు పెరగకుండా వారు నివారించవలసి ఉన్నది. వర్తకులు స్వలాభపరులై నిత్యావసర వస్తువుల ధరలు పెంచినా, అటువంటి సరుకులు దాచినా సామాన్య ప్రజలు తీవ్ర పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుంది. మన దృష్టి ఇటువంటి అనవసరపు స్వల్ప విషయాలపైకి మళ్లుతుంది. అందువల్ల ఇటువంటి ప్రమాదం రాకుండా వర్తకులు నివారించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రకటితాదర్శాల సామ్యంపైనేకాక సర్వప్రజల భావసమైక్యతపై కూడా జాతి శక్తి సంపత్తులు ఆధారపడిఉంటాయి. మనం ఎక్కడా తప్పటడుగు వెయ్యకుండా మన విధులను మనంతట మనం నిర్వహించడం అలవాటు చేసుకోవాలి. మన నాయకులపట్ల పూర్తి భక్తి విశ్వాసాలు ప్రకటించి వారిని అనుసరించవలసిన సమయం ఇది. ఈ సమయంలో మన నాయకులు తమ విద్యుక్త ధర్మాలను స్వేచ్ఛగా, శీఘ్రంగా నిర్వహించడానికి మనం అవకాశం కల్పించాలి. లక్ష్యసాధనకై సర్వప్రజలు జీవితాలనే అంకితం చేసుకోవలసిన తరుణం ఇది. మన జాతీయత తాలూకు ప్రాతిపదిక విలువలకూ, సిద్ధాంతాలకూ భంగం కలిగే ప్రమాదం ఏర్పడింది. ఈ ప్రమాదాన్ని మనం ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి ఎదుర్కోవలసిఉన్నది. దేశంలో సర్వప్రజలు పరస్పర సానుభూతి, సహకారం, సామరస్యం ప్రకటించి దేశానికి అత్యుత్తమంగా సేవ చెయ్యడానికి ప్రోత్సాహం కల్పించాలి. మన సిద్ధాంతాలనూ, మాతృదేశ స్వాతంత్ర్యాలనూ సంరక్షించుకోనేందుకు మనం అంతా దృఢ సంకల్పంతో కృషి చెయ్యడానికి సన్నద్ధంకావాలి.


నే నీ ప్రసంగం చేస్తున్న సమయంలోనే పూర్వం ఒకసారి మిత్రదోహ్రం చేసిన చైనా మరోసారి మిత్రద్రోహం చేయడానికి సన్నద్ధం అవుతోందని వార్తలు వస్తున్నాయి. సిక్కిం, లడఖ్‌లలో మన సరిహద్దులను అతిక్రమించడానికి చైనా తన సైన్యాలను మోహరించింది. తమ దుష్టచింతనకు అనుగుణ్యంగానే చైనా ఆచరణకు దిగితే ప్రపంచ స్వరూపాన్నీ పూర్తిగా మార్చివేసే సంక్షోభ పరిస్థితి ఏర్పడవచ్చు. ఇది వారికి అంత లాభంగా పరిణమించక పోవచ్చు. చైనా ప్రపంచంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మట్టు వెట్టచూస్తున్నది. ప్రజాస్వామిక సంస్థల మనుగడకు ముప్పు తెచ్చి పెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ఆశియా, ఆఫ్రికా దేశాలపైన సాధించాలని చూస్తున్నది. అంతేకాదు సర్వ ప్రపంచాన్నీ దాసోహమనిపించాలని పగటి కలలు కంటున్నది. ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండాలి. వాటి సంగతి ఎలా ఉన్నా మన కర్తవ్యం మనకు తెలుసు. మనకు జంకులేదు. తొట్రుపాటులేదు. మావవాళికి పరమ పవిత్రమైన ఉన్నత విలువల సంరక్షణ నిమిత్తం మనం ఈ సవాలును ఎదుర్కొంటాం. ఈశ్వరేచ్ఛతో మనం జయం సాధిస్తాం.



ఆగస్టు 22న రాజ్‌భవన్‌లో గవర్నర్ సమక్షాన శ్రీ టి. వి. రాఘవులు మంత్రిగా ప్రమాణం స్వీకరించారు.




గవర్నరు, ఆగస్టు 21న, తెలుగు భాషా సమితి నూతన భవనానికి ప్రారంభోత్సవం చేశారు.



రాజ్‌భవన్‌లో, ఆగస్టు 22న, గవర్నర్ సమక్షంలో శ్రీ యన్. చెంచురామానాయుడు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.




ఆగస్టు 23న, భారతదేశంలో ఫ్రెంచి రాయబారి మిస్టర్ గియన్‌డారిడన్‌కు బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం ఇవ్వబడ్డది.




గవర్నర్‌తో ఆంధ్ర ప్రదేశ్ మంత్రివర్గం.




ఆగస్టు 24వ తేదీన మిస్టర్ గియన్‌డారిడన్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు.



చంద్రగిరిలో, ఆగస్టు 28వ. పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.



శ్రీశైలం జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టు పరిపాలనా భవనానికి ఆగస్టు 26వ ప్రారంభోత్సవం జరిగిన సందర్భాన ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి.



అగస్టు 26వ తేదీనాడు సంపూర్ణమైన దేవాలయసత్కారాలతో శ్రీశైలం దేవాలయాన్ని సందర్శించుతున్న ముఖ్యమంత్రి



భవనపు ఒక దృశ్యం.





ఆగస్టు 28వ తిరుమలలో బీదలకు ఆహారపు పాకెట్లను పంచుతున్న ముఖ్యమంత్రి, శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి




ఆగస్టు 28న తిరుమల దేవాలయంలో ముఖ్యమంత్రి.




సెప్టెంబరు 13వ తేదీనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల రక్షణ కమిటీ సమావేశంలో ఉపన్యసించుతున్న ముఖ్యమంత్రి.



గుంటూరులో, సెప్టెంబరు 1వ తేదీన ప్రభుత్వ మహిళా కళాశాల హోమ్‌సైన్సు మరియు ఆర్ట్సు విభాగానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.




సమావేశపు ఒక దృశ్యం.



సెప్టెంబరు 1వ తేదీన ముఖ్యమంత్రి గుంటూరులోని కాసు సాయమ్మ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు.



సెప్టెంబరు 11న హైదరాబాద్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్‌లో రక్తదానం చేస్తున్న జయపూర్ మహారాజు శ్రీ రామకృష్ణదేవ్




సెప్టెంబరు 11న ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో
రక్తదానం చేస్తున్న ఒక మహిళ





ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భాన రాష్ట్ర సమాచార కేంద్రం నిర్వహించిన పత్ర, చిత్ర రచన
పోటీల్లో పాల్గొంటున్న పన్నెండు సంవత్సరాలలోపు బడిపిల్లలు.





పోటీలో పాల్గొంటున్న కళాశాల విద్యార్థుల రెండు దృశ్యాలు.

ప్రస్తుత సంఘర్షణలో ప్రజలంతా జాగరూకత వహించాలి

ఈ సంఘర్షణలో విజయం మనదే

గుల్జారీలాల్ నందా



దేశప్రజ లందరూ అప్రమత్తులై, అన్ని రకాల గూఢచారులనూ, విద్రోహక శక్తులనూ, దుండగులనూ, జాగ్రత్తగా కనిపెట్టి, కఠినచర్య తీసుకోవాలనీ కేంద్ర దేశీయాంగ మంత్రి శ్రీగుల్జారీలాల్‌నందా, సెప్టెంబర్ 9న దేశప్రజలనుద్దేశించి చేసిన రేడియో ప్రసంగంలో విజ్ఞప్తిచేశారు.

మన దేశంలోపలి విద్రోహక శక్తులనూ, దుండగీండ్రనూ, గూఢచారులనూ అణిచి వేయడానికి ప్రభుత్వం శాంతిభద్రతల సంరక్షణ యంత్రాంగాన్నీ, ప్రభుత్వం యొక్క సర్వశక్తులనూ యిందు నిమిత్తం సంపూర్ణంగా వినియోగించగలదని హామీ యిచ్చారు.

ప్రజలందరూ క్రమశిక్షణతో, శక్తి వంచనలేకుండా కష్టించి పనిచేసి, సంఘ సంక్షేమ బాధ్యతలను దృష్టిలో పెట్టుకుని, తమ విద్యుక్తధర్మాన్ని అన్నిపరిస్థితుల లోనూ నిర్వహించాలనీ, ప్రస్తుత సంఘర్షణలో విజయాన్ని సాధించి, భారతదేశ సుస్థిరతను కాపాడితీరగలమన్న స్థిర సంకల్పంతో, ప్రజలందరూ జాగరూకులై వ్యవహరించాలనీ శ్రీ నందా ఉద్బోధించారు.

అసమాన శౌర్యపరాక్రమాలనూ, ధైర్య సాహసాలనూ ప్రదర్శించి వీరోచితంగా పోరాడుతున్న మన సైనికులకూ, వైమానిక దళ సిబ్బందికీ శ్రీనందా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భారత సైనికుల ప్రస్తుత వీరోచితపాత్ర దేశచరిత్రలో స్థిరంగా వుండిపోగలదని దేశీయాంగ మంత్రి అన్నారు.

పౌరరక్షణ కార్యకలాపాలను గురించి ప్రస్తావిస్తూ, పౌరరక్షణ సంస్థను నెలకొల్పడానికీ, ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడానికీ, అగ్నిమాపక చర్యలు నిర్వహించడానికీ, తదితర బాధ్యతలు నిర్వహించడానికి చర్యలు కొంతకాలం క్రిందటే తీసుకోవడం జరిగినదన్నారు. ప్రస్తుతం ఈ విషయంలో ఏమైనా కొరత ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని కూడ శ్రీనందా చెప్పారు.

పుకార్లు ఎంతమాత్రం నమ్మవద్దని ఆయన ప్రజలకు సలహాయిచ్చారు. నిరాధారమైన పుకార్లు కావాలని ప్రచారం చేసే దుష్టులు కొద్దిమంది ఉండవచ్చుననీ, ప్రజల విశ్వాసం చెదరగొట్టడమే అటువంటి దుష్టుల లక్ష్యమనీ, అందువల్ల వీరివిషయం జాగ్రత్త పడాలనీ, వీరిని నేరస్థులుగా పరిగణించడం జరుగుతుందనీ ఆయన వివరించారు. ఈ సమయంలో ప్రజలంతా ప్రశాంతచిత్తులై అత్యంత క్రమశిక్షణతో మెలగడం అవసరమని ఆయన ఉద్బోధించారు. ప్రస్తుత అత్యవసర పరిస్థితిలో కొన్ని సాంఘిక ప్రయోజనాలు కలుగుతాయనీ, దురాక్రమణను త్రిప్పికొట్టడానికి భారతజాతి యావత్తూ సంఘటితమై సమాయత్తమైందనీ, ఎల్లెడలా దేశభక్తీ, జాతీయతా వెల్లివిరిసిందనీ దీనిమూలంగా శాశ్వత ప్రయోజనాలు సాధించేందుకుగాను మత కుల వర్గ సామరస్యం, పారిశ్రామిక శాంతి, సాంఘిక రంగంలో శాంతి భద్రతలు, ప్రభుత్వం ప్రజలమధ్య ప్రయోజనాత్మకమైన సహకారం సాధించడం

ద్వారా ప్రయత్నం జరగాలని. ఉత్పత్తి పూర్వంకంటె మరింత శీఘ్రంగా జరగాలనీ, దేశంలో కార్మికవర్గాలన్నీ ఉత్పత్తి పెంపొందింప చెయ్యడానికి ఆనందోత్సాహాలతో కంకణధారులు కావడం గర్వింప వలసిన విషయమనీ ఆయన అన్నారు.

సంఘజీవితం శాంతియుతంగా కొనసాగేలా చూడాలనీ. ఏటువంటి సంఘర్షణలు తలఎత్తకుండా నివారించాలనీ, ఇందు మూలంగా ప్రస్తుత విపత్కర పరిస్థితిలో దురాక్రమణదారుని ప్రతిఘటించి. తిరోగమింప చెయ్యడానికి జాతికి బలం సమకూరుతుందనీ. దేశంలో మత సామరస్యం. శాంతి పరిరక్షణ. ప్రభుత్వం, మరొకవంక ప్రజలు తమ పవిత్ర కర్తవ్యంగా భావించాలనీ ఆయన ఉద్బోధించారు. సంఘ వ్యతిరేక శక్తులు ఏరూపంలో తలఎత్తినా ఎంత మాత్రం సహించడం జరగదనీ, అత్యవసరంగా కావలసివచ్చే కొన్నిరకాల వస్తువుల ధరలు పెరగకుండా చూడాలనీ. వాడకందారులకు అన్యాయం జరగకుండా చూడడానికీ, ధరలు పెరగకుండా చూడటానికీ వర్తకులంతా గట్టికృషి చెయ్యాలనీ, ఈ విషయంలో ప్రభుత్వానికి సహాయం చెయ్యడానికి వారు ముందుకు రావాలనీ శ్రీ వందా ఉద్బోధించారు. మన జాతికీ, మతాతీత దృక్పథానికి, సామ్యవాద సిద్ధాంతాలకూ కట్టుబడి ప్రపంచ శాంతిసాధనకై కృషిచేస్తూ ఆర్థిక రంగంలో క్రమాభివృద్ధి సాధిస్తూ పురోగమిస్తున్న మన ప్రజాస్వామ్యవ్యవస్థ విలువలకూ ఇది నిజంగా పరీక్షాసమయం అనికూడా ఆయన అన్నారు.

భారతజాతి ఈ ప్రమాదాన్ని ఎదుర్కొని. విజయాన్ని సాధించగలదనీ. విజయసాధనకు త్యాగాలు అవసరమనీ, మానవ ప్రవర్తనకు సంబంధించిన మహోదాత్తమైన సూత్రాలకూ. మనజాతి మహోజ్జ్వల భవిష్యత్తుకూ. కడుఆనందంతో ఆ త్యాగాలను చేయగలమనీ శ్రీ నందా అన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలు

- ఆహార ధాన్యాల ధరలను స్థిరీకరించాలనే దృష్టితో రాష్ట్రంలోని మిగులు ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయం జరిగింది.
- ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 1964వ సంవత్సరపు మ్యునిసిపల్ ఎన్నికలను ఒక సంవత్సరం పాటు వాయిదావేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించ బడింది.
- అదనపు భూమిశిస్తు అసెస్‌మెంట్ చట్టానికి వ్యతిరేకంగా యిటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు యిచ్చిన ఉత్తర్వు మీద సుప్రీంకోర్టుకు అప్పీలు చేయడానికి నిర్ణయం జరిగింది.
- అన్ని దశల్లోను రాష్ట్రప్రజల రక్షణ సంఘాలను పునరుద్ధరించాలని నిర్ణయింప బడింది.

ఐ. రా. స. ప్రధాన సైనిక పరిశీలకుడు
జనరల్ నిమ్మో ధృవీకరణ —

"కాశ్మీరులో ప్రవేశించింది పాకిస్తాన్ దోపిడిమూకలే"

యుద్ధవిరమణ శ్రేణిపై ఇండియా వైపున జరిగిన దాడులలో, దోపిడీ మూకలు ఉపయోగించిన ఆయుధాలు, మందు గుండు సామగ్రి పాకిస్తాన్‌కు చెందినవని రుజువైనట్లు సమితి పరిశీలకులు జరిపిన దర్యాప్తులలో తేలిందని సమితి ప్రధాన సైనిక పరిశీలకుడు తన నివేదికలో స్పష్టం చేశారు. ఈ ఆయుధాలపై పాకిస్తానీ గుర్తు లున్నాయి. కొన్నిటిమీద యీ గుర్తులను చెరిపేశారు.

ఈ నివేదికను సమితి సభ్యులకు సర్క్యులేట్ చేశారు.

సెక్రటరీజనరల్ నివేదికను నేడు లోక్ సభకు సమర్పించారు.

ఆగస్టు 5నుంచి సెప్టెంబరు 2వరకు జరిగిన సంఘటనల జాబితాను ప్రధానసైనిక పరిశీలకుడి నివేదికలో చేర్చారు.

పూంఛ్ నగరంలోను, శ్రీనగర్ ప్రాంతంలోని నౌషేరా రంగంలోను సెప్టెంబర్ 1వ తేదీన పాకిస్తాన్ ఫిరంగులు కాల్చిందన్న ఇండియా ఫిర్యాదును యీ నివేదిక ధృవపరిచింది.

శ్రీనగర్ - లేరోడ్డులో గుండీవద్ద ఇండియా శకటదళంపై సాయుధ పాకిస్తానీలు పొంచివుండి దాడి చేశారు. సమితి పరిశీలకులు యీ సంఘర్షణలో స్వాధీనమైన ఒక ఖైదీని, దోపిడీమూకలు వదిలేసి వెళ్ళిన ఆయుధాలను చూశారు.

తాను కారకోరం స్కౌట్స్‌లో సభ్యుడనని ఆ ఖైదీ సమితి పరిశీలకులకు తెలియచేశాడు. శ్రీనగరు - లేరోడ్డులోనిగుండీ వద్ద వంతెనను పడగొట్టడానికి తనను నియమించినట్లు అతను తెలిపాడు.

ఈ దోపిడీ మూకలు వదిలేసిన ఆయుధాలు తదితర మందుగుండుసామగ్రి పాకిస్తాన్‌లో తయారైందని పరిశీలకులు గుర్తించారు.

సెప్టెంబరు 1, 2 తేదీలలో జరిగిన సంఘటనలను ప్రస్తావించి యీ నివేదికలో ఇలా అన్నారు: పాకిస్తాన్ సైన్యాలు దాదాపు 30 చదరపుమైళ్ళ ప్రాంతాన్ని ఆక్రమించు కొన్నట్లు యీ పరిశీలకులు తెలిపారు.

బారాముల్లా రంగంలో ఆగస్టు 7, 8 తేదీలలోని సంఘటనలను ప్రస్తావించి దోపిడీ మూకలు విధ్వంసక చర్యలు జరపడానికి ప్రయత్నించినట్లు యీ నివేదికలో ధృవపరిచారు. దోపిడి మూకలు 5 వంతెనలను, 6 పికెట్లను ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. ఇవన్నీ యుద్ధవిరమణ శ్రేణి నుంచి 2 - 17 మైళ్ళ మధ్యలో వున్నాయి.

13 మంది భారతీయసైనికులు మరణించారు. 12 మంది గాయపడ్డారు. ఒక పోలీసు గాయపడ్డాడు. ఒక దోపిడీదారు మరణించాడు. మరొకరు గాయపడ్డారు.

గాయపడ్డ దోపిడీమూకకు చెందిన ఒకరు స్వాధీనమైనారు. ఇతనిని పరిశీలకులుకలిసి మాట్లాడగా, తాను 18వ ఆజాద్ కాశ్మీరు కాల్బలదళానికి చెందిన సైనికుడననీ, యీ దోపిడీ బృందంలో తనదళానికి చెందిన 300 మంది సైనికులున్నారనీ, వందమంది ముజాహిద్ (గెరిల్లాయుద్ధంలో శిక్షణ పొందిన సాయుధ సివిలియన్లు) వున్నారనీ అతను తెలిపాడు. వీరువదిలేసిన ఆయుధాలు పాకిస్తాలో తయారైనవని పరిశీలకులు అన్నారు.

పూంఛ్ రంగాన్ని ప్రస్తావించి, వెయ్యి మంది దోపిడీదార్లు ఆగస్టు 7-8 తేదీల్లో దాడి చేశారని, వీరు యుద్ధవిరమణ శ్రేణి దాటి వచ్చినట్లు తెలిసిందని యీ నివేదికలో అన్నారు.

కార్గిల్ రంగంలో ఆగస్టు 10న దాడి జరిగిన విషయాన్ని ధృవపరుస్తూ సమితి పరిశీలకులు, 5గురు భారతసైనికులు, ఇద్దరు పోలీసులు, ఒకదోపిడీదారు మరణించినట్లు చూశారని యీ నివేదికలో అన్నారు. 5గురు భారత్‌సైనికులు, ఒక సైనిక పోర్టరు గాయపడ్డారు.

మరణించిన దోపిడీదారు ధరించే దుస్తులు పాకిస్తాన్ స్కౌట్సు ధరించే దుస్తులుమాదిరివేనని వీరన్నారు.

వరిసముత్యాలు

శ్లో॥ పరాక్రమోత్సాహవిజృంభితార్చిః నిశ్వాసధూమః స్వబలప్రతాపః।
ప్రతాపవాన్ సంయతి శాత్రవాగ్నిః నిర్వాప్యతే వీరపయోధరేణ॥

—వాల్మీకి.

శౌర్యము, ఉత్సాహము అనెడు మండుచున్న జ్వాలలు గలిగి, నిట్టూర్పు అనెడు పొగగలిగి, తన బలమనెడు ప్రతాపమును ఊతగా గొని యుద్ధమునందు సర్వత్రవ్యాపించిన మంటలుగల శాత్రవాగ్ని, వీరాగ్రేసరులనెడు వర్షమేఘములచేత చల్లార్చబడుచున్నది.

శ్లో॥ తస్మిన్ వీరశరోత్కృత్తే బలే మహతి విద్విషాం।
ఉత్థితం దదృశేఽన్యచ్చ కబంధేభ్యో న కించన॥

—కాళిదాస కవి.

వీరాగ్రేసరుల మారణాయుధములచే శత్రువులందరు తెగి పడియున్న యుద్ధభూమిలో, శత్రువుల మొండెములు తప్ప మరి యేదియు పైకి ఎగురుట కానరాలేదు.

చ॥ ఘనతరదుష్టశాత్రవ నికాయకళేబరపాతఘట్టనం
దనరి యుగాంతకాలచలితంబునుఁబోలె బయోధి మ్రోసె; న
వ్వనధిరవంబుకంటె ననివారిత మై చెలగెన్, సువీరవా
హినిపటుసింహనాదహయహేషితహేతివిజృంభితధ్వనుల్

—నన్నయభట్టారకుడు.

దుష్టులైన గొప్ప గొప్ప శత్రువుల శరీరములు పడిపోయి, ఆ శరీరముల ఒరపిడిచేత సముద్రము ప్రళయకాలమునందువలె మ్రోగెను. ఆ ధ్వనికంటెను అధికముగా, వీరాగ్రేసరుల సింహనాదములు, గుఱ్ఱముల సకిలింపులు, ఆయుధములయొక్క విజృంభణధ్వనులు గలిసి అఖండముగా చెలరేగెను.

తే॥ మిత్రబలసంపన్నుఁ డైన నమిత్రు మిత్ర
బలముతోడ భేదించి దోర్బలముఁ జలముఁ
గలిగి దేశబలంబును గాలబలముఁ
గలుగువాని కసాధ్యంబు గలదె యెందు?॥

— నన్నయభట్టారకుడు.

ఒకవేళ శత్రువు, అతని మిత్రబలము చూచుకొని త్రుళ్ళిపడుచు విజృంభించుచుండినచో, అతని ఆ మిత్రబలముతోపాటు, అతని బలముగూడ అణచుటకు మనము పట్టుదలతో భుజబల పరాక్రమములు మెరయునట్లుగా దేశకాలముల బలములనుగూడ గమనించుచు పోరాడినచో అసాధ్య మేమియు ఎక్కడఁగూడను ఉండదు,

శా॥ నాతోఁ బోరఁగ నెంతవాఁడ విసిరో నాసాటియే నీవు? వి
ఖ్యాతుండన్ గులజుండ సద్గుణుఁడ సత్కర్మస్వభావుండ నీ
కేతాదృగ్విభవంబు లెల్లఁ గలవే యీరీతిఁ బోరాడ; దు
ర్జాతుండా! హనుమంతుముం దియటయారా! కుప్పిగంతుల్ జడా!

—పోతనామాత్యుడు.

ఒరీ! దుష్టుడా! నాతోగూడ పోరాడుటకు ఛీ! నీ బలమెంత? నీ వెంతరా? నేనంటే యేమనుకున్నావు? నేను ప్రపంచములో కీర్తి ప్రతిష్ఠలు గలవాడను; సత్కులములో పుట్టినవాడను; సద్గుణములను అలవరచుకొన్న వాడను; సత్కర్మలు చేయుట. సద్ధర్మములను అవలంబించుట పుట్టుకతోడనే నన్ను ఆశ్రయించినవి; నాకుగల యీ సద్గుణ సంపదలలో ఒక్కటియైనను నీకు గలదా నాతో పోరాడుటకు. ఓరీ! దుర్జాతుడా! మూర్ఖుడా! హనుమంతుని ముందా నీ కుప్పిగంతులు? ఛీ! పొమ్ము.

శా॥ నారాచప్రముఖాస్త్రజాలపటువిన్యాసంబు తీవ్రత్వరా
ఘోరంబై విలసిల్లఁ జేయ సమరక్షోణీతలం బంతయున్
వైరివ్రాతశవావృతం బగుడు, విశ్వంబెల్ల వేనోళ్ల న
వ్వీరాగ్రేసర జేతలన్ బొగడి రుద్వేలప్రమోదంబునన్

—తిక్కనసోమయాజి.

అనేక మారణాయుధములు మిక్కిలి వేగముగా ప్రయోగింపగా వాటి దాడికి తట్టుకోలేక చచ్చిన శత్రువుల శవములు యుద్ధభూమి యంతయు పరవబడియుండుటను జూచి, ఆయుద్ధ విజేతలగు వీరులను ప్రపంచమంతయు సంతోషంబుతో వేనోళ్ళ పొగడిరి.

ఉ॥ క్షాత్రసమగ్రు లార్యనుత గౌరవదీప్తులు వర్ణనీయసౌ
భ్రాత్రు లుదాత్తదైవబలభవ్యులు భారతవంశదీపకుల్,
పుత్రులు, వారి నాపదలు పొందునె? యోపినపట్టు మిత్రు లీ
ధాత్రిఁ గడంగి మే లగువిధానము వారికిఁ గూర్పకుందురే?

—తిక్కనసోమయాజి.

భారతవంశ దీపకులైన సత్పుత్రులు (భారతీయులు) క్షాత్ర తేజముతో నిండినవారు; ప్రపంచములోని పెద్దల పొగడ్తల గన్నవారు; తమసాటి దేశీయులయెడ సోదరభావము గలవారు; అట్టివారికి ఆపదలు కలుగునా? భూమండలమునందలి మిత్రులందరును, వారికి మేలుచేయకుందురా?

ఉ॥ మెండగుయుద్ధభూరుహాముమీఁదికి నెక్కి స్వబాహువీర్య మన్
దండము నూని దోలన మొనర్పఁగఁ దత్తరుసంగతంబు లౌ
పండులు తండతండములు వ్రాలె ననన్ దగె వీరకోటిదో
ర్దండపుహేతులన్ దెగుచు ధాత్రికిఁ జెందురిపూత్తమాంగముల్

—ఆంధ్ర బిల్హణ.

గొప్ప యుద్ధవృక్షము మీదికి ఎక్కి, తమ బాహుబలమనెడు కట్టను బుచ్చుకొని, యుద్ధవృక్షమును ఊపి కొట్టగా, ఆ చెట్టు పండ్లు భూమిపైన రాలి పడుచుండెనా యనునట్లు, వీరుల ఆయుధ ప్రహారములచేత తెగి క్రింద పడుచుండు శత్రువుల తలలు ఒప్పెను.

పార్లమెంటులో ప్రధానమంత్రి ప్రకటన :

సెప్టెంబరు 23 నుండి కాల్పుల విరమణ

కాల్పుల విరమణనుగూర్చి సెప్టెంబరు 22వ తేదీన ప్రధానమంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనలోని ముఖ్యమైన అంశాలు

ఉభయదేశాల ప్రభుత్వాలూ భారత కాలమానం ప్రకారం ఇవాళ మధ్యాహ్నం 12-30 గంటలకు కాల్పుల విరమణకు ఉత్తరువులు ఇవ్వాలని భద్రతా సమితి కోరిన విషయాన్ని గౌరవ సభ్యులు గుర్తించే ఉంటారు. 1965 సెప్టెంబరు 14, 15 తేదీలలో నేను సమితి ఉన్నత కార్యదర్శికి వ్రాసిన లేఖలలో, కాల్పుల విరమణకు సంబంధించి భారత ప్రభుత్వ అభిప్రాయాలు సమగ్రంగానూ అసందిగ్ధంగానూ పేర్కొనబడ్డాయి. పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించిందని తెలియగానే ఎట్టి షరతులు లేకుండా కాల్పుల విరమణకు ఆదేశాలిచ్చేందుకు భారత ప్రభుత్వం అంగీకరించిందని ఆ లేఖలలో స్పష్టంగా తెలియచేయబడింది. అందుకే భద్రతా సమితి తీర్మానం అందగానే మన పూర్వ వాదానికి అనుగుణ్యంగా ఒక లేఖను సమితి ఉన్నత కార్యదర్శికి పంపాము. పాకిస్తాన్ కూడా అందుకంగీకరించిన పక్షంలో నిర్ణీత తేదీన నిర్ణీత సమయం నుంచి కాల్పుల విరమణకు మాత్రం భారత ప్రభుత్వం ఆదేశాలిచ్చేందుకు సంసిద్ధంగా వుందని అందులో తెలియచేశాము.

పాకిస్తాన్ విదేశాంగమంత్రి అభ్యర్ధనపై భద్రతాసమితి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయబడిందని కొంత సేపు క్రితం మరో వార్త అందింది. ఆ సమావేశంలో కాల్పుల విరమణకూ, పోరాటాన్ని నిలుపుచేసేందుకు ఉత్తరువులిచ్చేందుకు తాముకూడా అంగీకరిస్తున్నామని పాకిస్తాన్ తరఫున ఒక ప్రకటన చేయబడింది. రేపు తెల్లవారుఝామున అంటే తెల్లవారితే గురువారమనగా మూడున్నర గంటలకు పూర్తిగా కాల్పుల విరమణను పాటించవలసిందని ఆదేశిస్తూ యుద్ధరంగంలోని మన దళనాయకులకు ఉత్తరువులు జారీ చేయబడుతున్నాయి.

భద్రతాసమితి తీర్మానంలో మరికొన్ని ఇతర అంశాలను గురించిన ప్రస్తావనకూడా వుంది. ప్రస్తుతదశలో ఇతర వివరాలను గురించి నేను ప్రస్తావించ దలచుకోలేదు.

ఇప్పుడు పోరాటం ఆగిపోతుంది. శాంతి ఉత్తమవిధానం. అయితే భద్రతాసమితిలో ప్రసంగిస్తూ ఇవాళ పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఒక బెదిరింపుచేశారు. అందువల్ల మనం ఎంతో మెళుకువతోనూ అప్రమత్తతతోనూ ఉండడం అవసరం.

జాతి ఇటీవల విషమపరిస్థితిని ఎదుర్కొంటోంది. ఇవి గడ్డు దినాలే కాని అవికూడ గొప్పలక్ష్యాన్ని సాధించాయి. భారత ప్రజలు అందరూ ఒక సమైక్యజాతిగా రూపొందారనీ, ఒకేలక్ష్యం, ఒకే మాట వారిని సమైక్య పరుస్తున్నాయనీ సర్వ ప్రపంచమూ ఇప్పుడు తెలుసుకుంది. యుద్ధరంగంలో అన్నిమతాల వారూ మహత్తర త్యాగాలుచేసి తాము నూటికి నూరుపాళ్ళు భారతీయులమేనని ఇతర అనుబంధాలు అప్రధానమైనవని నిరూపించారు.

పార్లమెంటు తరఫునా, యావద్దేశం తరఫునా మన సాయుధ దళాలకు హృదయపూర్వకమైన అభినందనలు తెలియచేయగోరుతున్నాను. తమ శౌర్య పరాక్రమాల ద్వారానూ, వీర కృత్యాల ద్వారానూ భారత ప్రజలో వారు ఒక క్రొత్తవిశ్వాసాన్ని జనింపచేశారు. యుద్ధరంగంలో తమ ఆప్తులను కోల్పోయిన వారు మన స్వాతంత్ర్య పరిరక్షణకు అమూల్యమైన దోహదం కూర్చారు. భారతజాతి వారికి సర్వదా కృతజ్ఞతను వ్యక్తపరుస్తుంది. మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ముప్పువాటిల్లిన ఈ పరీక్షా సమయంలో దేశంలోని నలభైఏడు కోట్ల మంది ప్రజలు ఒక్కటిగా నిలిచి ఈ ప్రమాదాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు.

భారత పాకిస్తాన్‌లమధ్య సంబంధాలను మెరుగుపరచడానికి తమ పలుకుబడి వినియోగించగలమని రష్యా మంత్రిమండలి అధ్యక్షులు శ్రీ కొసిగిన్ వద్దనుంచి ఈ నెల 18వ తారీకున నాకొక సందేశం అందింది. శ్రీ కొసిగిన్ ఎంతో సదుద్దేశంతో ఈ సందేశం పంపారు. భారత పాకిస్తాన్ దేశాలు శాంతియుతమైన యిరుగు పొరుగు దేశాలుగా చివరికి మనుగడ సాగిస్తూనే ఉండాలన్న అభిప్రాయాన్ని ఎవరూ కాదనలేరు.

మన సాయుధసేనలు వెనక్కు వస్తూ సైనిక నిర్మాణాలంటూ చెప్పబడిన కొన్నింటిని విధ్వంసం చేశారని చైనా ప్రకటించినట్లు నాకు తెలిసింది. ఇది కేవలం ఊహాగానం.

మరుక్షణంలో చైనా ఏమి చేస్తుందో మనకుతెలియదు. అందువల్ల ఉత్తర సరిహద్దు విషయంలో మనం నిత్యజాగరూకులమై వుండాలి.

భారత జాతికి ఈనాడు పరీక్షా సమయం. దేశప్రజ అందరూ అట్టి భావనతోనే వున్నారు. మన స్వాతంత్ర్య రక్షణకు ఆ భావనే శ్రీరామరక్ష. ఈ సమయంలో మనం అనేక ఇబ్బందులకు గురికావలసి వచ్చింది. కాని దేశప్రజ అందరూ కడు ధైర్య సాహసాలతో దురాక్రమణను ప్రతిఘటించడానికి మహోద్వేగంతో ముందుకు వచ్చారు. మన సాయుధ సేనలపై గురుతరమైన బాధ్యత ఉన్నది. వారు నిండు ఉత్సాహంతో ఉన్నారనడంలో సందేహంలేదు. ప్రస్తుత పరిస్థితి యొక్క తీవ్రతను తక్కువ అంచనా వేసే ఉద్దేశం మాకులేదు. అయితే మన స్వాతంత్ర్యానికి ఎదురైన ఈ సవాలుని ఎదురించి తీరాలని మనం దృఢ సంకల్పం చేసుకొన్నాము.

విజయ దుందుభి

గత రెండు ప్రపంచ యుద్ధాలలోను మన జవానులు, వైమానికులు, నౌకాదళాలు, మెసపటోమియా, ట్రిపోలి, యూరపులోని యుద్ధరంగాలలోను, బర్మా అడవులలోని యుద్ధాలలోను వీరోచితంగా పోరాడి ధైర్య సాహసాలు గల వీరులుగా ప్రఖ్యాతిగాంచినారు. వారి వీరోచిత కృత్యాలకు కేవలం గుర్తింపు లభింపగా విదేశీ కెప్టెనులకు, కమాండర్లకు ప్రాముఖ్యం లభించి కీర్తి సంపాదించారు. విదేశీయ పరిపాలనలో మనం ఉన్నందున యీ విధంగా జరగడం అనివార్యమైనది.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత పరిస్థితి పూర్తిగా మార్పుచెందింది. మన సైన్యాలు, వైమానిక దళాలు, నౌకాదళాలు, యితరులకొరకు పోరాడాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. ఇప్పుడు మనస్ఫూర్తిగా, నిండుహృదయంతో వారు మాతృదేశం సేవ చేయగలుగుతారు. మనదేశం శాంతిప్రియత్వం కలది. అయితే యితరులు మనను రెచ్చగొట్టి, యుద్ధంలోకి లాగినప్పుడు, గత్యంతరంలేక కేవలం ఆత్మరక్షణార్థం యెదిరించి పోరాడాల్సి వస్తుంది. ఇప్పుడు అటువంటి పరిస్థితి ఏర్పడింది. జాతి ఔన్నత్యాన్ని నిలుపడానికి యుద్ధంలో అన్ని రంగాలలోను మన సైనికులు, వైమానికులు, నౌకాదళాలు తమ ధైర్యాన్నీ నేర్పునూ ప్రదర్శించాల్సిన అవకాశం ఏర్పడింది. ఈ పవిత్ర కార్యంలో వారు తమ శౌర్యప్రతాపాలను ప్రదర్శించి ప్రపంచ మన్ననలను పొందారు. పాశ్చాత్య కూటమి రాజ్యాలనుండి అపారమైన అధునాతన మారణాయుధాలను సహాయంగా పొందిన దురాక్రమణదారు ఆయుధ సంపత్తితో మైమరచి ఉన్నాడు. ఈ మత్తుతో దురాక్రమణదారు మన పవిత్ర భూమిని తన చెప్పుచేతుల్లోకి లొంగదీసుకోవాలని కలలు కంటున్నాడు. ఈ స్థితిలో మనకు అంతటి అత్యంత ఆధునికమైన ఆయుధాలు లేనప్పటికీ మన జవానులు, వైమానికులు తమ శక్తియుక్తులతోను, ధైర్య సాహసాలతోను దురాక్రమణదారుని యెదుర్కొని వెనుకంజ వేయించడమేగాక తల నేలకేసుకునేవిధంగా చేసి ఘోర పరాజయం కలుగజేశారు.

వారు ప్రదర్శించిన సాహసకృత్యాలు సైనిక చరిత్రలో సువర్ణాక్షరాలతో వ్రాయదగినవిగా ఉన్నాయి. మన వీరసైనికుల సాహసానికి నిజంగా గర్వించాలి. ఆసియాలో స్వేచ్ఛాస్వాతంత్ర్య దీపికను దురాక్రమణదారు చల్లార్పకుండా నిరోధించే పవిత్ర కర్తవ్యాన్ని వీరోచితంగా నిర్వహిస్తున్న మన సైనికుల వీరగాథలు మన చరిత్రలో శాశ్వతంగా నిలిచిఉంటాయి. "ఆంధ్రప్రదేశ్" పత్రికలో మన జవానుల అవక్రపరాక్రమ కృత్యాలను ప్రచురించడం ద్వారా వారికి మా జోహర్లు అందజేసే అవకాశం, సద్భాగ్యం మాకు కలిగినవి.

ఈ వీరకృత్యాలలో అసువులుబాసిన, సజీవంగాఉన్న మన భారత వీరపుత్రుల విజయదుందుభులు ఎల్లకాలం మారుమ్రోగుతూ ఉండాలి. ఇవి ప్రతి భారతీయుని హృదయాన్ని స్పందింపజేస్తాయి. వారి సాహసగాధలు, మాతృభూమి సంరక్షణకొరకు వారుచేసిన త్యాగాలు, వారి ఉత్తేజిత కార్యాలు ఆచంద్రతారార్కం మన దేశభక్తిని ఉద్దీపింప చేయగలవు.


భారత వైమానిక బలం
అధికారులు



వింగ్‌కమాండర్ డబ్ల్యు. యమ్. గుడ్‌మన్
మహావీర్ చక్ర



స్క్వాడ్రన్‌లీడర్ యమ్. యస్. జాతర్
వీర్ చక్ర



వింగ్‌కమాండర్ పి. పి. సింగ్
మహావీర్ చక్ర



స్క్వాడ్రన్ లీడర్ యస్. హందా
వీర్ చక్ర

భారత వైమానిక బలం అధికారులు



ఫ్లయిట్ లెఫ్టినెంట్ తిర్‌లోచన్‌సింగ్
వీర్ చక్ర



ఫ్లయిట్ లెఫ్టినెంట్ ఎ. టి. కుక్
వీర్ చక్ర



ఫ్లయిట్ లెఫ్టినెంట్ డి. యన్. రాథోర్
వీర్ చక్ర



ఫ్లాగ్ ఆఫీసర్ యస్. సి. మామ్‌గేన్
వీర్ చక్ర

భారత వైమానిక బలం అధికారులు



ఫ్లాగ్ ఆఫీసర్ ఎ. ఆర్. గాంధీ
వీర్ చక్ర



ఫ్లాగ్ ఆఫీసర్ వి. కె. నెబ్
వీర్ చక్ర

సైనికాధికారి



లెఫ్టినెంట్ కల్నల్ గుర్బచన్‌సింగ్ సంఘ
మహావీర్ చక్ర

సైనికాధికారులు




మేజర్ రంజిత్‌సింగ్ దయాల్
మహావీర్ చక్ర



క్యాప్టెన్ చందర్ నారాయణ్‌సింగ్
మహావీర్ చక్ర (మరణానంతర బహూకృతి)



లెఫ్టినెంట్ కల్నల్ సంపూరన్‌సింగ్
వీర్ చక్ర




మేజర్ భాస్కర్‌రాయ్
మహావీర్ చక్ర



పాకిస్తానీ దోపిడి మూకలకు వ్యతిరేకంగా భారత రక్షణబలాలు తీసుకున్న చర్యల్లో పట్టుబడిన ఆయుధాలను, మందుగుండు సామగ్రిని చూస్తున్న భారత సైనికులు




భారత సైనికులు ఆక్రమించిన హాజీపీర్ కనుమనుండి, ఆ చుట్టుప్రక్కల ఉన్న స్థావరాలనుండి పారిపోతూ పాకిస్తాన్ సైనికులు పెద్ద మొత్తంలో ఆయుధాలను, మందుగుండు సామగ్రిని విడిచిపెట్టారు. యురీసెక్టరులోని ఒక అగ్రస్థావరంలో ఈ ఆయుధాలను పరికించుతున్న భారత సైనికులు




జమ్మూ, కాశ్మీర్‌లో పాకిస్తాన్ దుండగులకు వ్యతిరేకంగా మన రక్షణ బలాలు తీసుకున్న చర్యల్లో ఎన్నో ఆయుధాలు, ఎంతో మందుగుండు సామగ్రి తదితర వస్తువులు పట్టుబడ్డవి. రైఫిల్స్, స్టెన్‌గన్స్, తేలిక రకం మెషిన్‌గన్స్, రాకెట్లు, మందుగుండు సామగ్రితోపాటు ఔషధాలు, ఆహార వస్తువులు, బట్టలు మొదలయినవి గూడ ఇందులో ఉన్నాయి. పాకిస్తానీ దుండగులవద్ద దొరికిన రెండు రైఫిళ్ళు, ఒక దూరదర్శిని యంత్రం ఈ చిత్రంలో ఉన్నాయి.



కచ్ పోరాటంలో పాకిస్తానీ బలాలు వాడిన పాటన్ టాంక్ యొక్క 90 యమ్. యమ్. షెల్ కేసు — దీనిమీద ఉన్న గుర్తులనుబట్టి యిది అమెరికాలో తయారయినదని ధృవపడింది



ఇటీవల లాహోరు సెక్టరులో మన రక్షణబలాలు స్వాధీనం చేసుకున్న పాటన్‌టాంకులలో ఒకటి — ఇది 45 టన్నుల బరువున్న మార్క్— 47 పాటన్ టాంక్. దీని ముఖ్య ఆయుధం 90 యమ్. యమ్. కానన్. రెండు 7.62 యమ్. యమ్. మెషిన్ గన్నులతోపాటు 12.76 యమ్. యమ్. ఆంటీ ఏర్‌క్రాఫ్ట్ మెషిన్‌గన్‌లను కూడ యిందులో అమర్చవచ్చు.




భారత రక్షణబలాలకు పట్టుబడిన మరొక పాకిస్తాన్ టాంక్.



జమ్మూ, కాశ్మీరులోనికి యుద్ధ విరమణరేఖను అతిక్రమించి వచ్చిన విచ్ఛిన్నకర శక్తుల చర్యలను గట్టిగా యెదుర్కొనడానికి కాపలాకాస్తున్న భారతసైనికులు.




పాకిస్తానీ పారాట్రూపర్లను ధైర్యంతో యెదుర్కొని, దేశరక్షణలో నష్టాలకు గురిఅయిన గ్రామీణులకు ప్రభుత్వపు, ప్రజల సానుభూతిని అందచేసి అభినందనలను తెలుపుతున్న జలంధర్ ప్రాంతపు పోలీసు అధికారి.




సెప్టెంబరు 7 న, శ్రీనగర్ విమానాశ్రయంలో
పాకిస్తానీ యఫ్ – 86 సాబ్రేజెట్ చేత దెబ్బతిన్న
ఐక్యరాజ్యసమితి కారిబో విమానం.



పాకిస్తానీ విషప్రచారాన్ని లెక్క చేయకుండా దైనందిన
జీవిత కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాశ్మీరీయులతో
కళకళ లాడుతున్న శ్రీనగర్.



లాహోరు సెక్టరులో పురోగమించుతున్న మన సైనికులకు చేదోడుగా మెషిన్‌గన్‌లను పట్టుకున్న జవాన్లు.


APRIL 1965
18 Zil Haj 20 TUESDAY 110 - 255
I 4 Armt. Day. → 2:30 L.L. Configuration 4×100 lbs. 2×2.75" 2×75×20MM :45
II 2 Combat Profile Day. 3 Combat Profile Night.
Configuration Ext: 4×750 lb. Bombs. 4×7×2.75" Rockets Int: 4×750 lbs. Bombs Seven Flares load with 204.
Ad. Hal. Amb. Pal, Ag, Bhuj, Jamnagar

జామ్‌నగర్ వద్ద సెప్టెంబరు 7వ తేదీన మన వైమానిక దళం కూల్చివేసిన పాకిస్తానీ బి–57 బాంబర్ విమాన చోదకుని జేబులో దొరికిన డైరీలో ఒక పుట. దీని అర్థం: 1వ భాగం:— తడవకు— 100పౌనుల బాంబులు నాలుగు, 2.75" ఫోల్డింగ్‌ఫిన్ ఏయిర్‌రాకెట్లు రెండు, ఒక్కొక్క దానిలోనూ 75 గుండ్లుకల 20 ఎం. ఎం. తుపాకులు రెంటితో— నాలుగు తడవలు బాగా కిందగా (ఎల్. ఎల్) 2గం. 30ని. వ్యవధితో విమానాన్ని నడపడం. 2వ భాగం— ఈ దిగువ ఏర్పాటు ప్రకారం పగలు రెండుసార్లు, రాత్రి మూడుసార్లు విమానంలో ఎగరడం: ఎక్స్‌టెర్నల్ స్టోర్స్: 750పౌ బాంబులు నాలుగు. ఒక్కొక్కదానిలోనూ 2.75" ఫోల్డింగ్ ఫిన్ రాకెట్లు ఏడేసిచొప్పున గల నాలుగు పాడ్లు.

ఇంటర్నల్ స్టోర్స్: 750 పౌనులుగల నాలుగు బాంబులు ఏడు ఫ్లేర్లు.

20 ఎం. ఎం. గుండ్లను తుపాకుల్లో తీసుకు వెళ్ళాలని కూడా యిందులో వుద్దేశించబడింది.


ఆఖర్లో సంక్షిప్తంగా వున్న మాటలకు అర్థం పాకిస్తాను వైమానికుడు అదంపూర్ (ఎడి). హల్వారా (హెచ్ ఎల్) అంబాలా (ఎ ఎం బి). పాలం (పి ఎ ఎల్) ఆగ్రా (ఎ జి), భుజ్. జాంనగర్‌లపై వైమానికదాడికి సన్నద్ధమైనట్లు తెలుస్తుంది. టిక్కు పెట్టుకున్న వాటికి అర్థం ఆయా ప్రదేశాలపై శిక్షణ ప్రయోగాలుగా ఎగిరివెళ్ళినట్లు తెలియజేస్తుంది.


పాకిస్తాను దురాక్రమణదారులపై కాల్పులు సాగిస్తున్న మన సైనికులు


ఆగస్టు 27న శ్రీనగర్‌లో ఒక వీధి. పాకిస్తాన్ దుండగుల ఏరివేత కార్యక్రమంలో కూడా పౌర జీవితాన్ని యథావిధిగా కొనసాగిస్తున్న కాశ్మీరు ప్రజలు




పాకిస్తానీ దుండగుల కొరకు జమ్మూ, కాశ్మీరులో యుద్ధవిరమణ రేఖవద్ద పొదలమయమైన కొండల్లో గాలిస్తున్న భారతీయ భద్రతా దళాలు



భారతీయ సైనికులు యూరీ–పూంచ్ రంగంలో హాజీపీర్ కనుమను ఆక్రమించుతున్న వెంటనే తీసిన మొదటిఫొటో. చారిత్రాత్మకమైన యీ కనుమలో నిలుచుని, పూంచ్ వైపు చూస్తోన్న భారతీయ జవాన్లు. కుడివైపునవున్న పాకలలో మనసైన్యం ఆక్రమించుకునేవరకు పాకిస్తానీ సైన్యం వుంటుండేది




హాజీపీర్ కనుమలో పాకిస్తానీ స్థావరాలను వశపరచుకోవడానికై ముందుకు సాగుతున్న మన సైనికులు




పాకిస్తానీ దుండగులను ఎదుర్కోవడానికి గస్తీచర్యలు జరుపుతున్న మన జవాన్లు




పాకిస్తానీ దుండగులు దాచిన ఆయుధాలు, తదితర వస్తువులను గురించి పంటపొలంలో వెతుకుతున్న భారత భద్రతాదళాలు




పాకిస్తాను దుండగులకు తగిన గుణపాఠం చెప్పేందుకు కాచుకూర్చున్న భారతీయ భద్రతా దళాలు




హిమాలయాలలో సరిహద్దు రహదారికొరకై పగుల గొట్టడానికి చేస్తున్న ప్రయత్నాలు




జలంధర్ పట్టణంపై బాంబులు వేయడానికి వచ్చినప్పుడు కూల్చివేయబడిన పాకిస్తాను విమాన శిధిలాలు



తాటిపంతెసలద్వారాగాని, తెప్పలద్వారా గాని వాగులను దాటడంలో శిక్షణ పొందుతున్న భారతీయ జవాన్లు.




పాకిస్తాను దుండగీండ్లు వచ్చే మార్గాలను మూసివేసే వుద్దేశంతో భారతీయ భద్రతాదళాలు యూరీరంగంలో ముందుకు చొచ్చుకుని వెళ్ళాయి. 18 సం. క్రితం పాకిస్తాను బలవంతంగా ఆక్రమించుకున్న నాటినుండి చక్కెర, కిరసనాయిలు, వస్త్రాలవంటి నిత్య జీవితావసర వస్తువులకు నోచుకోని ఆ ప్రజలు భారతీయ భద్రతాదళాల సానుభూతి చర్యలకు పులకరించిపోయారు. తమంత తాముగావచ్చి తమ ఆయుధాలతో రాష్ట్రప్రభుత్వ అధికారులకు లొంగి పోతున్న కొంతమంది సాయుధ దుండగులను యీ చిత్రంలో చూడవచ్చు.




పట్టుబడిన పాకిస్తాను సాయుధదుండగుల కొంతమంది. వీరిలో ఇద్దరు పాకిస్తానీ అధికార్లుకూడా వున్నారు. కెప్టెన్ గులాం హుస్సేన్, కెప్టెన్ మహమ్మద్ సజ్జిద్. (4, 5 వ వారు తెల్లదుస్తుల్లో)




పట్టుబడిన పాకిస్తాను దుండగులను ఢిల్లీకి తీసుకొచ్చినప్పుడు పాలం విమానాశ్రయంలో మిలటరీ వ్యాన్‌లోకి ఎక్కిస్తుండగా తీసిన చిత్రం



దేశ సమగ్రతను సంరక్షించటానికి ఎట్టి త్యాగానికైన వెనుకాడరాదనే కాశ్మీరు కృతనిశ్చయాన్ని నొక్కివక్కాణించటానికి సెప్టెంబరు 5 న కాశ్మీరుఅంతటా "కాశ్మీరు దినోత్సవం" జరిపారు. ఆ సందర్భంలో ప్రజలు ఊరేగింపులు, సమావేశాలు జరిపారు. ముఖ్యమంత్రి శ్రీ జి. యం. సాదిక్ యీసభల నుద్దేశించి ప్రసంగించారు.




కాశ్మీరు పౌరులు ఏర్పాటుచేసిన రక్షణదళాల సంక్షేమసంఘం అందజేసిన టీ, బిస్కెట్లను సేవిస్తున్న రక్షణదళాల జవానులు.





జలంధర్ ప్రాంతంలో పారాట్రూపర్ల ఏరివేతలో ప్రముఖ పాత్రవహించిన ఇద్దరు గ్రామస్థులు.




సియాల్‌కోటసమీపంలోని మహారకా గ్రామంలోని స్త్రీలు, బాలలకు అల్పాహారం అందజేస్తున్న భారతజవాను.




జమ్మూకాశ్మీరులో రక్షణచర్యలను పెంపొందింప జేయడానికి, తమ తమ సేవలనందజేయడానికి అసంఖ్యాకమైన పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రవాణావాహనాలు వెళ్ళలేని ప్రాంతాలకు మనదళాలకు అవసరమైన ఆహారపదార్థాలు, మందుగుండుసామగ్రి నిరంతరాయంగా సరఫరా కావడానికి వీరి సేవలను వినియోగించారు.


జమ్మూ–కాశ్మీరులోని ఒక ప్రాంతంలో ఎత్తుప్రదేశాలకు మందుగుండు సామగ్రి, యితరవస్తువులను స్వచ్ఛందంగా అందజేస్తున్న పౌరులను చిత్రంలో చూడవచ్చు.




భారత వైమానిక దళానికిచెందిన విమానం కూల్చివేసిన పాకిస్తాన్ యఫ్-86 సాబర్ జెట్ విమానం అవశేషాలను చిత్రంలో చూడవచ్చు; సెప్టెంబరు 7 వ తేదీన కలైకుండలోని సమీపప్రాంతంలో, ఆకాశంలోనే మంటలు అంటుకున్న యీవిమానం కూలిపోయింది. ఈ ప్రాంతంలో బాంబులు వేయడానికి వచ్చిన మరోరెండు పాకిస్తాన్ సాబర్ జెట్‌లకు కూడ యిదేగతి పట్టింది.



లూడియానా సమీపంలోని రాసెరాగ్రామంపై పాకిస్తాన్‌వేసిన బాంబు ప్రేలకుండాపోయింది. ఇది 760 పౌన్లుగల అతిభయంకరమైన ప్రేలుడు బాంబు.



జలంధర్ ప్రాంతంలోని రెండు గ్రామాలలో పట్టుబడిన పారాట్రూపర్లనుండి వశంచేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రితోఉన్న గ్రామస్తులు, పోలీసులు.



బలప్రయోగంద్వారా కాశ్మీరులోని కొంత భాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకున్న యీ 18 సంవత్సరాలనుండి యూరీ-పూంచ్ హాజీపీరు ప్రాంతంలోని ప్రజలు నిత్యావసర వస్తువులు లేకుండా జీవితాలు గడపాల్సివచ్చింది. వీరి దీనగాథలువిని చలించిపోయిన కాశ్మీరువర్క్స్, విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి శ్రీ గులాంరసూల్‌ఖాన్ యీ ప్రాంతాన్ని మన రక్షణ దళాలు వశంచేసుకున్న తక్షణం చెక్కెర, కిరసనాయిల్, రెడీమేడ్ దుస్తులను తీసుకెళ్ళి ప్రజలకు పంపిణీ చేశారు. శ్రీ ఖాన్ వెళ్ళిన ప్రతిచోట ప్రజలు గుంపులు గుంపులుగా ఆయన చుట్టూ చేరేవారు. మన రక్షణ దళాలపై పూర్తి విశ్వాసం ఉన్న అక్కడి ప్రజలు తమ రక్షణగురించి నిశ్చింతగా ఉన్నారు.

శ్రీ ఖాన్ రెడీమేడ్ దుస్తులను ప్రజలకు పంపిణీ చేస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చు.



జమ్మూ–కాశ్మీరులో యుద్ధవిరమణ రేఖను అతిక్రమించి వెళ్ళి యూరి రంగంలోని అధికారుల మెస్‌లు, సైనిక కట్టడాలను, ముఖ్యమైన వంతెనలను కూల్చివేయడానికి నియోగించబడిన పాకిస్తాన్ సైన్యానికి చెందిన కెప్టెన్ మసూద్ ఇతను. యూరీ సమీపంలో వంతెనను కూల్చివేయడానికి మూడుసార్లు విఫలప్రయత్నం చేసినట్టు ఆయన అంగీకరించాడు. అయితే ప్రతి తడవ అతిజాగరూకతతో కాపలా కాస్తున్న మన సైనికుల అప్రమత్తతవల్ల యీ ప్రయత్నం ఫలించలేదు. హాజీపీర్ కనుమలో తీసుకున్న చర్యల సందర్భంలో ఆయన మన భద్రతా దళాలకు పట్టుబడ్డాడు. విద్రోహ చర్యలను నిర్వహించడానికి పాకిస్తాన్ సైన్యంనుండి ఆయనను ఎన్నికచేసినట్టు ఆయన వద్ద లభించిన పత్రాలవల్ల వెల్లడయింది

శాంతిపుష్పము

"శర్వరి"

ఆ మనోహర సుందరోద్యానమందు
వేయి కన్నులతో విరుల్ విరియబూచె
ముత్యపుసరాల ధరియించి నృత్యకేళి
సలుపు బంగారుబొమ్మ లచ్చరలవోలె.

నిత్యమును నూత్నరీతి జన్మించుచుండు
నిజ గృహచ్ఛిద్రములదీర్చి నేర్పుతోడ
నలసిపోవు ప్రౌఢులు గృహిణులనుబోలి
నిలిచె పూదీవె లటవట తలలువంచి.

తమ వయోవృద్ధతను మదితలచి తలచి
యనుభవంపు పొత్తపుబుట లరసి యరసి
కాల పరిపరివర్తనముగాంచి కలతజెందు
వృద్ధులనుబోలి నిలుచుండె వృక్షవితతి.

వచ్చి యా వనాంతరమున జొచ్చెనంత
మానవుడొకండు వేగ నున్మత్తుభంగి
పైకి జేసాచి యొకతీవబట్టి వంచి
సుమము నొకదాని త్రుంచి చూడవొడగె

దనయు బాధమోమున వెల్లి విరియ
పాఱు సరసిలో నద్దాని బాఱవైచె;
"యెవ్వడీ దుష్టు" డని తలయెత్తి వనము
కలతజెంది యాతని భీతిగాంచ సాగె.

అడుగడుగులోన నాశ నిరాశయెసగ
సాగిపోవుచునుండె నా సాధకుండు;
ప్రతిసుమమ్మును చూచుచు పట్టిత్రుంచి
విసరి కొలనిలోనికి బారవేయుచునుండె.

చివర కతడొక జిల్లేడు చెట్టుకడకు
వచ్చి పువుగోయగా తలవంచె; నంత
కనుల తడివెట్టి గుండెలు కరుగజేయు
ముద్రతో నది యీ విధమ్మున వచించె.

"ఆగు. మనుజుడ, యిదియేమి యాగడమ్మ"
యేమి యర్థించి జొచ్చినా వీ వనమున?
ప్రభుచరణ సేవకై పూలువలయునొక్కొ?
కాక ప్రియురాలి ముడి యలంకరణ కొఱకొ

"పరమశివు పూజకే నీకు వలయునేని
కొలనిలో విచ్చు తమ్మిపూవుల గనుము:
తరుణి కొప్పులో తుఱుమంగ వలతువేని
మల్లె విరజాజి మల్లె చేమంతిగొనుము

"నిండు మనసుతో బుట్టలో నింపుకొనవు.
ఒక్క క్షణమైన చేతిలో నుంచుకొనవు.
త్రుంచి మూచూచి మొగము చిట్లించిపార
వైతువే యిదియెచ్చటి పాడియోయి?

"ఇనుని కిరణాలతోడ గ్రీడించుచున్న
లేతపూవుల కుత్తుకల్ గోతువొక్కొ?"
యనిన వెల్లబాఱిన మోమునందు బరువు
నవ్వు గల్పించుకొనుచు మానవుడు పలికె.

"అగును. పూలకుత్తుకగోయ దగదునాకు.
కాని యేమిసేయుదు, నాదు కర్మమిద్ది,
ప్రభుచరణ సేవకును పూలు వలదునాకు
చెలువకొప్పులో పూలు గ్రైసేయవలదు.

"నేను శృంగారముగ బుట్టనింపదలచి
లలిత వనభూమి గుండెల కలతవెట్టి
లేననల గోయదలిచి రాలేదుసుమ్మ
కావలయు నొక్క చిన్నారిపూవు నాకు.

"అది హృదయ మరుస్థలిపైన నావరింప
గురిసిపోవు మందాకినీ ఝరులవెన్నొ.
అది హృదయ శూన్య కలశ మందందగింప
తొణికిపోవు మధుద్రవ కణములెన్నొ.

అది, యవతరింప రణభూమియైన మదిని
దిగి నిలచునోయి పెళ్ళిపందిరులవెన్నొ.
శిలల గరగించి యట వరిచేల బెంచు
భవ్య సుమమది శాంతిపుష్పమ్మ సుమ్మ"

"శాంతిపుష్పమా? యదియేమి జాతియోయి?
కనివిని యెఱుంగ నా పెద్దకాలమందు;
జనన మాదిగా తెలియు నీ వనము నాకు;
కాని శాంతిపుష్పము నెటగానలేదు.

"ఆశయేలకు వ్యర్థ ప్రయాసయేల
యిచట శాంతిపుష్పము లభియింపదోయి।
వెడలు" మనెజెట్టు; మోమెల్ల వెల్లబాఱ
నరిగె విఫలుడై వికలుడై యా మనుజుడు.

అడవి మల్లె

సీరియల్ (గతసంచిక తరువాయి)

జరిగిన కథ

చంద్రానికి తల్లిదండ్రులు లేరు. అన్న కృష్ణారావు పోషణలో వుంటాడు. వదిన గయ్యాళి. ఒకసారి చంద్రంపై దొంగతనాన్ని ఆరోపించి, పశువుల పాకలో రాటకు కట్టి వేయిస్తుంది. దారినపోయే ఓ బీదపిల్ల గౌరి జాలిపడి కట్లు విప్పుతుంది. చంద్రం పారిపోయి, రైలుకింద పడబోతున్న ప్రకాశాన్ని రక్షిస్తాడు. ఇందుకు కృతజ్ఞతగా ప్రకాశం తండ్రి చంద్రానికి ధన సహాయం చేస్తాడు. కృష్ణారావు వ్యాపారం చిలవలూ, పలవలూగా విస్తరిస్తుంది. అయినా అతని మనసెప్పుడూ తమ్ముడివేపే.

7

ప్రసాదరావు ఇంటికొచ్చేప్పటికి, హేమ టేబిల్ ముందు కూర్చుని ఏదో రాస్తూండటము అతడికంటబడింది. తండ్రిరాకనుకూడా గమనించనంతగా ఆమె తన పనిలో లీనమైపోయివుంది.

ప్రసాదరావు కూతుర్ని సమీపించి, "ఏమిటమ్మా, రాస్తున్నావ్?" అంటూ పక్కనున్న సోఫాలో కూర్చున్నాడు.

హేమ ఉలిక్కిపడి, తలఎత్తి తండ్రికేసి చూసింది. ఆమె ముఖం జేవురించివున్నది తడబడుతూ ఏమో చెప్పబోయి వూరుకున్నది.

"సాహిత్య అకాడెమీకీ, పత్రిక వాళ్ళకూ చంద్రం అడ్రసుకోసం రాస్తున్నావా?" అన్నాడు ప్రసాదరావు, సోఫాలోంచి లేచి ఆప్యాయంగా కూతురు తలనిమురుతూ.

"అవును, నాన్నా!" అన్నది హేమ మరింతగా తల వంచుకుంటూ.

"పిచ్చితల్లీ! నా దగ్గిరకూడా, ఎందుకమ్మా, అంత సందేహం, దాపరికం. నీ మనసు ఏనాడో నేనర్థం చేసుకున్నాను. ముందుగానే లేనిపోని ఆశలుమాత్రం పెంచుకోకు. మనిషిని పోలిన మనుషులుంటారు. చంద్రం విషయంలో అలాంటి అనుమానాలకు ఆస్కారం వున్నట్టు కనబడకపోయినా, నన్నో సందేహం బాధిస్తున్నది. పేరు మార్చుకున్నాడు. మనకు తన అడ్రసు తెలియనిస్తాడా? అని," అన్నాడు ప్రసాదరావు.

"చంద్రం యింకా అజ్ఞాతవాసం గడపాల్సిన అవసరం ఏమిటి, నాన్నా? చిన్నప్పుడు ఇల్లు విడిచి పారిపోయినప్పుడు, తన నెవరు పట్టుకోకుండా అలా పేరు మార్చుకుని వుంటాడు. ఇప్పుడు అలాంటి అవసరం ఏమీ లేదుకదా!" అన్నది హేమ.

"ఆలోచిస్తూంటే నాకూ అలానే తోస్తున్నది. ఆ ఫోటో చంద్రానిదే అయివుండాలనీ, ఆతడు మనం రాయగానే ఇంటికి తిరిగి రావాలనీ, నేను మనసా కోరుకుంటున్నాను. నువ్వు సుఖపడాలనే కోర్కె తప్ప, నాకీ లోకంలో మరే కోర్కెలూ లేవు. నేను చేసిన పాపానికి నువ్వు శిక్ష అనుభవించకూడదు," అన్నాడు ప్రసాదరావు జీరపోయిన గొంతుతో.

హేమ అదిరిపడింది. నాన్న పాపం చేశాడా? ఈ మాట తనతో ఆయన అనటం, యిది రెండోసారి. నాన్నలాంటి మనిషి పాపం చేస్తే, యిక యీ లోకంలో పుణ్యం చేసినవాళ్ళెవరు? అలాకాక, పైకి పుణ్యాత్ముల్లా, పెద్ద మనుష్యుల్లా కనిపించే వాళ్ళంతా ఏదో ఒక పాపంచేసే వుంటారా? ప్రతి మనిషి హృదయంలోనూ చీకటి కోణాలుంటాయా...


"నాన్నా!"

తన గదికేసి వెళ్ళిపోతున్న ప్రసాదరావు, కూతురి కంఠస్వరంలో పలికిన ఏదో అపశృతికి విహ్వలుడైపోయి, "ఏమిటమ్మా?" అంటూ వెనుదిరిగాడు.

"నాన్నా! నువ్వు పాపం చేశావంటే నేను నమ్మను. నాకు వూహ వచ్చింతరవాత నీ నోటినుంచి యీ మాట వినటం, యిది రెండోసారి. నన్ను బాధపెట్టక, జరిగిందేమిటో చెప్పు, నాన్నా!" అనడిగింది హేమ.

ప్రసాదరావు ముఖం వెలవెలపోయింది.

వాసిరెడ్డి సీతాదేవి



తను అప్రయత్నంగా యీ మాట కూతురుతో చెప్పటం రెండవసారి అన్నమాట! తనెందుకీ మధ్య యింతగా మనోవేదన పొందుతున్నాడు? ఏమాత్రం తొణకకుండా, నిబ్బరంగా వుండే తను, ఎందుకింతగా చలించిపోతున్నాడు? తన ఇంతకాలంగా హృదయంలో దాచిన రహస్యం, పురుగులా తనను తొలిచేస్తున్నది. ఆ రహస్యం ఎవరికీ చెప్పదగింది కాదు. హేమకు అసలే చెప్పగూడదు, అని నిశ్చయం. తాను ఆమె దృష్టిలో హీనాతి హీనుడైపోతాడు. కాని తనకు తెలియకుండానే తనలో అలాంటి రహస్యం...పాపం...దాగి వున్నట్లు హేమతో అనేవాడు...

"నాన్నా, ఏమిటలా మాటా పలుకూ లేకుండా నిలబడ్డావు?'' అన్నది హేమ. తండ్రి స్థాణువులా నిలబడి, వెర్రి చూపులు చూస్తూండటం గమనించింది.

ప్రసాదరావు తేరుకున్నాడు. హేమ కళ్ళల్లో నీళ్ళు తిరగటం అతడి కంటబడింది. "హేమా, ఎందుకలా కన్నీళ్ళు పెడతవు? నీ వివాహం నేను చూడలేనమ్మా. నామాటలేవీ పట్టించుకోకు. నాకున్న ఒక్క విచారం నువ్వుకోరుకున్న వ్యక్తి నీకు లభిస్తాడో లేదో అని. జీవితంలో నువ్వు సుఖపడతావో లేదో అనీ మాత్రమే. ఈ బాధకు కారణం, నేను చేసిన పాపం, నిన్ను వెన్నాడి కష్టాలపాలు చేస్తుందేమో అని. అంతకన్న నా విచారానికి మరే కారణం

లేదు." అంటూ గబగబా తనగదిలోకి వెళ్ళిపోయాడు.

హేమ తండ్రివెళ్ళిన వైపుకేసి చూస్తూ నిల్చుండిపోయింది. పాపం చేశానని తండ్రి అన్నమాటల్లో ఆమె కేమాత్రం నమ్మకం కలగలేదు. పాపం, నేరం, ప్రాయశ్చిత్తం. యిలాంటి పదాల అర్థాన్ని, ఎవరికివారు తమ మానసిక స్థాయికి అనుగుణంగా అన్వయించుకుంటారు. 'పాపం' అన్న మాటకు తండ్రి నిర్వచనం ఏమిటో తనకు తెలియదు. ఇరవై రెండేళ్ళ వయసుగల యువతిగా తనకున్న జీవితానుభవం, సైకాలజీలో ఎం. ఏ. ఫస్ట్‌క్లాసులో ప్యాసై, కాలేజీలో లెక్చరరుగా ఉద్యోగం చేస్తున్న తన వ్యక్తిత్వం—తండ్రిని అర్థం చేసుకోవటానికి, కొర కాకుండా పోయినై.

విజ్ఞానం, సంస్కారం, ఎందునా తొణకని గాంభీర్యతా—యివన్నీ, హేమలో వున్న సుగుణాలు. జీవితంపట్ల ఎంతో నిర్లిప్తత కనబరిచేది. ఆమెకు చెప్పుకోతగ్గ స్నేహితులంటూ ఎవరూలేరు. మనసిచ్చి యితర్లకు చెప్పుకోవలసిన విషయాలూ, సమస్యలూకూడా ఏవీలేవు. కాలేజీలో అందరికీ ఆమె వ్యక్తిత్వంపట్ల ఆశ్చర్యం, గౌరవంతోపాటు జిజ్ఞాసకూడా కలిగేది. అంతా తండ్రి స్వభావమే అనుకునేవారు.

ప్రసాదరావుమాత్రం కుమార్తె భవిష్యత్తు ఎలా వుండబోతుందో అని దిగులుపడేవాడు. చంద్రంపట్ల ఆమె కున్న ప్రేమ సంగతి తెలిసిన తరవాత, ఆమె వివాహం పెద్ద చిక్కుసమస్య కావచ్చునని, ఆయనకు భయం కలిగింది. కావాలనే తను హేమను యితర ఆడపిల్లలకు భిన్నంగా పెంచాడు. తన ఆదర్శాలకు అనుకూలంగా ఆమె వ్యక్తిత్వాన్ని మలిచేందుకు ప్రయత్నించాడు.

అందర్లాగే తనూ తన కూతురిని పెంచి వున్నట్టయితే, ఆమె కాలేజీ చదువప్పుడో అది ముగిసిన తరవాతో, అందుబాటులో వున్న ఏ అబ్బాయినో చూసి, ప్రేమించి వివాహం ఆడివుండేది. స్త్రీలో జిజ్ఞాస పెరిగినకొద్దీ, ఆమె జీవిత సుఖాలపట్ల నిర్లిప్తంగా వుంటుందని ప్రసాదరావు గట్టిగా నమ్మాడు. కాని, హేమ యీ రోజున అందరు యువతుల్లాగే ప్రవర్తిస్తున్నది. చంద్రం తిరిగి రాకపోతే, యిక తనకు జీవితం శూన్యం అన్న ధోరణి కనబరుస్తున్నది. అతడి ప్రసక్తి రాగానే, ముఖంలోని గాంభీర్యత అంతా పోయి, ఏవో సిగ్గుతెరలు కమ్మినట్టు ముఖం దించేసుకుంటున్నది.

"ఇదీ ఒక విధంగా మంచిదే! దాని భవిష్యత్తు అదే నిర్ణయించుకోవటంకన్న కావలసిం దేముంది." అనుకుంటూ, తల మీంచి పెద్దభారం దిగినవాడిలా, ప్రసాదరావు దిండులో తలదూర్చి కళ్ళు మూసుకున్నాడు.

హేమ తాను సాహిత్య అకాడమీవాళ్ళకూ పత్రికవాళ్ళకూ రాసిన వుత్తరాలు ముందు పెట్టుకుని, ఆలోచనా ప్రవాహంలో కొట్టుకుపోసాగింది. చంద్ర మోహన్, చంద్రం కాకపోతే, తన భవిష్యత్తు ఎలా వుంటుంది? చిన్నప్పటి ఫొటోల ఆధారంతో, తాను ఆ రెండు పేర్లూ ఒక్కరివే అన్న దృఢ విశ్వాసానికి రావటం అంత మంచిది కాదేమో. జీవితంలో తిరిగి చంద్రాన్ని చూడగలనని తాను ఎన్నడూ వూహించలేదు. చిన్నప్పటి చంద్రం రూపం, తన హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయింది. తాను పెరిగి పెద్దవుతున్న కొద్దీ, ఆ రూపం తన అభిరుచులకు అనుకూలంగా, మార్పులకు అనుకూలంగా మార్పులు చెందుతూ వస్తున్నది. నిత్యం ఆ రూపాన్ని తను ఆరాధిస్తూనే వున్నది. తన హృదయంలోని ఆ స్థానాన్ని మరెవరూ ఆక్రమించలేరన్న నమ్మకంతో, తను యావజ్జీవితమూ ఒంటరి బతుకు గడపటానికే నిశ్చయించుకున్నది.

కాని, యీనాడు తనలో కొత్త ఆశలు చిగురిస్తున్నవి. ఆ ఫొటో చంద్రానిదే. అతడు తిరిగి వస్తాడు. చంద్రం యిన్నేళ్ళ తరవాత తననింకా మరిచిపోకుండా జ్ఞాపకం వుంచుకుని వుంటాడా? ఆ రోజున చంద్రం తనను ఎంత బతిమాలినా, కట్లు విప్పలేదు. తన క్రౌర్యానికి చంద్రం తన నెంతో అసహ్యించుకుని వుంటాడు. కలిసినప్పటందువ్వారా, తన హృదయ మార్దవాన్ని కనబరిచి, అలగాపిల్ల చంద్రం హృదయంలో ఒక స్థానం ఏర్పరచుకున్నదేమో! ఒక వేళ, వాళ్ళిద్దరూ కలిసే పారిపోయారేమో! ఉహుం, అలా ఎన్నటికీ జరగదు. కాని... ఈపాటికే చంద్రం మరెవరినైనా వివాహం చేసుకుని వుంటే?

ఈ భావం మనసులోకి రాగానే, హేమ నిలువెల్లా కంపించిపోతూ, యిక ఆలోచించలేక, పుస్తకాల బీరువా దగ్గిరకు వెళ్ళి, పుస్తకం తీసి, ఓ క్షణకాలం దానికేసి చూసి కిందికి జారవిడిచి, తిరిగివచ్చి కుర్చీలో కూర్చున్నది.

ఆ తరవాత హేమ ఎక్కువ ఆలోచించకుండానే, ఒక దృఢ నిశ్చయానికి వచ్చింది ఏది ఏమైనా చంద్రాన్ని గురించి తెలుసుకోకుండా వూరుకోవటమే మంచిది! ఒకవేళ తా నింకా అతడికి గుర్తుంటే, అతడికై అతడే తనకోసం తిరిగివస్తాడు. అలా కానప్పుడు తను అతడికోసం బాధపడటం వృథా......

హేమ తానంతకుముందు రాసిన రెండు వుత్తరాలనూ చింపి, కిటికీలోంచి వీధిలోకి విసిరివేసింది. ఒక వారం రోజులాగి, తండ్రికి ఆ వుత్తరాలకు జవాబు రాలేదని చెప్పేందుకు నిశ్చయించుకున్నది. (సశేషం)

మహాత్ముని సారధ్యము - స్వాతంత్ర్యపోరాటము

గొట్టిపాటి బ్రహ్మయ్య

(ఆకాశవాణి - హైదరాబాదువారి సౌజన్యంతో)

గాంధీజీ భారత జాతీయోద్యమ రథ సారధ్యము వహించి, జయప్రదంగా విజయం సాధించిన మహనీయులు. 1920 సంవత్సరంనుండి భారతదేశంలో గాంధీ యుగారంభమైందనవచ్చును. నాటికీ, నేటికీ గాంధీజీ అడుగుజాడల్లోనే నడుస్తూ ప్రపంచ రాజ్యాలలో భారతదేశం ఒక విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకొని వున్నది.

శ్రీ మోహన్‌దాసు కరంచంద్ గాంధీ గారు ప్రథమ ప్రపంచ సంగ్రామంలో బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరించారు. యుద్ధానంతరం భారతదేశానికి స్వాతంత్ర్యము ప్రసాదిస్తారని గాంధీజీ ఆశించారు. అందుకు ప్రతిఫలంగా భారతజాతినే అవమానపరిచే 'రౌలట్ శాసనం' దాపురించింది. బ్రిటిష్ ప్రభుత్వ కృతఘ్నతా చర్యకు ప్రజాభిప్రాయాన్ని వ్యక్తీకరించుటకుగాను, సాత్వికనిరోధాన్ని ఆయన ప్రబోధించారు. ఆసేతు హిమాచలం కదిలించారు. పంజాబులో జలియన్‌వాలాబాగ్ వధలకు, ఘోర దురంతాలకు, రౌలట్‌చట్ట నిరసన సభ కారణమైంది. దీనితో గాంధీజీ అసహాయోద్యమాన్ని ఆరంభించారు.

1920 ఆగస్టు 1 వ తేదీ

అనాడే మనలను వీడిపోయిన భారతయేకైక నాయకుడు లోకమాన్య శ్రీ బాలగంగాధర్ తిలక్ తమ మరణశయ్యపై మహాత్ముని ఆశీర్వదించారు. గాంధీగారి అసహాయోద్యమం పంచవిధ బహిష్కారాలతో ప్రారంభమైది.

(1) బ్రిటిష్ ప్రభుత్వ ప్రసాదితములైన దివాన్‌బహదూర్' 'రావుబహదూర్' బిరుదులను విసర్జించుట; బెంచి మాజిస్ట్రేట్టు మొదలగు గౌరవ పదవులకు రాజీనామాలిచ్చుట;

(2) విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించుట, జాతీయ విద్యను బోధించు పాఠశాలల నిర్మాణం;

(3) న్యాయవాదులు, కక్షిదారులు, కోర్టులను బహిష్కరించుట, సివిల్, క్రిమినల్ తగాదాలన్నిటినీ ఆయా స్థానిక ప్రదేశాలలో పరస్పర సంప్రదింపులతో పరిష్కరించుకొనుట.

(4) విదేశవస్త్ర, వస్తు బహిష్కరణ; ఖద్దరు వస్త్రధారణ — ఖద్దరు ఉత్పత్తి సంస్థలను ఏర్పరచుట:

(5) మద్య నిషేధము.

1920 సహాయనిరాకరణ

ఈ పంచవిధకార్యక్రమాల నిర్వహణకు జలియన్‌వాలాబాగ్ హత్యలకు వ్యతిరేకంగా ఖిలాఫత్ అన్యాయమును గూడా జోడించారు. మహాత్మాగాంధీ, మౌలానా మహమ్మదాలీ, షౌకతాలీ సోదరులు దేశమంతటాపర్యటించారు. ఉద్యమప్రచారానికై కోటిరూపాయలు తిలక్ నిధిని వసూలు చేయుటకు, త్యాగధనులైన కోటిమంది సభ్యులను చేర్పించుటకు, ఖద్దరు ఉత్పత్తికి 20 లక్షల రాట్నములను ఏర్పాటు చేయుటకు 1921లో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సంఘం నిర్ణయించింది. గ్రామస్థాయినుండి దేశంవరకు పోటీ ప్రభుత్వాన్ని ఏర్పాట్లుచేస్తూ ప్రతిష్టంభన కల్గించడానికి ఉద్యమం సాగించారు. దేశమెల్లెడలా కల్లు దుకాణాల పికెటింగులు, విదేశ వస్త్రాల బహిష్కరణలు ఉధృతంగా సాగినవి. ప్రభుత్వ దమననీతి పెచ్చు పెరుగుతున్న కొలదీ, ప్రజలలో సంఘటనా శక్తి, ఐకమత్యం పెంపొందుతూవచ్చింది.

మహాత్ముడు స్వరాజ్య సంపాదనకు అహింసా, సత్యములనే ఆయుధాలగా నిర్ణయించి, యెట్టి హింసాకాండనైనా అహింసా యుతంగానే, ఎదుర్కొనవలెనని శాసించారు. శ్రీకృష్ణ జన్మస్థానములను యాత్రాస్థలాలుగా మార్చనుద్దేశించారు. వేలకొలది జైళ్ళ కెళ్ళడమేగాక, లక్షలమంది క్షతగాత్రు లగుట సంభవించింది.

ఈవిశాల భూఖండం అంతటా అహింస పాటింపబడిననూ- చౌరీచౌరాలో వుద్యోగుల దౌష్ట్యాలకు ప్రజలు కోపోద్రేకులై బ్రిటిష్ సైనికులను చంపివేయుట జరిగింది. ఇది అహింసా ఉద్యమమునకే భంగకరంగా భావించి మహాత్ముడు జైళ్ళ యాత్రా కార్యక్రమాన్ని తాత్కాలికంగా విరమింపజేశారు.

1930 వరకు ఖద్దరు ఉత్పత్తికి, హరిజనోద్ధరణకు, హిందూ మహమ్మదీయ ఐక్యతకు, కాంగ్రెసు సంస్థను పటిష్టం చేయుటకు, నిర్మాణ కార్యక్రమంలో కాంగ్రెసు కార్యకర్తలు శ్రమించడం జరిగింది.

1930 ఉప్పు సత్యాగ్రహం

సాత్విక నిరోధము, సహాయ నిరాకరణలనుండి 1930 సంవత్సరానికి సత్యాగ్రహ ఘట్టానికి చేరుకొన్నాము. అదే చరిత్రాత్మకమైన ఉప్పు సత్యాగ్రహం. మనం సముద్రపు నీటినుండి, పల్లపు ఉప్పుపర్రలనుండి ఉప్పు తయారు చేయుటకు యెంతో అవకాశం వుంది. ఉప్పు చేసుకొనడాన్ని ప్రభుత్వం నిషేధించింది. అలా చేసినవారిపై

కఠిన శిక్షలు విధించింది. ఇందులకు కారణం బ్రిటను కేవలం పారిశ్రామిక దేశం. వారి పరిశ్రమలకు కావలసిన ముడి పదార్థాలను చేరవేసుకోడానికి, ఓడలు ఖాళీగా రాకుండా బ్రిటనులో తయారుచేసిన ఉప్పును వారి ఓడల్లో తీసుకుని వచ్చి మన మార్కెట్టులో అమ్మడం జరిగేది. మనుషులకే గాకుండా ఉప్పు పశువులకు గూడా అవసరం. ఉప్పు చేసుకునే హక్కుకొరకు మహాత్ముడు సత్యాగ్రహానికి ఉపక్రమించారు. పడక కుర్చీ రాజకీయవేత్తలు కొందరు 'ఉప్పు సత్యాగ్రహమా పప్పుసత్యాగ్రహమా అని ఆ రోజుల్లో పరిహసించారుకూడ.

మహాత్ముడు స్వయంగా దండి సత్యాగ్రహం ప్రారంభించారు. సత్యాగ్రహులు జట్లు జట్లుగా జాతీయ గీతాలాపనలతో, స్వరాజ్య వినాదాలతో, ప్రభాత భేరీలతో ప్రబోధిస్తూ దేశమంతటా సత్యాగ్రహ శిబిరాలు స్థాపించారు. అరెస్టులు, కాల్పులు, లాఠీ చార్జీలు సాగినవి. లక్షలాది సత్యాగ్రహులతో ప్రభుత్వ జైళ్ళు నిండిపోయినవి. రాజభక్తి అంతరించింది. ఉద్యోగుల భయం తగ్గింది. దేశభక్తి పెరిగి దేశనాయకులంటే ప్రేమ హెచ్చింది.

ఇంగ్లండులో గల కార్మిక ప్రభుత్వం యదార్థ పరిస్థితులను గమనించి, కాంగ్రెసుతో రాజీ చేసుకోవలసి వచ్చింది అదే గాంధీ ఇర్విన్ సంధి ప్రజలు స్వేచ్ఛగా ఉప్పు చేసుకునే హక్కు గుర్తించబడింది. జైళ్ళలోని స్వాతంత్ర్య యోధులు విడుదలయినారు. మొదటి గుండ్రబల్ల సమావేశానికి గాంధీజీ హాజరగుటకు సమ్మతించి వెళ్ళారు. ఐతే యీలోగా కార్మిక ప్రభుత్వం పడిపోయి మరల కన్సర్వేటివ్‌లు అధికారంలోకి వచ్చారు. గవర్నర్ జనరల్ ఇర్విన్‌స్థానే వెల్లింగ్టన్ వచ్చారు. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని తిరుగుబాటుగా భావించి, గాంధీజీతో రాజీ చేసుకోడం న్యూనత అనుకొన్నారు. పర్యవసానం ప్రథమ రౌండు టేబులు సభ భగ్నమైంది. మహాత్ముడు ఇంగ్లండులో వుండగానే హిందూదేశంలో పటేల్, జవహర్‌లాల్ ఆజాద్ మొదలగు ప్రథమశ్రేణి నాయకులను అరెస్టు చేశారు. ప్రభుత్వమే ప్రజలతో కవ్వింపు వాతావరణం సృష్టించింది. ఈ పరిస్థితులను చర్చించడానికి మహాత్ముడు ఇంటర్వ్యూ కోరగా గవర్నర్ జనరల్ నిరాకరించాడు. తర్వాత ఉద్యోగ విరమణ అనంతరం ఆయన ఇంగ్లండుకు వెళ్ళినప్పుడు, ఇంటర్వ్యూ నిరాకరించిన ఆయన చర్యను అచటి ప్రముఖ రాజకీయవేత్తలు విమర్శించారు. దానికి వెల్లింగ్టన్ సమాధానం చూడండి: 'మహాత్ముని వాదనా బలిమికి యెదుటివాడు నిరుత్తరుడై, ఆయన మాటకు సరేననుట పరిపాటి. మహాత్ముని వాదనలకు సరేనను స్థితిలో నేనూ–నా ప్రభుత్వమూ లేదు గాబట్టి, నేనానాడు ఇంటర్వ్యూ యివ్వలేను' అన్నాడు మహాత్ముని వాదనా చాతుర్యాని కిది నిదర్శనం. సామరస్యంగా పరిష్కరించుకోడానికి ప్రభుత్వం తిరస్కరించిన ఫలితంగా శాసనోల్లంఘనం సాగించడం జరిగింది. ప్రభుత్వం కాంగ్రెస్ సేవకులను నిర్దాక్షిణ్యంగా, క్రూరంగా హింసించింది. అరెస్టులు, జరిమానాలు, నిత్యకృత్యమైనవి. కాని, యెట్టి హింసా చర్యలకు గురియైనా ప్రజావాహిని అక్షయంగా పెరిగింది. జైళ్ళలోకూడా నిరంకుశోద్యోగులతో సత్యాగ్రహులకు పోరాటం తప్పలేదు.

ఒకవైపు ఈ ఉద్యమం జరుగుతుండగా, ఇంతలో హిందూ సంఘంనుండి హరిజనులను ప్రత్యేక నియోజకవర్గాలుగా విడదీస్తూ మాగ్దనాల్డు అవార్డు రావటం జరిగింది. 1933 లో జైలులోనే మహాత్ముడు నిరహార దీక్ష ప్రారంభించారు. గాంధీగారిని, తదితర కాంగ్రెసు నాయకులను విడుదల చేశారు. అన్ని రాజకీయ పక్షాల నాయకులు సమావేశమై మహాత్మునికి ఆమోదయోగ్యంగా వుండే లాగున 'పూనా సంధి' జరిగింది. దీన్నిబట్టి స్థూలంగా సమిష్టి నియోజకవర్గాలలో హరిజనులు కలిసి యెన్నుకోబడటానికి అంగీకారం కుదిరింది.

విడుదల తర్వాత హరిజన దేవాలయ ప్రవేశాలు, అస్పృశ్యతా నివారణకు మహాత్ముడు దేశమంతటా పర్యటించారు. హరిజన సేవా సంఘాలు వెలసినవి. సాంఘిక సంస్కరణోద్యమం ముందంజవేసింది. ఈ నిర్మాణ కార్యక్రమంతోబాటు కాంగ్రెసువాదులు పలుచోట్ల స్థానిక సంస్థలను వశపరచుకొని ప్రజాభిప్రాయాన్ని చూరగొన్నారు.

ఇప్పటిదాకా అనుసరిస్తూ వచ్చిన శాసనసభా బహిష్కారమును విరమించి ప్రతిష్టంభనను గల్గించడానికే శాసనసభల్లో ప్రవేశించడానికి మహాత్ముని ఆమోదముద్ర లభించింది. 1926–27 సంవత్సరాల్లో పండిత మోతీలాల్ నెహూ్రు, చిత్తరంజన్ దాసుల అధ్వర్యాన స్వరాజ్య పార్టీ శాసనసభల్లో ప్రవేశించింది. నాగపూరు, బెంగాలులలో ప్రతిష్టంభనలు దిగ్విజయంగా జరిగినవి. ఒక విధంగా శాసనసభా కార్యక్రమాలకు సుముఖమైన వాతావరణం ఏర్పడింది. 1936 లో జరిగిన శాసనసభ ఎన్నికలలో వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రివర్గా లేర్పడినవి. శ్రీ బులాభాయి నాయకత్వాన కేంద్రంలో కాంగ్రెసు ప్రధాన ప్రతిపక్షంగా రూపొందింది.

ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వాలను సంప్రదించకుండానే గవర్నరు జనరల్ యుద్ధ ప్రయత్నాలు కొనసాగించాడు. దీనికి నిరసనగా కాంగ్రెస్‌ప్రభుత్వాలన్నీ రాజీనామాలు చేసినవి.

1942 క్విట్ ఇండియా ఉద్యమం

1941 సంవత్సరంలో మహాత్మాజీ ఆజ్ఞానుసారం వ్యక్తి సత్యాగ్రహం ఆరంభమైంది. 1942 లో సమిష్టి సత్యాగ్రహరూపం ధరించి 'క్విట్ ఇండియా' మహోద్యమంగా విజృంభించింది 'విజయమో వీరస్వర్గమో' అనే వినాదాన్ని మహాత్ముడు భారత ప్రజల కిచ్చారు. ప్రజా వాహినిపై ప్రభుత్వం విచ్చలవిడిగాకాల్పులు సాగించింది. భారత జాతి

చిరస్మరణీయుడు

పి. వి. సుబ్బారెడ్డి

స్వాతంత్ర్య సమరాన శాంతికాగడ బట్టి
    వెలుగు నందించిన వీరు డెవడు!
కులమతరాహిత్య గోవర్ధనం బెత్తి
    సమముఁ దెల్పిన బుద్ధిశాలి యెవడు!
సత్యమహింసలే సాయుజ్య మని యెంచి
    విశ్వాన చాటిన వేత్త యెవడు!
మద్యనిషేధమె మార్గంబని యెఱిగి
    దారి జూపిన బాటసారి యెవడు!

ఏది గుజరాతుదేశంబు యెవని వలన
పుణ్యచరిత్రయై నెగడొందె పుడమియందు
ఎవని సూక్తులు దేశాన ఎలుగులెత్తె
నతడె బాపూజి పూజ్యుడై యలరినాడు.

భారతాంబకు పాదబంధముల్ విడదీసి
    తెల్లవారల పారద్రోలె నెవడు!
జాతి జాగృతికయి జాతీయభావంబు
    చాటి జెప్పినయట్టి సదయు డెవడు!
మతసామరస్య సన్మార్గంబునుం జూపి
    జ్ఞానంబుఁ దెలిసిన ధ్యాని యెవడు!
హరిజనోద్ధరణకై యస్పృశ్యతను బాపి
    సేవజేసిన త్యాగశీలి యెవడు!

భరతజాతిని స్వాతంత్ర్య పథము వెంట
న్యాయబోధల దెలుపుచు నడిపె నెవడు
పోరుబందరు గ్రామాన బుట్టినట్టి
యతడె బాపూజి పూజ్యుడై యలరినాడు.

(పక్క పేజీనుంచి)

యోద్యమం బ్రిటిష్ పరిపాలనను సవాలు చేసేస్థితికి వచ్చింది.

స్వాతంత్ర్య సిద్ధి

ద్వితీయ యుద్ధానంతరం బ్రిటిష్ సామ్రాజ్యం బలహీనపడి ప్రపంచంలో తృతీయ స్థానానికి దిగజారింది. విశాల సామ్రాజ్య రక్షణ కష్టతరమైపోయింది. బ్రిటన్‌లో చర్చిల్ పోయి అట్లీ అధ్వర్యాన కార్మిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మహాత్మునితో రాజీ సంప్రదింపులకు దిగింది. క్రిప్సు, లారెన్సుల రాయబారాలు ఆ నాటి ఘట్టాలలో ప్రధానమైనవి. జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో హిందూదేశ స్వాతంత్ర్య సమస్య ప్రముఖ సమస్య అయింది. వీటన్నిటి పర్యవసానమే 1947 ఆగస్టు 15 నాటి స్వాతంత్ర్య సంసిద్ధి.

1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం నుండి 1906–7 నాటి వందేమాతరం ఉద్యమం, 1920 నుండి మహాత్ముని నాయకత్వాన సాగిన సత్యాగ్రహ, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాలు, దేశభక్తులు చేసిన యెనలేనిత్యాగాలు దేశ స్వాతంత్ర్య సిద్ధికి దారి తీసినవి.

కాని, విభజించి– పరిపాలించాలనే బ్రిటిష్‌వారి కుటిల నీతికి భారతదేశం బలిగాక తప్పలేదు అదే భారతదేశ విభజన– పాకిస్తాన్ అవతరణ. బ్రిటిష్ పాలకులు వైదొలగుతూ, మన దేశంలోగల 596 సంస్థానాధీశులను స్వతంత్ర సార్వభౌములుగా ప్రకటించారు. అదృష్టవశాత్తు మహాశక్తి సంపన్నుడైన సర్దార్ వల్లభాయి పటేల్ నేతృత్వాన రాజకీయ చతురతతో వాటినన్నిటినీ దేశంలో సంలీనం చేసుకోగలిగారు. బ్రిటిష్ కుటిలనీతి పర్యవసానంగానే ఈ నాటికి కాశ్మీర్, తదితర పాకిస్థానీ సరిహద్దు సమస్యలు రొమ్ముల పై కుంపటిగా వుంటున్నవి.

గౌతమబుద్ధుని నాటి అహింసా, సత్య, ధర్మాలను ఒక సామ్రాజ్య నిర్మూలనకు, స్వరాజ్య నిర్మాణానికి, సంబంధించి జయం చేకూర్చినది మహాత్మాగాంధీ. ఆ మహాత్ముని వారసునిగా అలీన సిద్ధాంతాన్ని, పంచశీల రూపంలో అహింసా సత్యాలను ప్రబోధించి సభ్యరాజ్యాలలో ప్రధాన శ్రేణిలో ఒక విశిష్ట స్థానాన్ని మనకు కల్పించినవారు పండిత జవహర్‌లాలు నెహ్రూ.

ఆ మహనీయు లిద్దరి అడుగుజాడల్లో దేశపాలనను నిర్వహిస్తున్న శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రికి ఐకమత్యంతో, క్రమశిక్షణతో దేశ భక్తులుగా తోడ్పడుట నేటి మన విధ్యుక్తధర్మం.

జై హింద్

సీరియల్ నవల

జరిగిన కథ

ఆదాయంలేని డాక్టరు కనకంగారు. రోగులమీద సాహిత్యాన్నిరుద్దేతత్వం అతనిది. ఒకరోజు మందుతో రోగి అయి, ఆ తర్వాత అతనికి సన్నిహితుడైన విద్యార్థి ఒకతను దొరుకుతాడు. ఆ యింట్లో అద్దెదారుడిగా ప్రవేశిస్తాడు. డాక్టరుగారి అమ్మాయి అభిమానపు చూపుల్లో చిక్కుకుంటాడు. ఒకరోజు పిక్నిక్‌కు వెళ్ళినప్పుడు స్నానం చేయబోతూ ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోతున్న డాక్టరుగారి అమ్మాయిని రక్షిస్తాడు. సెలవల్లో యింటికి వెళ్ళి డాక్టరుగారి విషయాలకు దూరమైపోతాడు.

పిపాసాం

7

నా జీవితం ఒక గాట్లోపడి అక్కడే ఉండిపోయింది. కాలేజీ, చదువూ, పబ్లిక్ పరీక్షలో క్లాసు తెచ్చుకోవాలన్న తాపత్రయమూ, దీనితోబాటు తరచు సినిమాలూ, అప్పు డప్పుడూ నాటకాలూనూ.

రాధాకృష్ణమూర్తి చాలా ఖర్చు మనిషి. డబ్బు మంచినీరులాగా వాడేవాడు. అతని తండ్రి ఏపాటి ధనికుడో నాకైతే తెలీదు. అతను చాలా తెలివిగలవాడై ఉండాలి. పుస్తకాలకేసి చూసిన ట్టుండేవాడు కాదు. పరీక్షల్లో నూటికి యాభైకి తక్కువ లేకుండా వచ్చేవి. అతనికి సంగీతంపిచ్చి. సుమారుగా పాడేవాడు. సైగల్ అంటే వెర్రిమోజు. అస్తమానమూ సైగల్ పాటలే హమ్ చేస్తూండే వాడు.

వాతావరణాన్ని కలిగించటంచేత కాలానికి కండపట్టినట్టయింది. ఎందుచేతనంటే మనం కాలాన్ని కొలవగలిగింది మార్పుతోనూ, నూతనానుభవాలతోనూ మాత్రమేగద. నిద్రలో గడిచిపోయిన గంటలు నిమిషాలతో సమానం. రెండు రోజులపాటు కొత్తచోటికి వెళ్ళి కొత్త అనుభవాలు పొందితే అది రెండేళ్ళ పెట్టుగా ఉంటుంది

నిజానికి కిందటి సంవత్సరం కలిగినన్ని అనుభవాలీయేడు లేవు. ఈయేడు నాకు దల్‌గానే గడిచిందనాలి. కాని అప్పటికీ ఇప్పటికీ నా జీవిత వాతావరణంలో ఎంత మార్పంటే, కిందటేడు జరిగిన సంఘటనలన్నీ కిందటి జన్మకి సంబంధించిన వన్నట్టు తోచింది. కథలురాసే ఉత్సాహం కూడా పాతనీటితోనే కొట్టుకుపోయింది.


దసరా శలవలకు డాక్టరుగారి ఊరు తప్పక పోదామనుకున్నాను. కాని వెళ్ళ లేదు. వెళ్ళకుండా ఉండటానికి ఏదో సాకు చూసుకుని సమాధానపడ్డాను. తిరిగి డిసెంబరు శలవులకూ అదే జరిగింది. మిడ్‌టరమ్ పరీక్షలు కాగానే రాధాకృష్ణమూర్తి వెళ్ళాడు. అతను "బైరాగి టిక్కెట్టు" మీద కలకత్తా, బొంబాయీ, మద్రాసూ, మైసూరూ, ఇంకేవేవో తిరగనిశ్చయించుకుని నన్నుకూడా రమ్మన్నాడు. రెండు మూడు జోన్‌ల టిక్కెట్టు కొనటానికీ, పట్టణాల్లో తగలెయ్యటానికీ నా దగ్గర డబ్బులేదు, రాలేనన్నాను.

శలవ రెండువారాలూ నే నెక్కడికీ పోనుకూడాలేదు. రెండు రోజులపాటు డాక్టరుగారి ఊరువెళ్ళి ఉండవచ్చు. కాని గుంటూరులోనే ఉంది ఒక క్రిస్టియన్ల పిల్లతో చిన్న రోమన్స్ నడిపాను. దాని పేరు రత్నం. మా కాలేజీలోనే చదివేది. చాలా ఏళ్ళ తరవాత అంతర్జాతీయ రాజకీయాలలో డలెస్ ప్రవేశపెట్టిన బ్రింక్‌మన్‌షిప్‌ను అది ప్రణయంలో అప్పుడే ప్రవేశపెట్టింది. "బ్రింక్" దగ్గిరికి వచ్చేదాకా, "ఆయ్ లావ్‌యూ, రీలీ ఆయ్‌డూ," అనేది. "బ్రింక్" చేరువలో కొచ్చినాక, "ఐమె

అటువంటివాడి కంపెనీతో ఎవరికీ పేచీ ఉండదు. అత నౌకరి జోలికిరాడు. అతనిలో ఒక్కటే దౌర్బల్యం ఉండేది. తన ఆనందాలను పంచుకునే టందుకు ఎవరో ఒక రుండాలి. కిందటేడు అతనికి రూమ్‌మేట్ లేడు. ఏం చేశాడో తెలీదు. ఈ యేడు నేను దొరికాను. అతనికి నే నంటే వ్యక్తిగతమైన అభిమానం ఉందనుకోను. అయినా నా కింద డబ్బు తగలేసేవాడు. వద్దంటున్నా సినిమాలకూ, నాటకాలకూ తీసుకుపోయి ఖర్చు తనే భరించేవాడు. నేను కాకుండా నా స్థానంలో మరొక డున్నా అతను ఇట్లాగే ప్రవర్తించే వాడనుకుంటాను.

ఏమైనా రాధాకృష్ణమూర్తి నాకొక కొత్త

కొడవటిగంటి కుటుంబరావు



గుడ్‌గాల్, అయామ్." అనేది. మా ప్రణయ సంభాషణల్లో పడికట్టురాళ్ళుగా ఉండిన ఈ మాటలు రత్నం ఏ సాంగ్ హిట్స్‌లోనుంచో కాజేసిందని నా అనుమానం. మేం ఏం మాట్లాడుకునేవాళ్ళమో ఆ ఏసు ప్రభువుకే తెలియాలి. చాలావరకు తనే మాట్లాడేది. తుక్కూ దూగరా ! తెలుగులోనే మాట్లాడుకునే వాళ్ళం, ఏదైనా బరువుగా అనాలి సొచ్చినప్పుడే ఇంగ్లీషు మాట్లాడేది.

ఈ చౌకబారు ప్రణయ యజ్ఞం సఫలం కాకపోవటానికి కారణం నా అరసికతే అయి ఉంటుందని తరవాత నాకు తట్టింది. నేను రత్నానికి ఒక చిన్న బ్రూచ్‌లాటిది కొనిపెట్టినా అది "డ్రింక్" మీదినుంచి దిగివచ్చి ఉండేదేమో—కనీసం ఒక ఫేస్ క్రీమ్ ! ఉన్నట్టుండి క్రిస్మస్ ముందే రత్నం నన్ను విసర్జించేసింది. నా కంతే కావాలి. నేను క్రిస్మస్ ప్రెజెంటైనా ఇవ్వానుకాను... కాలేజీ తెరిచినాక రత్నం నా మొహం కనిపించినప్పుడు గుర్తించినట్టయినా కనపడలేదు. నే నాచే అశ్రువులు రాల్చలేదు.

పరీక్షలు దగ్గిరపడుతున్నాయి. తెగ చదివేస్తున్నాను. సినిమాల మాటా, నాటకాల మాటా ఎత్తవద్దని రాధాకృష్ణమూర్తికి చెప్పేశాను. చదువుకోమని కలవలిచ్చాడు. బుద్ధిమంతనంగా చదువుతున్నాను.

తలవని తలంపుగా డాక్టరుగారు ఒక నాటి మధ్యాహ్నం మా గదికి వచ్చేశాడు. ఆయన్ను చూడగానే నాకంత సంతోషం కలుగుతుం దనుకోలేదు. మొహం చెల్లక పోతుం దేమోనవికూడా అనుకున్నాను. కాని అటువంటి దేమీ జరగలేదు.

"ఓహో ! రండి డాక్టరుగారూ, ఎప్పుడు రావటం ? అంతా కుశాసా ?" అన్నాను. ఆయనకు నా కుర్చీ ఇచ్చి, నేను స్టూలుమీద కూర్చున్నాను.

"నేను మళ్ళీ గుంటూరు వచ్చేస్తున్నాను. డాక్టర్ శ్రీధర్ తనకు సహాయంగా ఉంటమని రాశాడు. ఈ మధ్య అతను నర్సింగ్ హోం పెట్టాడుగాదూ?"

నాకు తెలీదు. కాని, మోస్ట్‌వెల్‌కమ్ న్యూస్—ఆ మాటే అన్నాను.

"ఆ పల్లెటూళ్ళో ఫిజికల్ ఎగ్జిస్టెన్సు బాగానే ఉంది గాని. మెదడు బొత్తిగా బూజుపట్టి పోతున్నది. 'గో బాక్ టు ది విలేజ్' అన్న స్లోగన్ ఆచరణసాధ్యం కాదేమో !" అన్నాడు డాక్టరుగారు.

ఆయన ఏదో జ్ఞాపకం వచ్చి తనలో తను నవ్వుకోవటం చూసి "ఏమిటి ?" అన్నాను.

"మానాన్న పెద్దఉత్తరం రాశాడునాకు."

నే నా ముసలాయన్ని పూర్తిగా మరిచిపోయాను ఆయన మాట వినగానే నాకు హిరణ్యకశిపుడు మొదలైన రాక్షసులు జ్ఞాపకం వచ్చారు.

"ఏమంటా రాయన ?" అని అడిగాను.

"వర్షను తక్షణమే తన దగ్గిరికి పంపెయ్యాలిట. నేను దాని జీవితాన్ని ధ్వంసం చేస్తున్నానుట. తన దగ్గిరికొస్తే అది మహారాణిలాగా బతుకుతుందిట. మహారాజులాటి వాణ్ణి పెళ్ళాడుతుందిట. నేను చేసిన పాతకాలన్నిటికీ ఆ అభంశుభం ఎఱగని పిల్ల శిక్ష పొందటం అన్యాయంట. చేసిన పాతకాలకు తోడుగా నే నీ పాపం కూడా మెడకు చుట్టుకుంటున్నానుట. తండ్రిగా దానిపై నా కున్న హక్కే తాతగా తనకూ ఉందిట. ఒకటి కాదు – ఏమేమిటో రాశాడు. ఫ్రేమ్ కట్టించి ఉంచుకోదగిన ఉత్తరం."

"అవును. ఆయనకు ఇదొక అబ్సెషనైపోయింది. ఆయన బుర్రలో ఏదన్నా ఆలోచనపడితే అది ఒకంతట పోదనుకుంటాను" అన్నాను. మరొకడైతే ఎప్పుడో గివప్ చేసి ఉండేవాడే.

డాక్టర్‌గారు అంతలో సీరియస్‌గా అయిపోయి, "చూడు, సూర్యం! నా బుర్ర పనిచెయ్యకుండా ఉంది. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు – వర్షకు వాళ్ళ తాత దగ్గిర ఉండాలనుంటే మనం ఏం చెయ్యాలి ?" అన్నాడు.

"మనం" అన్నమాట నా మీద మంత్రం లాగా పనిచేసింది. దాంతో నేనూ, ఆయనా వర్ష సమస్యలో భాగస్వాములమైపోయాం.

"వర్ష తాతగారి దగ్గిరికి వెళ్ళిపోతానంటుందా ?" అన్నాను.

"అలా అంటుందా ? అంటే సమస్యే లేదు. ఆ ఉత్తరం ఇచ్చాను. మొహంలో ఏ ఎక్స్‌ప్రెషనూ లేకుండా చదివి, ఏ కామెంటూ లేకుండా నా చేతి కిచ్చేసింది. దాన్నిబట్టి ఏమనుకోవాలీ ? తాత కోరిక తీరిస్తే బాగుంటుందనేగా ? 'మీ తాతయ్య రమ్మంటున్నాడుగదా! పోనీ వెళతావుటే ?' అని అడిగా. నే నొక్కత్తె పోయి అక్కడ ఉంటానా ?" అన్నది – నే నేదో భయంకరమైన సూచన చేసినట్టుగా. ఆయన ఇంకెవర్నీ ఆహ్వానించటం లేదుగదా ? మేం రామనుకో. నీ కోసం వద్దామన్నా ఆయన అవకాశం ఇవ్వటం లేదే ?" అన్నాను. "అటువంటప్పుడు దాన్నిగురించి ఆలోచించటం దేనికో ?" అన్నది. అర్థం చేసుకోగలవనుకుంటాను; ఆ మాట నా తరపున అన్నది కాదు. నాకు విరుద్ధంగా, నాతో సానుభూతి లేకుండా, అన్నది!... హుం! ఎడం ఎడంగా నాటిన మొక్కలు కూడా పెరిగిన కొద్దీదగ్గిరపడి కలుసుకుంటాయి; మనుషులు పెరిగినకొద్దీ దూరమవుతారు. వర్ష మనసు నాకు తెలియటం లేదన్నది కాస్త ఆందోళన కలిగిస్తున్నది. నా ఆందోళన మాట దేవు డెరుగు – నే నేం చేస్తే న్యాయంగా ఉంటుంది ?"

డాక్టర్‌గారు చిక్కులోనే పడ్డాడు. ఆయనకు తట్టని ఆలోచన నాకు మాత్రం ఏం తట్టుతుందీ ?

"ఒక కాంప్రొమైజ్ సొల్యూషన్ చూస్తే?" అన్నాను.

"ఏమిటది ?"

"వర్షను కొంత కాలం తాతగారి దగ్గిర ఉండి రానిస్తే ? మిమ్మల్ని వదులుకోనూ అవసరం లేదు. ఆయన కోరిక తీరినట్టూ అవుతుంది. ఆ తరవాత వర్షకు తాతదగ్గిరే ఉండాలనిపిస్తే ఉండిపోనూ వచ్చు. కొంతకాల మన్నదానికి లిమిట్ ఎంతో వర్షే నిర్ణయించుకుంటుంది. నాలుగు రోజులే ఉండి తిరిగి మీ దగ్గిరికి వచ్చేసిందనుకోండి. మీ నాన్నగారు ఎవరినీ తప్పు పట్టటాని కుండదు. ఇప్పుడంటే మీరు అడ్డుపడుతున్నారని ఆక్షేపించగలడు. ఒక వేళ వర్ష మీ దగ్గిరికి తిరిగి రాకుండా అక్కడే ఉండిపోయిందనుకోండి; అప్పుడుకూడా మీ పొజిషను క్లియర్‌గానే ఉంటుంది. ఆమె పైకి అనలేకుండా ఉన్న కోరికను తీర్చినవారవుతారు. మీరుకూడా వస్తే వర్ష తాతగారి దగ్గిరికి వెళతానన్నది ఫాల్స్‌పొజిషన్ అది అందరికీ చెడ్డదే."

డాక్టరుగారి మొహంలో కొంత తృప్తి కనపడింది.

"నీ సజెషన్ బాగానే ఉంది, సూర్యం. ఒక్కటే అనుమానం – వర్ష ఇందుక్కూడా ఒప్పుకోక, మేం వస్తేనే గాని తాతదగ్గిరికి పోనని పట్టుబడితే ?" అన్నాడు.

"పట్టదు." అన్నాడు నమ్మకంగా.

ఆయన ఆశ్చర్యపోయి, "ఎట్లా చెప్పగలవ్ ?" అన్నాడు.

ముసలాయన సర్కిల్‌గా రింట్లో తిష్ఠ వేసి నా ద్వారా వర్షను పిలిపించటమూ, నాతో నైనా చెప్పకుండా వర్ష తాతగారి దగ్గిరికి వెళ్ళి రావటమూ ఆయనకి చెప్పేశాను.

"మా సీను పెళ్ళప్పుడు నేను వర్షను వెంటబెట్టుకు పోయాను. చూడండీ, అప్పుడాయన వర్షను అందల మెక్కించాడు – అందల మేమిటి? ఏకంగా పుష్పక విమానమే ఎక్కించాడు! సంతోషించాడు; ఆనందబాష్పాలు రాల్చాడు, తన లక్ష్మి అన్నాడు; మనవరాల్ని అందఱికీ చూపించి గర్వపడ్డాడు; పెద్ద నాటకమాడాడు. దాని ఎఫెక్ట్ వర్షపైన ఉండదనుకోవటం ఎట్లా? ఏ ప్రాణి అయినా – చివరకు కుక్కలూ, పిల్లులూకూడా – ప్రేమకి రెస్పాండ్

చేస్తాయిగదా!" అన్నాను.

"నిజమేనోయ్. నీ మాటల్లో చాలా సత్యం ఉంది. ఈ పనికూడా నీ చేతిమీది గానే కానీ. ఈ ఆలోచన చేసినవాడివి నువ్వూ. కిందటిసారి నర్సును తాతదగ్గిరికి తీసుకుపోయినవాడివీ నువే ... ఒకపని చేద్దాం. నే నప్పుడే గుంటూరుకు మారను. డాక్టర్ శ్రీధర్‌ని రెండునెల్లు గడువడుగుతాను. నేను నర్సును ఇక్కడికి తీసుకొస్తాను.

"మీరు గుంటూరు రావటాని కేం?" అన్నాను.

డాక్టరుగారు ఇబ్బంది మొహం పెట్టాడు.

"ఏం లేదూ! పాతఇల్లే ఖాళీ చేయించి తీసుకోవటానికి ఏర్పాటు చేశామా! ఆ ఇంట్లో నర్సు లేకుండా మే మిద్దరమూ ఉండటమంటే ఏదోగా అనిపిస్తున్నది."

ఆయనను చూస్తే జాలేసింది. నర్సు నిజంగానే తాతగారిదగ్గిర ఉండిపోతే ఆయన బాధపడబోతున్నాడు.

"మీ యిష్టం." అన్నాను.

"నర్సునెప్పుడు తీసుకురాను?" అన్నాడాయన.

"మా పరీక్షలై పోనివ్వండి."

"డాక్టరుగారు వెళ్ళిపోయారు. ఈ యేడంతా నాకే సమస్యా లేదు - మార్కులు బాగా తెచ్చుకోవటం తప్ప. డాక్టరుగారి రాకతో మళ్ళీ సమస్య అనేది వచ్చిపడింది. ఆ సమస్యకు డాక్టరుగారు కనిపెట్టలేని పరిష్కారమార్గం నేను కనిపెట్టా నని చాలా గర్వపడ్డాను.

పరీక్ష లవుతూండగానే డాక్టరుగారు సకుటుంబంగా వచ్చి పాతఇంట్లో దిగారట. గుంటూరు ప్రయాణం రెండునెల్లు వాయిదా వేద్దామనుకున్న అభిప్రాయాన్ని ఆయన మార్చుకున్నట్టున్నది. నర్సు లేకుండా తానూ భార్యా ఆ ఇంట ఉండలేమని బయటపడ్డాక ఆయన తన దౌర్బల్యానికి సిగ్గుపడి, దాన్ని జయించా లనుకున్నాడేమో! లేక ఇంకేదన్నా కారణం ఉందో!

వాళ్ళు రావడం నాకు తెలీదు. పరీక్ష లింకా రెండుమూడురోజుల్లో అయిపోతా యనగా డాక్టరుగారు నా గదికి వచ్చాడు. వాళ్ళు గుంటూరు చేరి అప్పటికి వారం కావస్తున్నదిట. ఆయన శ్రీధర్‌గారి దగ్గిర చేరి పోయాట్టకూడా.

శుక్రవారంతో నా పరీక్ష లైపోతాయని చెప్పాను.


"అయితే శనివారంనాడుగాని ఆదివారం నాడుగాని నువు నర్సుని వెంటబెట్టుక పోవచ్చు. నా భార్యకూడా ఈ ఏర్పాటుకు ఒప్పుకున్నది - నేనే ఒప్పించా ననుకో పోనీ... మా నాన్నకు నీ పేరనే ఉత్తరం రాయి. ఆదివారం వస్తామని రాయి," అన్నాడు.

ముసలాయనికి ఒక ఉత్తరం రాశాను. రెండే రెండుముక్కలు. ఆ ఉత్తరం చదివి చూసుకుని డాక్టరుగారు, "చాలు. దీన్ని నేను పోస్టు చేస్తానులే. నీ చదువు డిస్టర్బ్ చెయ్యను." అని వెళ్ళిపోయాడు.

శుక్రవారంనాడు రాత్రికే నేను డాక్టరుగారింటికి చేరుకున్నాను. మళ్ళీ అంతా వెనకటి లాగానే ఉంది. మధ్యజరిగిన దంతా నాటకంలో విష్కంభం లాటిదేనా? అసలు నాటకం ఏదో ఎవరు చెప్పగలరు? మన జీవితాలే విష్కంభాలు!...

నా కిప్పుడు నలభై అయిదేళ్ళు. అనుభవంమీదా, ఆలోచించీ ఈమాట అంటున్నా ననుకోండి. అసలు నాటకం ఇప్పుడు నాకు లీలగా పొడగట్టుతున్నది. అది జగన్నాటకం. వేదాంతులు చెప్పే భగవల్లీల నా కింకా పొడగట్టటం లేదు; ఆ జగన్నాటకం గురించి కాదు నే చెప్పేది. నాకు లీలగా పొడకట్టుతున్న నాటకం మానవ జీవితానికీ, వివిధ దేశాలకూ, వివిధ యుగాలకూ సంబంధించినది. మనం చాలా చిన్నచిన్న సమస్యలతో సతమత మవుతూంటే పెద్ద సమస్యలు వాటంతట అవే రూపం దాల్చి, కార్యకారణ సంబంధాన్ని బట్టి తమ రూపాన్ని మార్చుకుంటూ మానవజాతిని మౌనంగా ప్రశ్నిస్తున్నాయి. ఇప్పు డిప్పుడే "తాతా" "మామా" అనటం నేర్చుకుంటున్న మానవుడు కాలక్రమాన ఆ ప్రశ్నలను తన ఆధీనంలోకి తీసుకుని పరిష్కరిస్తాడు...

(సశేషం)



పరిదేవనము

శ్రీ మహావాది వేంకటరత్నము

(అది ఒక మహానగరము. అప్పుడే సూర్యభగవానుఁ డుదయించుచున్నాఁడు. అరుణకాంతులు దిశామందిరమున వ్యాపించుచున్నవి. కసాయి శాలలో రక్తకాంతులు ప్రబల మగుచున్నవి. వందలాది సాధుజీవుల వేడినెత్తురు జాలువాఱుచున్నది. స్వార్థపరుఁడైన మానవుని బుభుక్షా మహామారికి ఇది నిత్యనైవేద్యము.

ఆ కటికి కసాయిశాలలో ఒక ముసలి గోమాత ఒక గుంజకు కట్టివేయఁబడియున్నది. అల్లంత దూరాన కండలు కరఁగిపోయిన ఒక ముసలి యెద్దు విలఁబడియున్నది. దాని ప్రక్కనే చిన్న తిన్నెమీఁద ఒక కాపు కూర్చుండి, హాయిగా చుట్ట త్రాగుచు, కసాయితో బేర మాడుచున్నాఁడు. ఆ వృద్ధవృషభరాజము మానవుని కృతఘ్నతకు మనసు విఱిగి, జొటజొట కన్నీరు కార్చుచున్నది.

ఆ దయనీయ దృశ్యమును గాంచునటికి తనకు - తన కుమారునకుఁ గలుగనున్న దుర్మరణము బోధపడినది కాఁబోలు. ఆ వృద్ధ గోమాత మాతృహృదయము బ్రద్దలైనది. కన్నులు కన్నీటిచెఱువు లైనవి. ఆ క్షణములో ఆ పవిత్ర పరితప్తహృదయములో చెలరేఁగిన మూకభావాలకు రూపకల్పనమే ఈ పద్యాలు

ఓయి హాలికా! నీకు నో రుండవచ్చు;
నేను మూఁగను గావచ్చు; కాని మనకు
బుద్ధులే వేరు; నిస్స్వార్థబుద్ధి నాది;
పరుల మేలు గోరని స్వార్థపరుఁడ వీవు.

గడ్డిగాదము తిని కన్నబిడ్డకైన
కడుపునిండఁగ నా పాలు గుడుపకుండ
నీకు నీ కుటుంబమునకు, నీ ప్రజలకు
పొట్ట నింపితి పరహితబుద్ధితోడ.

నీవుమాత్రము నీ మేలునే గణించి
పిసినిగొట్టువై నా పాలు పిదికికొందు;
వొక్కబొట్టును నా బొట్టె కుంచఁబోవు;
హారి హారీ! నీ దురాశకు హద్దులేదు.

అకటా! నా పసిబిడ్డ పాలకయి 'అంబా' యంచు నన్ జేరి మ
చ్చికతో గ్రుక్కెఁడు త్రాగుచే తడవుగా చేఁజేతులన్ లాగి కొ
య్యకు బంధింతువె కాని నా హృదయ మెంతల్లాడునో నీ వాకిం
చుక యోచింపవు; స్వార్థబుద్ధులు పరక్షోభంబు పాటింతురే?

గడ్డి భుజింతునే యనుము కల్మషచిత్తను గాను; చూడ నే
గొడ్డునెయైన స్వార్థమునకుం బలికాను; బలాఢ్యులై ష.నా
బిడ్డల నెల్ల దేశము సుభిక్షమొనర్పనె పంపుకొంటి; నా
దొడ్డతనంబునే మరచి ద్రోహ మొనర్చెదవా? కృషీవలా!

సత్తువ గల్గుదాఁక నొకసారియు క్రుమ్మక దాచుకోక - నో
రెత్తక - పాలు పండితిని; ఎప్పుడు నీ హితమే గణించి నా
నెత్తురు ధారవోసితిని; నీ విది యెన్నక నీచబుద్ధితో
సత్తువ చచ్చియున్న ననుఁ జంపనకోరి కసాయి కిత్తువా?

బండబూతులు తిట్టిన - పాప మనక
కట్టి కొట్టిన - తుద కింత పెట్టకున్న
పాలు కురిసితిఁగాని పాపాలు కురియ;
ప్రేమమయమోయి! నా మాతృహృదయ మెపుడు.

ఇన్నివిధాల నీ శుభమునే మది గోరుచునుండి - నోరు లే
కున్నను నీవె చెప్పినటు లొద్దికతోడ మెలంగుచుండి - నీ
వెన్నివిధాల మాడ్చినను నేమనఁబోక సహించు నన్నిటుల్
చెన్నటిబుద్ధితోడ నెరసేతువె? పాడు కసాయి కత్తికిన్.

అక్కఱలేని యీ ముసలియావును మేపుట దండుగంచు న
న్నక్కట! డబ్బుకక్కఱితికై నఱకింతువ? నీదు తల్లి నే
అక్కఱ దీరఁగా ముసలిదైన వధింతువా? చెప్పుమయ్యా! వే
ఱెక్కడ దిక్కులేని దనియేకద నన్నిటు గొంతుకోయుటల్!

అందల మెక్కి వేదయుగమందు మహర్షుల పూజఁ గంటి; గో
విందుని ప్రాపునన్ జగతి వేలుపునై నతు లందుకొంటి; నీ
హైందవధాత్రికిన్ జననినై జనయిత్రి పదంబు గంటి; నేఁ
డెందుకఁగాక యిట్లు తపియించుచునుంటి ననాథనై యిటన్.

నాదు జన్మంబు పాలసంద్రంబునందు
నా నివాసంబు స్వర్భువనంబునందు
నాదు సంతృప్తి పరహితానందమందు
జగమునకు మేలుసేత నా "జన్మహక్కు."
తల్లి లేని పాపల కేను తల్లి నైతి;
వివిధ రోగార్తులకు నేను వెజ్జు నైతి;
పాడిపంటల కేను కల్పంబ నైతి;
ఏమితప్పు చేసితివని యిట్టి శిక్ష ?
దేశసౌభాగ్యవర్ధన దీక్షతోడ
నిరతము శ్రమించుకొడుకు మన్నిలఁ గంటి;
పరమపావనమైనట్టి బ్రతుకుఁ గంటి;
దేని కీ శిక్ష నాకు విధించినావు ?

* * *

మన్ననలేక నా బ్రదుకు మాపిన మాపుదుగాక ! బాబు ! నా కన్నులముందర నా సుతుని కంఠమమాత్రము త్రుంపఁబోకు; మీ పున్నెము గట్టుకొమ్మ, కయిమోడ్తును; వార్ధకమందు హాయిగా కన్నులు మూసెదన్; కడుపు గాల్పకు పుత్రవిషాదవహ్నితో. అదిగో చూడుము; నాతనూభవుడునీయన్యాయముంగాంచి, యాపదలో మున్గిన నన్నుఁ జూచి, తనదౌర్బల్యంబు చింతించి, నా బ్రదుకుం గావఁగలేక గుండె పగులన్ వాపోవుచున్నాఁడు; మా హృదయక్షోభము లెట్లు బోధపడునోయీ ! నీకు రాగుండెకున్. పశుపతియైన నా సుతుని పావనబుద్ధికి చాల మెచ్చి, యా పశుపతి యంతవాఁడె తన వాహముగాఁ గొని యాదరించె; నీ దృశమగు దొడ్డకీర్తి గడియించియు గర్వ మొకింత లేక నీ వశమున నుండఁడే ? వినయభావముతో నినుఁ గొరి కొల్వఁడే ? అరయఁగ నీమమాట కెదురాడి యెరుంగఁడు ; చెప్పినంతనే శిరమునఁ దాల్చి నీ పనులు చేసెగ; వానకు నెండ కోర్చి నీ కొఱ కనిశంబు కష్టపడె; కొమ్ములు మొల్చినవాఁడెయైన కింకరుఁడయి నిన్నుఁగొల్చె; నిది కాదనలేవుగదోయి ! కర్షకా ! నమ్మినబంటు నా కొడుకు; న్యాయమె వానికి నిట్టి శిక్ష ? పాపమ్మని తోఁచదా ? ముసలివాఁడసియైనను జాలిలేద ? స్వార్థమ్మునకైన హద్దు వలదా ? చెమటోడ్చి శ్రమించి నీదు క్షేమమ్మునె కోరు నా ప్రియకుమారునినెత్తురు కండ్లఁ జూతువా ?

అతఁడు పండించినట్టి ధాన్యముల నెల్ల
కమ్మకమ్మగా తిందువు కడుపునిండ;
ఒక్కనాఁడైన వానికి డొక్కనిండ
పెట్టియెఱుఁగవు నీ కేటి పెద్దరికము.

పెట్టిన, పెట్టకున్న, శ్రమపెట్టిన, తిట్టిన, చావఁగొట్టినన్, చుట్టరికంబులోనె నినుఁ జూచెను; కోప మొకింతలేక నీ పొట్టకునై శ్రమంపడెను; పుణ్యచరిత్రుఁడు - వీనిఁ బువ్వులం బెట్టక, వార్ధకాన సుఖపెట్టక, పొట్టను బెట్టుకొందువా ?

పండ్లతరబడి నీకోసమే శ్రమించు
పైడి పండించినట్టి నా బసవరాజు
ముసలివాఁడయ్యెనని ద్రోహబుద్ధితోడ
కోత కిత్తువె ? యెంతటి పాతకుఁడవు ?

మాది పవిత్రజన్మసుమి; మానవధాత్రికి మేమురక్ష; బ్రహ్మాదులుగూడ మమ్ము గొనియాడి భజింతురు: మా శరీర మా పాదశిరంబు, మామలము, పంచితమున్ గడుపావనాలు; మాపై దయలేనిజాతికి శుభంబులు లేవుసుమా కృషీవలా !

ఎఱుఁగదు మా మహామహిమ మెట్టిదొ స్వార్థజగత్తు; తొల్లి దప్పరముగ నొక్కరాజు మముఁ బట్టి సఖూలముగా నశించె; మా కరుణకు పాత్రుఁడై ధరణికాంతుఁడొకండు సుపుత్రుఁగాంచె; మా కిరవుగ శక్తియున్నను సహింతుము లోకమొనర్చు తప్పులన్.

నీతి నియమాలు లేని నీ జాతివోలె
పాలు పిండక నేనును - పంతగించి
పొలముదున్నక నా వీరపుత్రకులును
సమ్మె చేసిన మీ రేమి సలుపఁగలరు ?

మేమే సమ్మెమొనర్తుమేని విను మీమీ బాహుదర్పంబుగానీ - మీ సైన్యముగాని - చట్టములుగానీ - మమ్ము దండింపలే; వేమంత్రంబులుగాని - తంత్రములుగానీ - లోఁగొన్నంజాలవయ్యా ! మా శక్తికి మాఱులేదు; జగమంతా దద్దరిల్లుం జుమీ ! కానీ మే మటువంటి సమ్మెలకు డిగ్గంబోము; లోకైక కల్యాణం బెప్పుడు కోరిచేయుదుము; మా కన్యాయముం జేసినన్ మౌనస్వాంతులమైభరింతు; మయినన్ మన్నింపు నీ యార్షవిజ్ఞానమ్మున్; బలివెట్టఁజూడకుము నీ స్వార్థానికై మమ్ములన్.

కాటికి కాళ్ళు చాచుకుని, కాలము నెట్లొ ముగింపనున్న నా మాటలవల్ల నీ మనసు మారదులే ! మముఁ గావఁబోవులే ! యేటికి ధర్మబోధములు ? హింసయె నీ యభిలాషయేని జాగేటికి ? ముందు నన్ను వధియింపుము; హాయిగ కన్నుమూసెదన్.

ఓం శాంతిః

బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ : 7

జరిగిన కథ

పెళ్ళి చూపులు తప్పిపోతాయి. అంటే పెద్దవాళ్ళకు నచ్చదు. కాని అబ్బాయీ, అమ్మాయిలకు నచ్చుతుంది. ఆ అమ్మాయి—రాధను తప్ప మరొకరిని పెళ్ళి చేసుకోనని భీష్మించుక్కూర్చుంటాడు పట్టూ. తండ్రికి యిష్టంవుండదు. స్నేహితుడు చింతా సహాయంతో చక్కటి నాటకం ఆడి ఎలాగైతేనేం తండ్రిని ఒప్పిస్తాడు పట్టూ. పెళ్ళికి తరలివెళ్తారు. తీరా పెళ్ళి పీటలమీద పెళ్ళికూతురు రాధకాదు. వెంటనే పీటలమీంచి లేచిపోతాడు పట్టూ

"ఇంటికెళ్ళు," అన్నాడు మిస్టర్ చింతా

"ఎలా వెళ్ళను?" అన్నాడు పట్టూ.

"వెళ్ళ కేం జేస్తావు?"

"ఏం జేస్తాను?"

"అదే అడుగుతున్నా."

"అదే తెలీడంలేదు."

పట్టూ తల రెండుచేతులతోటే పట్టుకుని కుర్చీలో ముందుకి వంగాడు. చటుకున లేచి ఇటూ అటూ పచారు చేశాడు. నాలుగుసార్లు తిరిగాక చటుకుని ఆగాడు. తనలో తనే అనుకున్నట్టు అన్నాడు

"అబ్బ! ఏం పీడికల! సమయానికి నీ కారుండబట్టి బతికి బయట పడ్డాడుగాని, లేకపోతే— ఓ మైగాడ్."

పట్టూ మళ్ళీ పచారు చేశాడు. మిస్టర్ చింతా 'మగవాళ్ళకి మాత్రం' అనే ఆంగ్ల పత్రికలో ఆడబొమ్మలు చూస్తూ కూచున్నాడు తనకేం సంబంధం లేనట్టు. పట్టూ ఉద్రేకంగా వచ్చి మిస్టర్ చింతా భుజాలు పట్టుకున్నాడు.

"అసలు. పెళ్ళికూతురు అసలుపెళ్ళి కూతురు కాదురా. ఆపిల్ల కానేకాదు. అంటే ఆపిల్లకాదు పెళ్ళికూతురు. అంటే పెళ్ళి కూతురు ఆ పిల్లకాదు."

మిస్టర్ చింతా సాభిప్రాయంగా పట్టూ వంక చూశాడు.

"చుట్ట కావాలా?" అన్నాడు. పట్టూ అతి తొందరగా చుట్టకి చిల్లిచేసి అంటించడానికి అగ్గిపుల్ల గీశాడు

"ఇంటికెళ్ళు," అన్నాడు మిస్టర్ చింతా.

పట్టూ నిర్ఘాంతపోయాడు తన చెవులు నిజంగా ఆ మాటలు విన్నాయా? మిస్టర్ చింతా నోటివెంటనా ఆమాట లొస్తా? అతని చేతిలో మండుతున్న అగ్గిపుల్ల కింద పడిపోయింది. ఆ మంట కాశ్మీర్ తివాసీలో రంధ్రం చెయ్యకండా చటుకుని ఆ అగ్గిపుల్ల తీసి ఆష్ట్రేలో వేశాడు మిస్టర్ చింతా.

"ఏవిఁటన్నావు?" అన్నాడు పట్టూ.

"ఇంటి కెళ్ళమన్నాను," అన్నాడు మిస్టర్ చింతా.


"నీ కేమన్నా మతి పోయిందా? మా అమ్మకీ నాన్నకీ నా మొహం ఎల్లా చూపించమురా? వాళ్ళకి ఎదురుతిరిగాను. వాళ్ళికి సుతరామూ ఇష్టంలేని సంబంధానికి వాళ్ళ చేత ఒప్పించాను. నేను పిచ్చాణ్ణనో, నాకు దెయ్యం పట్టిందనో వాళ్ళనుకున్నా నేను లెక్కచెయ్యలేదు. నాలుగురోజులు ఉత్త కాఫీతాగి నిరశనవ్రతం సాగించాను. అంతా ఆ పిల్లకోసం. ఆ భూమ్మీద అవతరించిన అప్సరసకోసం. ఆమె నడకే నాట్యం. అసలు భూమ్మీద కాలు మోపితేగా? గాలిలో అలా అలా తేలి నడిచింది. ప్రతి కదలికా ఒక ప్రవాహం. ఆ పిల్లకోసం ఎన్ని త్యాగాలు చేశాను. ఎంత అప్రతిష్టపాలయ్యాను. ఆఖరికి ఆ పిల్ల పిల్లకాదు పెళ్ళి పీటలమీద కళ్ళు తెరిచి చూసేసరికి పర్వతమంత విగ్రహం..."

"పెళ్ళికూతురేనా?"

"కాదు. ఆ పర్వతమే పెళ్ళి కూతురైతే అక్కడే ప్రాణాలొదిలేద్దును. ఆ పర్వతం పక్కని పెళ్ళికూతురు. అసలు పెళ్ళి కూతురు లేదు అసలు పిల్ల నేలమీద నడవదుగా. ఈ పిల్ల గట్టిగా నేలమీద నడిచింది. అసలుపిల్ల కళ్ళలో చిరునవ్వులు చిందులాడతాయి. ఈ అమ్మాయి కళ్ళు మహ కరుకుగా ఉన్నాయి. అసలుపిల్ల చుట్టూ ఏదో వెలుగుంది—వెన్నెల్లాంటిది. ఈ పిల్ల చుట్టూ—కొట్టొచ్చేచీర అంచుతప్ప మరేం కనపడలేదు. అసలుపిల్ల..."

"చుట్ట అంటించు" అన్నాడు మిస్టర్ చింతా. పట్టూ గాలి పోయిన బుడగలాగ కుర్చీలో చప్పగా చతికలబడిపోయాడు. చేసేదిలేక చుట్ట అంటించాడు. అగ్గిపుల్ల అతను కింద పడెయ్యకముందే, మిస్టర్ చింతా దాన్ని అందుకుని ఆష్ట్రేలో పడేశాడు. తనో చుట్ట అంటించి, తాపీగా పొగ ఒదులుతూ అన్నాడు.

"నిజాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలి బ్రదర్. ఒకప్పుడు ఆపిల్ల గాలిలో తేలిందన్నావు. ఆమె చుట్టూ వెన్నెల్లాంటి వెలుగేదో ఆవరించుకుని ఉందన్నావు! ఇంకా ఏదేదో అన్నావు. తీరా పెళ్ళికూతురుగా వొచ్చేసరికి ఆమె నేలమీద నడిచిందన్నావు. అసలు అంత గాలిలో ఎగిరిపోయేపిల్ల



కంటే, కాస్త బలంగా నేలమీద నడవగలిగే పిల్లంటేనే నా కిష్టమనుకో. అది వేరే విషయం. అసలు నువ్వు గ్రహించక చేసిం దేమిటంటే, ఒకొక్కప్పుడు ఒకొక్కలాగ నీకు మనుషులు కనుపిస్తున్నారూ అంటే, అది మనుషుల్లో దోషంకాదు. నీలో దోషం. నీ కళ్లలో మార్పులివే. మనుషుల్ని బాధ్యుల్ని చెయ్యడం న్యాయంకాదు. నీ కళ్ళలో ఉంది అసలుదోషం. అది నీ మనస్సులో దోష మయినా కావచ్చు ఒకటి నిజం. అందరికీ కనబడని వేవో నీ కళ్ళకి కనబడుతున్నాయి. అది జబ్బే. భూతాల పిచ్చెయ్యని ఆపు చెయ్యడం పొరపాటు చేశానా అనిపిస్తోంది."

మిస్టర్ చింతా చుట్ట పీల్చాడు. పొగ రాక పోతే ఆరిపోయిందని గ్రహించి అగ్గిపుల్ల గీసి అంటించాడు. పట్టూ నిట్టూర్చాడు.

"నీ కర్థంకాదులేరా," అన్నాడు పట్టూ

"అర్థంకాక పోడాని కేముంది? ఏ ఆడ పిల్లనా అసలు గాలిలో ఎల్లా ఎగురు తుంది? భూమ్యాకర్షణని రద్దుచేసే రెక్క ల్లాంటి సాధన మేదో లేకపోతే! అదీగాక ఘనపదార్థాలు ప్రవహించట మేమిటి? ద్రవ వాయు పదార్థాలు ప్రవహిస్తాయిగాని!... మొదట ఆ పిల్లని చూసిననాడు ఉల్లిపాయ లేమన్నా ఎక్కువగా తిన్నావా?...అంతే అయుంటాలి. పైత్యంవల్ల కంటినరాలు కద లడం, లేనిపోని దృశ్యాలన్నీ నీకు కనబడి ఉంటాయి. లేకపోతే ఆడపిల్ల ఎగరడ మేమిటి?..."

పట్టూ మళ్ళీ నిట్టూర్చాడు. మిస్టర్ చింతా పొగ పీల్చాడు.

"అసలు, పసరుతిత్తి పాడై ఉంటుందిలే. మీ అమ్మ గారంకొద్దీ అడ్డమైనవన్నీ పెట్టి నిన్ను చిన్నప్పటినుంచీ మేపిఉంటుంది. చిన్నప్పుడు నీ కేమన్నా లివర్ ఒచ్చిందా? జమ్మీవాళ్ళ మందు పుచ్చుకున్నట్టు నీ కేం గుర్తులే?...పసరుతిత్తో లేకపోతే కాలే యమో..."

ఈ స్వగతం ఇల్లా ఎంత కాలమైనా సాగేదే. అకస్మాత్తుగా రామయ్య అక్క డికి రావడంవల్ల అంతటితో ఆగిపోయింది.

రామయ్య పట్టూని చూశాడు.

పట్టూ రామయ్యని చూశాడు.

"నన్ను ... నువ్వు ... నిన్ను ...."

అన్నాడు రామయ్య.

దానికి సమాధానంగా పట్టూ రెండు గుట కలు వేశాడు.

మిస్టర్ చింతా తన చుట్ట తాలూకు రెట్ట ఏష్‌ట్రేలో వేస్తూ,—

"దయచెయ్యండి," అన్నాడు కుర్చీ చూపిస్తూ.

రామయ్య అతనివంక ఉరుముతూ చూశాడు. తరవాత కూచున్నాడు.

"పట్టూ చాలా తెలివి తక్కువ పని చేశాడు," అన్నాడు మిస్టర్ చింతా.

"తెలివితక్కువ పనా?" అన్నాడు రామయ్య; "వాడు దుర్మార్గుడు. రాక్షసుడు అన్యాయంగా ఒక అమాయకురాలి బతుకు నాశనం చేశాడు. మా పరువూ మర్యాదా మట్టి పాలుచేశాడు. అసలీ పెళ్ళి కాకపోతే చచ్చి పోతానని అఘోరించింది ఆ చవటే. తీరా పెళ్ళి పీటలమీదకి ఆ పిల్ల వస్తుంటే పారి పోయిందీ ఆ వెధవే. అటువంటివాడు ఆ పిల్లనే తప్ప చేసుకోనని ఎందుకు పట్టుపట్టాలీ అంట.?"

"అవును. ఎందుకు పట్టుపట్టాలి?" అన్నాడు మిస్టర్ చింతా, అతనికీ తెలీదు పాపం?"

"ఏం తెలీదు?"

"అతను ఏపని ఎందుకు చేస్తున్నాడో అతనికి తెలీదు. అంటే అతను చేసే పను లకు అతను బాధ్యుడు కాడన్నమాట - కల లకీ నిజానికీ తేడా అతనికి తెలియదు—"

రామయ్య నిర్ఘాంతపోయాడు. "అయితే ... అయితే ... వాడికి పిచ్చా?" అన్నాడు.

"అబ్బే - అంత ప్రమాద మేమీలేదు. కొంచెం తాత్కాలికంగా..."

"అయితే భూతాల పిచ్చెయ్య? పిలిస్తే మంచిదేమో," అన్నాడు రామయ్య.

"వొద్దు," అంటూ అరిచాడు పట్టూ. అరుస్తూనే కుర్చీలో గజమెత్తు ఎగిరాడు, "వాణ్ణి పిలిపిస్తే వాణ్ణి చంపివేసి నేను చచ్చి పోతాను."

"కూర్చో." అని గట్టిగా అరిచాడు మిస్టర్ చింతా. పట్టూ కూచున్నాడు.

మిస్టర్ చింతా ఎప్పుడూ అరవడు, అసలు ఎంత ఉద్రేకమొచ్చినా గొంతుక తగ్గించి మాట్టాడ్డం అతనికి అలవాటు. అంచేత అకస్మాత్తుగా అతను అరిచాడంటే అది రామబాణంలా పని చేస్తుంది. ఇం కొకటి. అసలు ఉద్రేకం. తెచ్చుకోకండా అరవగలడు మిస్టర్ చింతా, అరిచిన వెంటనే తాపీగా తక్కువ విషయాలు చెప్పకు పోగలడు

"అవసరం లేదు. అంతేకాదు. అతన్ని పిలిస్తే మరికాస్త వికటించే అవకాశం కూడా ఉంది. ఈ...అస్థిరం...భ్రమ... ఏడనండి...ఇది మీద రాలంటే — రోగిని ఆప్యాయంగా చూడాలి. ఇంటికి తీసుకు పొండి. జరిగిన విషయాన్ని గురించి ఎవ్వరూ ప్రస్తావించకండి. అది జరగనట్టు గానే వ్యవహరించండి. అతన్ని కాస్త ప్రేమగా చూడండి. కొద్దిరోజుల్లో తేరు కుంటాడు.

ఇక పట్టూ విషయం. జరిగిన పీడకలని అతనికి అనుక్షణం జ్ఞాపకం చెయ్యకండా ఉంటే. చాలు అతన్ని పిచ్చివా డనుకున్నా సరే. దూషణలకూ తిరస్కారాలకూ భయ పడే, అతను ఇంటికి పోకండా మిస్టర్ చింతా ఇంట్లో తలదాచుకున్నదీ. అంచేత మిస్టర్ చింతా అతన్ని అన్యాయంగా పిచ్చివాణ్ణి చేసినా. మానసికమైన పీడ తలిదండ్రుల వద్దనించి రాకండా అడ్డుపడి నందుకు. అతనికి మనస్సులో వెయ్యి దండాలు పెట్టు కున్నాడు.

అంచేత మిస్టర్ చింతా చెప్పగానే. పట్టూ మేకలాగ తండ్రి ననుసరించి ఇంటికి వెళ్ళాడు.

కామన్న ఇల్లంతా పచారుచేస్తూ భయం కరంగా ఆలోచిస్తున్నాడు. అది ఆలోచనా కాదు. అతని మనస్సులో తెరమీద రకరకాల భయంకర దృశ్యాలు వచ్చి పోతున్నాయి వాటన్నింటిలోనూ కామన్న అనే తను, ద్రోహి అయిన పట్టూని రక రకాల శరీర పీడకు గురిచేస్తున్నాడు. మొదట పట్టూ చెయ్యి —ఏ చెయ్యి? ఏదైతే నేం - చెయ్యి మెలిపెట్టేశాడు. పట్టూ గొడ్డులా అరుస్తున్నాడు బాధతో. కామన్న అభిప్రాయం ఆ చెయ్యి విరిచేసి దూరంగా పారెయ్యాలని; ఒకవేళ అది అందుబాటులో ఉంటే మళ్ళీ ఆ చేతిని తీసుకొచ్చి అతికేసు కోవచ్చు పట్టూ. కాని కామన్న కీ దండన తృప్తికరంగా లేదు. ఎందుకంటే, చెయ్యి విరిగిపోకండా ఉన్నంతసేపే అసలయిన బాధ. తీరా విరిగిపోయాక అంత బాధ ఉండదు. అంచేత నేరానికి తగిన మోతా దులో లేదని, ఈ దండననూ మానుకున్నాడు కామన్న. చెయ్యి మెలిపెట్టినంతసేపూ పట్టూ అరుస్తున్నంతసేపూ, ఫరవాలేదు కామన్నకి కసి తీరినట్టే అనిపించింది. టప్పుని విరిగినప్పుడు కూడా ఏదో కడుపు నిండినట్టుంది గాని, ఆ తరవాత రుచి తగ్గి పోయింది. తరవాత తలుచుకుంటే మొత్త మంతా చప్పగా అనిపించింది. మరో ఊహ రెండు మడమలూ వెనక్కి తిప్పేసి — దెయ్యాల కాళ్లలాగా - మళ్ళీ ముందుకి తిర క్కుండా కట్టి పారేస్తే, అప్పుడు అను క్షణం పట్టుకుని కూచోనూ అక్కర్లేదు. విసుగెత్తితే అవతలికిపోనూవచ్చు. అయితే కొందరికాళ్ళు కలవకాడల్లా చుట్టు తిప్పినా ఎంత తిప్పినా నెప్పేపెట్టవు. పోనీ పట్టూని పడుకోబెట్టి మంచి సున్నితమైన ప్రదేశాల్లో చర్మం కొంచెం కొంచెంగా ఒలిచేస్తే — ఒత్తాయితొక్క ఒలిచినట్టు? మరికాస్త సరదా కావాలంటే ఆ ఒలిచినచోట ఉప్పూ కారం ఆరారగా రాస్తుంటేసరి. కాని, దీనికే తను అస్తమానూ నేరస్తుడి పక్కని కూచో వాలి. నెమ్మదిగా తోలువొలిచే యంత్ర మేదన్నా ఉంటె బాగుండును. అప్పుడప్పుడు తను బయటికిపోతూ ఉండొచ్చు.

పదిరోజులుగా కామన్న ఇటువంటి దృశ్యాలు ఊహించుకుంటూ ఇల్లంతాపచార్లు చేస్తున్నాడు. ఆ దృశ్యాల్లో అతను ఎంతగా మలిగిపోయాడంటే, పళ్ళు బిగించి కళ్ళలో క్రౌర్యం సంతృప్తిసింపి, తన చేతులతో దేన్నో పిండేస్తూ మేలిపెట్టేస్తూ నిజంగా

పట్టూనే పీడిస్తున్నట్టు తృప్తిపడుతున్నాడు. అయితే ఇంతవరకూ ఎటువంటి దండన పట్టూకి విధించాలో అతనికి తేలలేదు.

ఈ ఆలోచనల్లో పడి అతను ఆసనాలు కూడా ఉపేక్ష చేశాడు. యోగాసనాల పుస్తకం అతని గదిలో నేలమీద పడిఉంది. అతను తలుపు తెరుచుకుని లోపలికి వెళ్ళినపుడల్లా ఆ పుస్తకం అతనివేపు నిందాపూర్వకందా చూస్తూంది. అతని మనసు కాస్త పీకుతూంది. కాని వెంటనే పట్టూమీది కోపం, అతనిమనసులో మరో దృశ్యం ప్రవేశపెట్టేసరికి, ఆసనాలు మరుపుతెరల మధ్య పడిపోతాయి. అయితే యోగాసన నియమావళిని ధిక్కరించి అతను కాఫీ మాత్రం ఇంతవరకూ తాకలేదు. అమ్మా నాన్నా గ్లాసులనిండా తాగుతున్నప్పుడు, దాని మత్తువాసన అతన్ని అనేకసార్లు తప్పుదారి తొక్కించాలని చూసింది. అయినా అతని విగ్రహం జయించుకుంటూనే వస్తోంది.

ఆ కాఫీవాసన, వెనక విశ్వామిత్రుణ్ణి తరిమినట్టు అతన్ని గదిలోకి తరిమింది. అక్కడ ఆసనాల పుస్తకం అతనివంక కోపంగా చూసింది. అతను కోపంగా గది తలుపు తెరుచుకుని ఇవతలి కొచ్చాడు.

"వాణ్ణి ఏకీలుకాకీలు విరిచేస్తే." అన్నాడు ఏదో సరికొత్త ఊహ తట్టినట్టు.

"వెయ్యోసారి నువ్వాముక్క అనడం." అంది రాధ నీరసంగా.

"ఇలా జరుగుతుందని నేను ముందే అనుకున్నాను. ఎందుకంటే - మాంగల్య స్థానంమీద శని దృష్టి బాగా ఉంది." అన్నాడు శంకరయ్య.

"ఆహా! ముందే తెలుసుంటే అసలు పెళ్ళి కెందు కొప్పుకున్నారు?" అంది శాంతమ్మ. అనేసి కళ్ళు మూసుకుని మంచం మీద నడుం వాల్చింది.

ఈ పదిరోజులూ, రోజుకి పదిసార్లయినా శాంతమ్మ మూర్ఛపోయింది. అయితే ఆ మూర్ఛకి తగినంత ఆదరంగాని, అధమం దానికి విరుగుడైన మజ్జిగ తేటగాని ఆమెకు లభించలేదు. అసలీబాధ్యత మామూలు రోజుల్లో కళ్యాణిమీద పడేది. ఆమె ఈ పదిరోజులూ గది వదలి ఇవతలికి రాలేదు. వంటా పెట్టూ రాధమీద పడింది. అదిగాక, కాశీగా ఉన్నప్పుడల్లా కళ్యాణిని కనిపెట్టుకుని ఉండేదామె. శంకరయ్య, ఎందుకనో ఈ తప్పంతా తనదయినట్టు ముఖం చాటేస్తున్నాడు. అంటే ఇంట్లోనే ఉన్నా, అంత ముఖ్యమైన పనుంటేతప్ప శాంతమ్మకి ముఖం చూపించడంలేదు. అంచేత ఆమె ఒకవేళ మూర్ఛపోయినా, అతడు గుర్తించే అవకాశం లేదు. సరే కామన్న పట్టూ కీళ్ళల్లో దేన్ని విరిస్తే మంచిదన్న విషయం తేలక పిచ్చిగా ఇల్లంతా పచార్లు చేస్తున్నాడు.

మూర్ఛకి కొంచెం ప్రోత్సాహం అవసరం. పక్కవాళ్ళలో అది కాస్త ఆదుర్దా కలిగించాలి; వాళ్ళ ఆదరం సంపాదించాలి. అసలెవరన్నా ఎందుకు మూర్ఛపోతారు? మూర్ఛవల్ల మూర్ఛపోయిన వ్యక్తికి మామూలుకన్నా ఎక్కువ ప్రాముఖ్యం వస్తుంది. ఒకరు నీళ్లు జల్లుతారు. మరొకరు మెడకింద మెత్తని తలగడా పెడతారు. ఇంకొకరు మజ్జిగతేట ఆప్యాయంగా తాగిస్తారు, మజ్జిగతేట కాకపోతే మరొకటి — అటువంటప్పుడు మరేది అలవాటైతే అదే ననుకోండి. మీరు మంచివయసులో ఉన్న ఆడపిల్లయితే, మీ ప్రియుడు మీతల ఒడిలో పెట్టుకుని ఆత్రంగా, జాలిగా, ప్రేమగా మీ నుదురు చేత్తో రాస్తో, కాస్త కవిత్వం మాట్లాడతాడు. మీరేగనక ఇంటి యజమాని గాని యజమానురాలుగాని అయితే, మూర్ఛని ఒక శాశ్వతమైన ఆయుధంగా మీరు వాడుకోవచ్చు, ఎటొచ్చీ చుట్టుపక్కల నున్నవాళ్ళ మనస్థితి, సమయం సందర్భం చూసుకుని మూర్ఛ పోవాలి. అప్పుడు మిగతావాళ్ళు ఆ సమయంలో ఏంచెయ్యాలో చెప్పక్కర్లేకండానే నేర్చుకుంటారు.

శాంతమ్మ — తన బిడ్డలకీ, భర్తకీ — తనకి మూర్ఛవస్తే; దాని అంతరార్థమేమిటో అప్పుడు వాళ్ళు ఏం చెయాలో, అన్నీ చాలా కాలంగా అలవాటుచేస్తూ వచ్చింది. అంచేత, సామాన్యంగా ఆమె మూర్ఛకు ఆమె అనుకున్న ఫలితాలు వస్తాయి.

అయితే, కళ్యాణిపెళ్ళి చెడిపోయిన ఆ దుర్ముహూర్తంనించీ, ఈ మూర్ఛఅనే ఆయుధానికి పటుత్వం తగ్గిపోయింది. ఆమెరెండు మూడుసార్లు మూర్ఛపోయింది. అయితే ఏం లాభం? మిగతావాళ్లు ఏం చెయాలో మరిచన్నాపోయుండాలి, లేకపోతేమూర్ఛలో నన్నా ఏదోలోపం ఉండాలి. మంచి పట్టుదలతో మూర్ఛపోయింది శాంతమ్మ-ఈసారి అయినా లాభం లేకపోయింది. ఆమెకు దిగులూ, దుఃఖం, అవమానం అన్నీ ఒక్కపెట్టున ఆవరించాయి. ఎందుకూ కొరగాని ఈ మూర్ఛనుంచి తేరుకుని గుండె పగిలేటట్టు ఏడవడం మొదలెట్టింది. ఆమెకు జరిగిన అన్యాయం అన్నిటికన్నా పెద్దది. ఇంకా కళ్యాణి కష్టపడి మరో పెళ్ళి కొడుకును సంపాదించుకోవచ్చు. అధమం ఆ అవకాశమన్నా ఉంది. మూర్ఛలాంటి ఆయుధాన్ని తను మళ్ళీ ఎక్కడ సంపాయించుకోగలదు? అందులో ఈ వయసులో రావలిసిన కష్టమా ఇది?

ఆమె గుండె పగిలేటట్టు ఏడ్చింది. అందరూ చుట్టూ చేరారు. క్షణంపాటు, ఈ ఏడుపు మూర్ఛలాంటి ఆయుధం అవుతుందేమోనన్న ఆశ శాంతమ్మకి కలగకపో

లేదు. కాని వెంటనే అది అసంభవమని ఆమె అంతరాత్మకి తెలిసిపోయింది. ఆమె ఏడుపు మరింత ఎక్కువైంది.

ఆమె అంతగా ఏడవడం, అదివరకెవరికీ అనుభవంలో లేదు. శంకరయ్య ఏ వలభై ఏళ్ళక్రితమో చూసి ఉండొచ్చుగాని, ఆ సమయ సందర్భాలతను పూర్తిగా మరిచిపోయాడు. ఏం చెయ్యడానికీ ఎవరికీ ఏమీ తోచలేదు.

శంకరయ్య ఓదార్చడానికి ఏమనాలో తెలీక, ఏదో భాషలో గొణిగాడు. కళ్యాణి పెళ్ళి చెడిపోడానికీ.ఈ ఏడుపుకీ నేరుగా సంబంధం ఉన్నట్టు మిగతావాళ్ళకి అనిపించలేదు. అదే కారణమయితే, ఇన్నాళ్ళూరుకుని, ఇప్పుడు అకస్మాత్తుగా కట్టలు తెంచుకోడానికి కారణ మేమిటి?

"కడుపు నొప్పా?" అన్నాడు కామన్న జంకుతూ.

"తలేమో!" అని సూచించాడు శంకరయ్య.

"మజ్జిగ తెస్తా," అంది రాధ. తన తల్లికేమొచ్చినా, మజ్జిగ ఒకటే మందైనట్టు.

ఇలాంటి చిలిపి కారణాలన్నీ తన ఏడుపుకి అంటగడుతుంటే, ఆమె గుండె నిజంగానే చెరువైపోయింది. కన్నీరు ఏరులై ప్రవహించింది. కాని ఇల్లాంటి మట్టిబుర్రల ముందు ఏడవడం వృధా. అయితే ప్రారంభించిన ఏడుపు అకస్మాత్తుగా ఆపడానికి వీల్లేదు. శాంతమ్మ పెద్ద ఇబ్బందిలో పడిపోయింది. ఎంతసేపే పీ ఉధృతం విలబెట్టి, ఎప్పుడు మెల్లగా తగ్గిస్తే మర్యాదగా ఉంటుందో ఆమె తేల్చుకోలేకపోయింది. ఇందులోంచి బయటపడాలంటే రెండు మార్గాలున్నాయి. ఒకటి, కాస్త గొంతు పెంచి. ఆ తరవాత మెల్లగా ఎగుపుల్లోకి దింపెయ్యడం. రెండోది, మెల్లగా ఏడుపు యొక్క నిరుపయోగాన్ని గ్రహించి పూర్తిగా ఆపెయ్యడం.ఎదటివాళ్ళు గ్రహించలేకపోతే, మొదటిపద్ధతి బొత్తిగా వేళాకోళంగా అయిపోతుంది. రెండోపద్ధతి స్పష్టంగా ఓటమి ఒప్పుకోడమే. ఎటూ తేల్చుకోలేక కాస్త ఏడుపు పొడిగించింది. ఆమె అదృష్టంకొద్దీ కళ్యాణి గదిలోనుంచి బయటికి వచ్చింది. చటుకున మంచం దిగి, ఆమెను కౌగిలించుకుని బారుమంది శాంతమ్మ. ఆ ఆవేశంలో తన నడుం నొప్పిసంగతి మరిచిపోయింది. అయినా మొత్తంమీద ఒక గడ్డుపరిస్థితిలోంచి ఆమె గట్టునపడింది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావు?" అంది కళ్యాణి, "ఏం కొంప మునిగిందని?"

"మునగలే?" అన్నాడు కామయ్య ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేస్తూ.

"ఆ పీనుగుని ఉప్పుపాత రెయ్యాలి," అంది రాధ.

"అబ్బే - అదికాదు. వా డెక్కడున్నా సరే, కాళ్ళూచేతులూ కట్టేసి తీసుకొచ్చి, కళ్యాణి మెడలో వాడిచేత తాళి కట్టించకపోతే-" అని ఇంకా ఏమో పెద్ద ప్రతిజ్ఞ చెయ్యబోయాడు కామన్న. కళ్యాణి ఆ ప్రతిజ్ఞను పూర్తి చెయ్యనివ్వలేదు.

"అక్కర్లే," అంది కల్యాణి నిదానంగా; "నీ బలవంతానికి లోబడి అతను నా మెడలో తాళి గట్టడాని కొప్పుకున్నా. నేనుమాత్రం కట్టించుకోను."

"అదేమిటే, వాడు చేసిన దారుణానికి మరి—"

"మరోదారుణం చేస్తే, మొదటి దారుణం రైటైపోతుందా? ఈ బలవంతపు పెళ్ళి చేసుకుని, అతనికి అక్కర్లేని పెళ్ళాంగా బతికినన్నాళ్ళూ బాధపడ్డం నా కిష్టంలేదు. అతని మెడలువంచి. నా మెడలో తాళంటే కట్టిస్తావుగాని, రాత్రీ పగలూ నా పక్కనుండి నన్నతను అంగుళం అంగుళం చొప్పున కోసుకుతినకుండా అడ్డుపడగలవా? నీ బలవంతం మూలంగా నా బతుకు నరకమైపోతుంది తప్ప. సుఖం ఎక్కణ్ణించి వొస్తుంది?"

నిజమే. సమస్యని ఈ దృష్టినించి ఇంతవరకూ చూడలేదు కామన్న. రాధకీ పరిస్థితిలోని భయంకరమైన సత్యం కళ్ళకు కట్టినట్టు కనబడింది. 'అభాగిని' నవలలో మోహన్ ఎంతబాగా అన్నాడు:

"స్త్రీ సుఖం, ఆనందం, పురుషుని దయాదాక్షిణ్యములపై నాధారపడియున్నవి. స్త్రీ భిక్షుకి - పురుషుడు దాత. ధనవంతుడు - పేదకు నిర్లక్ష్యంగా నయాపైస విసిరినట్టుగానే, పురుషుడు స్త్రీకి తన అమరాగ వేశాన్ని దానం చేయును. ఆ దానం స్త్రీని కృతజ్ఞతా సంకెలలందు బంధించి, ఆమెను పురుషునికి శాశ్వత బానిసగా చేయును."

అన్నాడు. ఈ మాటలకు లీలచెప్పిన సమాధానమే, రాధ పైకి చెప్పింది.

"ఆడది మగాళ్ళమీద ఎదురుతిరగాల్సిందే. తిరిగి మగాణ్ణి తన బానిసగా చేసుకుని కాలికింద పురుగులా రాసి పారెయ్యాలి."

ఉద్రేకంవల్ల రాధ ముఖం ఎర్రబడింది. కళ్ళు పెద్దవయ్యాయి. కల్యాణిమాత్రం అతి మెల్లగా తన నిర్ణయాన్ని అందరికీ తెలియజెప్పింది.

"అంచేత నే నింక పెళ్ళి చేసుకోను."

"నేనూను," అంది రాధ.

"ఏవిటే," అంది శాంతమ్మ తన చెవుల్ని తనే నమ్మలేనట్టుగా.

"అసలు వాళ్ళ జాతకాల్లోనే..." అనబోయాడు శంకరయ్య.

"మీరూ మీ జాతకాలూ" అని అరిచింది శాంతమ్మ.

"ఏదన్నా ఉద్యోగం చూసుకుని నా పొట్ట

నేను పోసుకుంటాను." అంది కల్యాణి. "ఈ రోజుల్లో ఆడపిల్లలకు ఏదో ఒక ఉద్యోగం దొరక్కపోదు."

"ఒక్క ఉద్యోగం చెప్పు. నీకు దొరికేది!" అని గద్దించింది శాంతమ్మ! "ఉద్యోగం చేస్తుందిట ఉద్యోగం. తనపొట్ట తను పోసుకుంటుందిట. మొగాళ్ళకే ఉద్యోగాలు దొరక్క తల్లకిందులై పోతుంటే ఈవిడగారికోసం కనిపెట్టుకొని ఉన్నాయి ఉద్యోగాలు. నీ కెవడిస్తాడే ఉదోగ్యం? చదువా సంధ్యా - అయినా సంసారుల ఇళ్ళల్లో ఆడపిల్లలు ఆఫీసులికి ఎగబడతారుటే, సిగ్గూ బిడియం వదిలేసి?"

"ఏ ఉద్యోగం దొరక్కపోతే ఎక్కడైనా వంటమనిషిగా చేరుతాను. అదన్నా చేతనవునుగా? ఈ మొగాళ్ళ దయా దాక్షిణ్యాలమీద ఆధారపడి బతకడం కన్నా ఏ ఆస్పత్రిలో నన్నా నర్సుగా చేరి—"

"ఏమిటే నర్సుగా చేరతావా? ఆ కిరస్తానీ ముండల్లాగ? ఏం కలికాల మొచ్చిందర్రా, నా బొందిలో ప్రాణముండగా అలాంటి అఘాయిత్యం చచ్చినా జరగనివ్వను."

తల్లి గద్దింపులు కల్యాణి లక్ష్యపెట్టకండా, తన మనసులో ఊహలన్నీ పైకే అనుకుంది.

"మొగాడు తన ఇష్టమొచ్చిన పని చెయ్యడం లేదూ? ఆడదిమట్టుకు ఎందుకు చేయకూడదు? పెళ్లొకటేనా ఏమిటి ఆడపిల్ల బతుక్కి పరమావధి?"

"కాదు. ఒక్కనాటికికాదు," అంది రాధ ఉద్రేకంగా. "అక్కయ్యా మనిద్దరికీ కొద్దోగొప్పో డాన్సు ఒచ్చు.

"డాన్సా!!" అని గర్జించింది శాంతమ్మ.

రాధ అది విననట్టుగానే తన ప్రణాళిక వివరించింది.

"మనం ఒక ట్రూప్ తయారుచేసి ఊరూరా ప్రదర్శనాలిస్తూపోతాం. మొగాళ్ళంతా అప్పుడు మన కాళ్ళచుట్టూ పురుగుల్లా తిరుగుతారు. వాళ్ళని వెర్రెక్కించి, నేలనిపెట్టి రాసేసి, కసి తీర్చుకుంటాం. ఇన్నాళ్లు మన్ని ఖైదులోపెట్టి ఉంచారుగా. ఇక మీద మనం వాళ్ళమీద దండయాత్ర సాగించి..."

రాధ స్వగతం అలా అనంతంగా సాగిపోయేదే. కామన్న పదేపదే నవ్వడంతో ఆమె ధోరణి ఆగిపోయింది.

ఏలా డాన్స చేస్తారే — పాటెవరు పాడతారు, మద్దెలెవరు వాయిస్తారు?"

"వాళ్ళ మొహం." అంది శాంతమ్మ: "డాన్సట. డాన్సు: సిగ్గు లేకపోతేసరి. చింతలపల్లి దివానుగారి మునిమనమరాళ్లు పదిమంది ఎదటా తగుదునమ్మా అని తైతక్కలాడితే, ఇక తల తీసికెళ్ళి ఎక్కడన్నా పెట్టుకోవాలి."

తల్లి వొద్దంది గనక కల్యాణి కేవలం ఆవిణ్ణి ఎదిరించడంకోసమే రాధని బలపరిచింది. నిజానికి ఈ ప్రణాళికలో కల్యాణికే నమ్మకంలేదు.

"తప్పేవుంది? మహామహా మంత్రిగారమ్మాయే డాన్సు చేస్తుండగాలేనిది. ఏనాడో చచ్చిపోయిన దివాన్‌గారి మునిమనమరాళ్లు చేస్తే వొచ్చిందా?"

"అన్నయ్యా" అంది రాధ. ఆమె కొక మంచి ఆలోచన తోచింది. "అన్నయ్యా! మన రామలింగంమామయ్యగార్ని సలహా అడిగారా?"

"ఏవిఁటే! ఆకులంలేని పీనుగింటికా!" అని గట్టిగా ఫీంకారం చేసింది శాంతమ్మ.

"ఏవిఁటల్లా నిలబడ్డావు? వెళ్ళరా... నువ్వు వెడతావా? నన్ను వెళ్ళమన్నావా?" అంది రాధ.

తల్లి వేపు బెదురుతూ చూశాడు కామన్న. మళ్ళీ రాధవంక చూశాడు. తను వెళ్ళకపోతే రాధే బయలుదేరుతుంది.

"వెడుతున్నా," అన్నాడు కామన్న.

"ఆఁ!" అంటూ పెద్దగా అరిచి మూర్ఛపోయింది శాంతమ్మ.

"అంతా వాళ్ళ జాతకాల్లో..." అంటూ తనకు తనే చెప్పుకున్నాడు శంకరయ్య. రాధా, కల్యాణీ - వివరాలు ఆలోచించడానికి తమ గదిలోకి వెళ్ళిపోయారు.

శాంతమ్మ చేసేదిలేక మూర్ఛలోనే మునిగిపోయింది. (సశేషం)



ఎవరు బాధ్యులు ★

ఖాసా సుశీల

ఇటు భారతంలోనూ, అటు పాకిస్తాన్‌లోనూ నేడు అత్యవసర పరిస్థితి ఏర్పడిందంటే ఎవరు బాధ్యులు? వర్తమాన భవిష్యత్తులను దృష్టిలో వుంచుకుని గతాన్ని స్మరించుకుంటే — వద్దెనిమిది సంవత్సరాలక్రితం హిందూ ముస్లిములతోగూడిన సమైక్య భారతావని విచ్ఛిన్నమైనదంటే, దానికి బాధ్యులు ఎవరు? స్వతంత్ర పోరాటంలో భుజంభుజం కలుపుకుని, భాయి భాయి అనుకున్న మహమ్మదీయ ప్రజ, జిన్నా ఆధ్వర్యాన, తీరా సమయం వచ్చేసరికి, అన్నం వడ్డించుకుని తీరా తినబోయే సమయాన ఏదో అవాంతరం వచ్చిపడ్డట్టు "మీతో మాకు పొత్తు కుదరదు. మిమ్మల్ని మేము నమ్మము. మాకు పాకిస్తాన్ కావాలి అని ఒంటికాలిమీద నిలిచిందికదా! గాంధీజీ జిన్నాతో సంప్రదింపులు జరిపారు. సలహాలిచ్చారు. బ్రతిమాలారు. చివరకు ప్రాధేయపడ్డారు! జిన్నా కొరకరానికొయ్య అయి కూర్చున్నాడు. కాంగ్రేసు చేయగలిగిందేమీ లేకపోయింది. భాగాల మీద తర్జన భర్జన జరిగింది. చివరకు ఒప్పుకున్నారు. భారత మాతను విభజించారు. పాకిస్తాన్ ఏర్పడింది! ఎలా?! హిందూ ముస్లిమ్ కలహాలు భీభత్సరూపం దాల్చాయి. నెత్తురు వరదలై పారింది. పాకిస్తాన్ తన భూమిలో హిందూ ప్రజను గాలించి, తరిమి వేసింది. పాకిస్తాన్‌లో వున్న ప్రజకు సగంపైగా ముస్లిం ప్రజ భారతదేశంలో మిగిలిపోయింది! చివరకు గాంధీ మార్గాన భారతావని సహనం వహించింది. పూజ్యబాపూజీ, తన ప్రాణాలను సైతం అర్పించేశాడు. కలహాలు సమసి కుదుట పడ్డామనుకున్నాము. గతాన్ని మరిచి పూలబాటలు వేసుకుందామనుకున్నాము. పొరుగు రాజ్యాలుగా స్నేహంగా వుందామనుకున్నాము. కానీ పాకిస్తాన్ నడవడిక దాని కనుగుణంగా వుందా? అడుగడుగునా అది తప్పటడుగులు వేస్తూనేవుంది! చిచ్చు రగిలిస్తూనేవుంది! కయ్యానికి కాలు దువ్వుతూనేవుంది! ఆరుకోట్లకు పైగా ముస్లింప్రజ వున్న ఈ భారతదేశం మీద పాకిస్తాన్ నిరంకుశ ప్రభుత్వము జరిపేదాడి హాస్యాస్పదంగానూ, దీర్ఘంగా ఆలోచిస్తే బహుశోచనీయంగానూ వుంది. పాకిస్తాన్ ప్రవర్తన ప్రపంచ శాంతికే భంగకారణం.

భారతదేశం మొదటినుంచి సహనము వహిస్తూనే వచ్చింది. రాయబారాలు జరిపింది. శాంతియుతంగా కలహాలు తీర్చుకోటానికి పథకాలు చూపింది. కక్షలు పెంచవద్దన్నది. అవన్నీ పెడచెవిని పెడితే తప్పెవరిది? సహనానికి మాత్రం హద్దులుండవద్దూ! అతిక్రమణలకూ, అఘాయిత్యాలకూ తల ఒగ్గుతూంటే పిరికితన మనరూ! కచ్ అతిక్రమణ జగద్విదితమే కదా! కచ్ సమస్యను శాంతి యుతంగా పరిష్కరించు కోవాలన్న భారతదేశపు వాంఛను అంగీకరించక తప్పదు కదా? కచ్ వేడి ఇంకా చల్లారనే లేదు. ఆగస్టు అయిదు నుంచి పాకిస్తాన్ కాశ్మీరులో జరుపుతున్న అక్రమ చర్యలు భరించరాని రూపాన్ని దాల్చాయి. సవాలుకు సవాలు నివ్వవలసివచ్చింది. భారత దేశం నడుం బిగించి పాకిస్తాన్ మీదికి పరిక్రమించింది.

ఈనాడు పిన్నా పెద్దా, ఆడా, మగా, అన్ని మతాలవారూ, స్త్రీ పురుష భేదం లేకుండా, వయోవృద్ధ తారతమ్యము లేకుండా, జాతిమతవిచక్షణ లేకుండా ఏకమై నిలవాలి. నిలుస్తారు కూడా! ప్రతివారి నోట్లోనూ ఈ మాటలే వింటున్నాము. చెవు లెప్పుడూ తాజావార్తల నందుకోటానికి తహతహ లాడుతున్నాయి. అక్షరజ్ఞానం లేని (అక్షరజ్ఞానం లేకుంటే ఏం? కావాలసినంత అనుభవజ్ఞానం వుందిగా) మా అమ్మమ్మకూడా ఏదో పెద్ద గొడవే జరుగుతూందని పసి గట్టింది. ఏమిటని విచారిస్తూంది. వార్తలకోసం తహతహా చూపుతూంది. తెలుగు వార్తలు వస్తూంటే, పూర్తిగా అర్థంగాకపోయినా వింటుంది. తరిచితరిచి ప్రశ్నలు వేస్తుంది. అయ్యో పాపం! ఇంత మంది చచ్చి పోతున్నారే. ఎట్లామరి అంటుంది. అయితే మరి యుద్ధం ఆపేద్దామా అంటే "ఆపేస్తే ఎలా. మళ్ళా విజృంభించరూ?" అంటుంది. మనలో ఒక చిన్న భూకలహాన్ని దృక్పథంలో వుంచుకుని యిప్పుడు వాళ్ళకు (పాకిస్తాన్ వాళ్ళకు) ఓ కొంత భూమి యిస్తే ఊరుకుంటారా ఏమిటి? ఇంకా కొంచెం కావాలనరూ? ఇది ఎప్పటికి తెగేది? అంటుంది. అయినా ప్రపంచంలో తీర్పు చెప్పటానికి ఎవరూ లేరా?" అని తన రక్తంలో సహజంగా జీర్ణించుకపోయిన అహింసా తత్వాన్ని అమాయకంగా వ్యక్త పరుస్తుంది!

ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. పాకిస్తాన్ యుద్ధాన్ని విరమించి యుద్ధవిరమణ రేఖకు ఆవల జరిగి, శాంతియుత సంప్రతింపులకు పూనుకుని ప్రమాణపూర్వకంగా వాటిమీద నిలబడటం జరిగితే, భారతమాత కూడా దానికి సంసిద్ధమే అను మాట కిదే తార్కాణం. యుద్ధమే సత్యమైతే, మాతృదేశ భక్తులైన అనంతకోటి ప్రజ వుంది, చౌధరిలాంటి సేనాధిపతులున్నారు. సత్య మున్నది. సత్యేమేవ జయతే! ★

మిహిరకులుడు

సీరియల్ నవల:

విశ్వనాథ సత్యనారాయణ

పన్నెండవ యధ్యాయము

ప్రకృతిర్హి దురత్యయా ఎంత కాదన్నను మిహిరకులునియొక్క క్రూరకార్యములు జరుగుచునేయున్నవి. ఇది అతని రాజ్యముయొక్క చివరిసంవత్సరము. అనగా లౌకికాబ్దము రెండువేల నాలుగువందల నలుబదిరెండవసంవత్సరము. క్రీస్తుపూర్వము ఆరువందల ముప్పదినాలుగవ సంవత్సరము. లౌకికాబ్ద మనగా ధర్మరాజు స్వర్గారోహణము చేసిన సంవత్సరము. దానినే కాశ్మీరాబ్ద మందురు. కాశ్మీరమున వందలు వదలిపెట్టి సంఖ్యలు చెప్పికొందురు. వారి లెక్కప్రకారము నలుబదిరెండవసంవత్సరము. ఏనుగుల మహావధ తరువాత పెద్ద ఘోరమైనది మరల జరుగలేదు. అప్పుడప్పుడు మ్లేచ్ఛులో ప్రాంతదేశీయులో ఎల్లలయందలి వారలో తలలెత్తుటయు ఇతఁడు తన సేనతో పోయి తలలు చితుకబొడుచుటయు, వారి నడుచుటలో కొంత తన క్రౌర్యము నెఱపుటయు జరుగుచునేయున్నది. అతని రాజ్యావసానకాలము వచ్చినది. దైవజ్ఞులు వాని రాజ్యకాలమున ఇది చివరి సంవత్సర మని డెబ్బదియేండ్లనుండి చెప్పుచునే వచ్చిరి. అతఁడు క్రూరకార్యములతో పాటు సత్కార్యములనుగూడ చేయుచునే యుండెను. గాంధారదేశ మతని మామగారి రాజ్యము. నీలాంకునితరువాత నచట గోవర్ధనుఁడు రాజయ్యెను. పుష్కలావతీనగరమున బావమఱది రాజ్యము చేయుచున్ననూ బావమరదికొడుకు రాజ్యము చేయుచున్ననూ సర్వాధికారములు మిహిరకులునివే. గోవర్ధనుఁడు రాజ్యమునకు వచ్చినతరువాత నెక్కువయధికారము కళ్యాణవతీదేవిదైనను గోవర్ధనుఁడు కొన్ని మహావ్యవహారములు సంప్రాపించినపుడు మేనత్తభర్తకే వార్త నంపును.

ఈ యేడాది గోవర్ధనునకు పెద్దపని వచ్చెను. గాంధారదేశమునందు చంద్రకుల్యానది ప్రవహించుచున్నది. అది యేఁటేట బ్రహ్మాండమైన వరదలు వచ్చి కొన్నిలక్షల యెకరముల పంట పాడుచేసి పోవుచుండును. అందుచేత నా ప్రాంత మంతయు నిత్యక్షామముగా నుండును. ఎచ్చటనైన నదులు పదియేండ్లకు, పండ్రెండేండ్లకు వఱదలు వచ్చును. ఆ యేడాది పైరులు నష్టమైనను పదేండ్లు ధాత్రి సమృద్ధిగా పండును. ఇచట నా పోడిమిలేదు. సర్వదా జననష్టము సర్వదా సస్యనష్టము. మానవజాతి మొండిజాతి. చచ్చినవారు చావఁగా మరల నచటనే యిల్లు కట్టుదురు. ఈ స్థితిలో గొందరు క్షేత్రపాలనా రాజ్యాంగవిషయికమంత్రులు చంద్రకుల్యానదిలోని నీరు కొంతవేరుగా మళ్లించి నచో నీయాపద తగ్గునని భావించిరి. నదీప్రవాహమును మఱలించుట యనఁగా దుష్కరమైన కార్యము. లక్షలాది జనులు పని చేయవలయును. పలుగులు, పారలు, తట్టలు లక్షలు కావలయును. ఇట్టికార్యము మిహిరకులునివంటి చండశాసనునికి సాధ్యముకాని తక్కినవారికి సాధ్యముకాదు. ఆ ప్రదేశములయందు జనులు సోమరులై యుందురు. వారిచేత పని చేయించుట చాల కష్టము. గోవర్ధనుఁడును వాని మంత్రులును వచ్చి మిహిరకులు నాశ్రయించిరి. అతఁడంగీకరించెను. కాశ్మీర గాంధారసైన్యములన్నియుమాత్రమేగాక లక్షలాది ప్రజలుకూడ ఈ మహాకార్యమునందు నియోగింపబడిరి. పని జరుగుచున్నది. మఱల వఱదలు రాకపూర్వము పని పూర్తికావలయును. ఈ లోపుగా వఱదలు వచ్చినచో జేసినపని యంతయు వ్యర్థమైపోవును క్రొత్తగాత్రవ్వుచున్న యేరు కొన్నిగజముల వెడల్పు చంద్రకుల్యాతటము వదలి త్రవ్వబడుచుండెను. వరదలు వచ్చినచో వదలిపెట్టిన సన్ననియొడ్డు దానికి లెక్కయేమి. అదియుగాక క్రొత్తగా త్రవ్వినకాల్వకూడ నదీజలములు పోసికొనుట కనువైననేల యగును. పూర్వపు లక్షలు కాక క్రొత్తగా లక్షలయెకరములు నాశనమగును. ఈ క్రొత్తయేరు రెండు నెలలలో నారుయోజనములు త్రవ్వబడెను. ఇంక నారుయోజనములు త్రవ్వినగాని యేటిప్రవాహ మొకదారిలోనికి పోదు.

అనడుమ నొక పెద్దయిక్కట్టు వచ్చెను. ఏటియొక్క కడుపు నేలయొక్క మెట్టపల్లముల ననుసరించి తద్జ్ఞులు ధాత్రిమీద రేఖలను చూచి నిర్ణయించిరి. అచ్చట నీరు మలుపు తిరగవలయును. అచ్చట నొక బ్రంహ్మాండమైన మహాశిల యడ్డుపడినది. ఆ శిలను తొలగించినగాని యేటి త్రవ్వకము సాగదు. ఆ శిల సరిగా నేటికి నడుమభాగమున నున్నది. యెంతయో త్రవ్విరి. వేలకొలఁది జనులు మహాదీర్ఘములు మహాబలిష్ఠములైన గునపములతో లేవనెత్తుటకు నెడములేని ప్రయత్నములు చేసిరి. శిల కదలలేదు. మట్టమునందు బలములేదు. మట్టము కనిపించుచునేయున్నది. పలుచోట్ల నిట్టిశిలలను గునపములతో లేవనెత్తుట జరిగినది. ఈ శిల కదలుట లేదు. ఈ ప్రయత్నమున పదిదినముల పని వృథా

యైనది. వరదలు వచ్చు కాలమునుబట్టి చూచినచో పదిదినములు మహాకాలము. కార్యనాశనహేతువైన కాలము. రాజులు మంత్రులు మహాధికారులు వచ్చిచూతురు. శిల కదలదు. మిహిరకులున కేమిచేయుటకును తోచలేదు. మిథ్యాప్రజ్ఞానదేవత కనిపించుటలేదు. కళ్యాణవతీసౌధములు కాశ్మీరమున నున్నవి. అతఁడు పదియేన్గులను దగినదండు నిచ్చి యీ కార్యమును చెప్పి కళ్యాణవతీదేవిని వెంటనే తీసికొని రమ్మని వార్త నంపెను. ఆమె మరునాటికే వచ్చెను. ఆమెకొఱకు నచట పెద్దగుడారములు వేయించిరి. ఆమె యందులో విడిసెను. మిహిరకులుఁ డారాత్రి యామె గుడారమున నొకగదిలో నిదురపోయెను. మిథ్యాప్రజ్ఞానదేవత కనుపించెను.

మి. కు: అయ్యా ఇది నా రాజ్యకాలము యొక్క చివరియేడాది. నే నీ మహాకార్యమును పూనితిని. ఆ శిల కదలుట లేదు. ప్రజోపకారముకొఱకు నే నీ మహాకార్య మారంభించితిని.

దేవత: ప్రజాసంహారమునకు ప్రజోపకారమునకు నేమిసంబంధము?

రాజు: ప్రజ యున్నకదా సంహారము జరుగవలయును. ప్రజయే లేనిచో నెవరిని సంహరింపవలెను? అడవిజంతువులను పెరగనీయవలయును. అపుడు వానిలో కొన్నింటిని సంహరింపవలయును. దాని పేరు వేట. వేట, వేరు. సంహారము వేరు.

దేవత: నిజమే. ఆ శిలను మహాపతివ్రతయైన స్త్రీ చేతితో స్పృశించినచో నది కదులును. దాని కింకొకమార్గము లేదు. అంతటితో దేవత మరుగుపడెను.

మరునాడు మిహిరకులుఁడు జంజాటములో పడెను. తన భార్య యున్నది. ఆమె మహాపతివ్రత యని తా ననుకొనును. అది సర్వజనవిదితమైన విషయము. ఆమెతో చెప్పవలయును. ఆమె యేమనునో. రాచతీవులు విలక్షణములుగా నుండును. ఇది విశిష్టమైన కార్యమైనను సేవకులును పని చేయువాండ్రును చేయవలసినపని. రాణి యంగీకరింపనిచో నేమి కావలయును? మిహిరకులుఁ డామెతో చెప్పలేదు. మంత్రులు నధికారులు ప్రజలు కోట్లకొలఁది కలరు. దగ్గరగా దూరముగా బహుగ్రామములు కలవు. పట్టణములు కలవు. సృష్టిలో పురుషు లెంతమంది యుందురో స్త్రీ లంతమంది యుందురు. ఈవార్త సర్వవ్యాప్తమైనది. పెద్ద యధికారులు చిన్నయధికారులు బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు అరువదినాలుగుకులములవారు సేనాపతులు సైనికులు అందరును తమ భార్యలను తీసికొనివచ్చి యీ శిలను స్పృశింపవలెనని రాజాజ్ఞ యైనది. ఇది ప్రజోపయోగకరమైన కార్యము, స్త్రీలు వందలు వేలు లక్షలు కోట్లు వచ్చుచుండిరి. ఇది యొక విడ్డూర మయ్యెను. ఒక వినోద మయ్యెను. ఒక ఉత్సాహ మయ్యెను. ఒక యాశ్చర్య మయ్యెను. రథములమీద బండ్లమీద గుఱ్ఱములమీద కాలినడకను దూరదూరములయందలి పురుషులు మూల మూలలయందలి పురుషులు తమ భార్యలను తీసికొనివచ్చుచుండిరి. ఇందులో నొక యాశయు కలదు. ఏ స్త్రీ తాకినచో నా శిల కదలునో ఆ స్త్రీకి మిహిరకులుఁడు పదివేలదీనారము లిచ్చును. ఎంతమంది స్త్రీపురుషులు వచ్చినను వారచట నున్నన్నినాళ్ళు వారికి భోజనవసతు లేర్పాటు చేయబడును. అంతేకాదు; వచ్చిన ప్రతిస్త్రీ శిల కదలక పోయినను వందదీనారము లీయబడును. జను లెగబడి తమ భార్యలను తీసికొనివచ్చిరి. కోడండ్రను తీసికొనివచ్చిరి. కూతుండ్రను తీసికొని వచ్చిరి. నాలుగుదినములు గడచెను. వచ్చిన స్త్రీలు రెండుకోట్లమందిపైన నుండిరి. తమతమ వందవంద దీనారములు తమ కొచ్చినచో వారు పోదు మనిరి. మిహిరకులునకు నిముసనిముసమునకు పదిపదిరెట్లుగా కోప మభివృద్ధి చెందుచుండెను. రెండవదినము ప్రొద్దుగ్రుంకు వేళకు నా కోపము వింధ్యపర్వతమంత యెత్తు పెరిగెను. మూడవనాటిసాయంకాలమునకు హిమవత్పర్వతమంత యెత్తయ్యెను. నాల్గవనాడు ప్రొద్దుగ్రుంకువేళకు భారతదేశమందలి సర్వపర్వతములు నొకదానిపైని నొకదాని నుంచినచో నెంత యెత్తగునో యంతయెత్తయ్యెను. గాంధార కాశ్మీర కటకోత్తర జ్యోతిష దరద సింహపురీ ప్రముఖ సర్వరాష్ట్రములయందలి స్త్రీలందరు వచ్చిరి రాయి కదలలేదు. జనులలో నొక వదంతి బయలుదేరెను. చంద్రమతి దమయంతి సీత సావిత్రి మొదలైన మహాపతివ్రతలందరు రాజభార్యలు. కళ్యాణవతీదేవి మహాపతివ్రత. ఆమె వచ్చి తాకినచో శిల కదలును. మిహిరకులుడు తన భార్యవద్దకు పోయెను. కాని యీ సంగతి చెప్పలేకపోయెను. వృద్ధుఁడైన పురోహితునిచేత చెప్పించెను. ఆమె యిట్లనెను— "గాంధార కాశ్మీరదేశములయందలి సర్వరాజస్త్రీలు వచ్చితాకినతరువాత శిల కదలనిచో నపుడు తాను స్పృశింతు" ననెను. వేలకొలఁది రాజకుటుంబాలస్త్రీలు వచ్చిరి. స్పృశించిరి. శిల కదలలేదు. మరల కళ్యాణవతి నడిగిరి. ఆమె యిట్లనెను: "పాతివ్రత్య మనగా నేమి? పాతివ్రత్యము బహువిధములుగా నుండును. సీత అనసూయా అరుంధతీ చంద్రమతీ దమయంతీ ప్రముఖ మహాపతివ్రతలవంటి శీలము కలవారు సర్వదేశములయందు సర్వకాలములయందు నుందురు. సీత పిలిచినంత భూదేవి తాను వచ్చెను. చంద్రమతి యాజ్ఞాప్రకారము వహ్నిదేవుఁ డుపశమించెను. ఇది పాతివ్రత్యమహిమ యని నేనను. ఇది వారి యుపాసనాబలము. వారు తపస్వినులు. వా రేదో మంత్రమును నుపాసించిరి. వారికి సిద్ధి కలిగెను. ఆ సిద్ధివలన కలిగిన శక్తి పాతివ్రత్యమునం దారోపితమై వా రట్టిపనులు చేయుటకు సాధ్యమైనది. పతివ్రతయై యుపాసకురాలైన స్త్రీ తన



యుపాసనా సిద్ధిని పాతివ్రత్యమునం దర్పించి యిట్టి కార్యకరణమునకు సమర్థురాలగును. అయినను వచ్చి తాకుదును. నేనుపాసకురాలను కాను. కాని నా కొడుకును కోడలును నావద్ద నుండవలయును."

బకుఁడును బకునిభార్యయు వచ్చిరి. కళ్యాణవతీదేవి శిలను స్పృశింపబోవుచున్నదనగా రాజకుటుంబములయందలి సర్వస్త్రీలును వచ్చి శిలను స్పృశించిరి.

కళ్యాణవతీదేవి చెప్పినమాటలు మిహిరకులుఁడు వినలేదు. అతఁడు తన గుడారమునం దుండెను. ఒక కుమ్మరావమువలె ఇటికల యావమును సందు సందుల పోసిన యుముకచేత కట్టెపుల్లలచేత లోనలోన మండుచు పైన పూసినమంటిచేత సన్నని మట్టిబెత్తలలోని పగుళ్ళలోనుండి వెలికి వచ్చెడి సన్నవి పొగచేతమాత్రమే యనుమీయమాన మగుచున్నట్లు మిహిరకులుని కోపము కనుపించుచుండెను.

ఇట్లుండఁగా కాశ్మీరరాజకుల మంతము వచ్చెను. అందరును వచ్చినతరువాత కళ్యాణవతీదేవి కొడుకును మేనల్లుని పిలచెను. వారిద్దరును వచ్చిరి. వారు ముప్వురు నేకాంతముగా గూరుచుండిరి.

కళ్యాణవతి: "మహారాజుయొక్క ప్రకృతి మీకును దెలియును. యేవేళ యెట్టిదో తెలియదు. స్త్రీపురుషులైదారుకోట్లమంది యిచ్చట నుండిరి. మీ రిద్దరు మిహిరకులుని భక్తులు. భక్తులనగా వతని కెదురుతిరుగరు జ్యేష్ఠావమానము చెయ్యరు; కాని మీ ప్రాణములు మీరు రక్షించుకొన వలయును. మీ కుటుంబములను మీరు రక్షించుకొనవలయును. గాంధారరాజ్య మహాసేనాపతి నిష్కరుణుఁడు. అది వాని పేరని పొరపడకుడు. మహామంత్రి ఖంకుఁడు. వానిని తలతన్నినవాఁడు. నిష్కరుణుఁ డెంతచెప్పినచో సైన్య మంత చేయును. అంతవిశ్వాసము గల సైన్యము మీ కున్నదా?

బకుడు: తల్లీ! నీ వనెడు మాటలు నా కర్థమగుటలేదు. కాని నా సైన్యము నాకున్నది.

గోవర్ధ: నా సైన్యము నాకును కలదు.

కళ్యా: సరే. మీ సైన్యములు నిష్కరుణుని సైన్యముతో యుద్ధము చేయనక్కఱలేదు. మహారాజునాజ్ఞ మీ సైన్యములు పాలింపవు. మీ సైన్యములు దూరముగా నిలుచుండును. అవసరము కలిగినచో మహారాజ సైన్యమును మీ సైన్యము లెదిరించును, అన్న భావము విస్పష్టముగా నుండవలెను. నాకు సైన్యమున్నది. నా తమ్ముడు నీలాంకుడు గాంధారమునందలి యుత్తరప్రదేశము నా కిచ్చెను. కడచిన యిరువదియేండ్లుగా నా రాజ్యము నా క్రిందనే యున్నది. నా సేనలు నా యదుపులో నున్నవి. మూడు సేనలును కలుపుదము. మనము రాజద్రోహము చేయము. మన యాత్మరక్షణమును మనము చేసికొందుము. ఇది మన సమయము. పొరపాటు పడకుడు.

కళ్యాణవతీదేవి, తన కోడలు, తన తమ్మునికోడలు మరికొందరు తన దగ్గరి చుట్టములలోని స్త్రీలు శిలాస్పర్శజోలికి పోనిచో తాను శిలను తాకుదునని చెప్పెను. ఈ వార్త మిహిరకులున కందింపబడెను. అతఁడు నివ్వెరపోయెను. ఈ వార్త వినినంతనే యతనికి తన మనస్సులో రూపుకట్టని యొక భావమునకు రూపకల్పన జరుగుచున్నట్లనిపించెను. అతఁ డంగీకరించెను. కళ్యాణవతి ప్రజలతో విస్పష్టముగా నిట్లు చెప్పెను. ఆ మహాశిల నేను తాకినను కదలదు. మీ రాశలు పెట్టుకొనవద్దు. మహారాజుయొక్క కోరికను తీర్చుటకుమాత్రమే నేను పోవుచున్నాను. ఇట్లు చెప్పుచు నామె శిలాసన్నిధానమునకు పోయెను. మిహిరకులుఁ డచటలేదు. ఆయన చూచుచుండగనే తాను శిలను స్పృశింపవలెనని యామె యనెను. మిహిరకులుఁడు వచ్చెను. అచట నున్న యున్నతాసనముపై నధివసించెను. కళ్యాణవతి పోయి శిలను తాకెను. అది కదలలేదు. యెవ్వ రేమి చేయుదురు. అందరును దిగ్భ్రాంతి నొందిరి. కోట్లకొలఁది సమావిష్టలైన స్త్రీలకు నూపిరాడినది. వారి భర్తలకు ధైర్యము కలిగినది. అంతటి మహారాణియే మహాపతివ్రత యని ప్రసిద్ధిబొందిన స్త్రీయే కానప్పుడు మనమా అని సర్వకాంతాజనము తమ్ము తా మోదార్చుకొనిరి. కళ్యాణవతీదేవితో రాజు సంసారము చేయుచున్నాడు. మనము మన భార్యలతో సంసారము చేయుట తప్పుగాదు, అని సర్వపురుషులును తమలో దాము తమాయించుకొనిరి. నాలైదు దినములుగా రెండుకోట్లసంఖ్యకు మించిన పురుషులు డోలాయమాన మనస్కులై యుండి యితరులైన సర్వపురుషుల భార్యలు నిట్టివారేకదా. మన యొక్కరిమొగమునవే ప్రొద్దుపొడువలేదుకదా యన్న తెచ్చికొన్న ధైర్యముతో నున్నవారు. నేడు కాశ్మీరదేశ మహారాజ్ఞి, యే మహాదేవియొక్క పాతివ్రత్యము సర్వజనులచేత కొనియాడబడుచున్నదో ఆమె యెట్టిదో తమ భార్యలు నట్టివారే యన్న సంతృప్తి నందిరి. కళ్యాణవతి తాకగా శిల కదలలేదు. మిహిరకుఁడును శిలాకృతియై కదలలేదు. అప్పుడు కల్యాణవతి మిహిరకులునివద్దకు పోయి యిట్లనెను. "నేనుభర్తృపాదములయందు నమస్కరించుచున్నాను. ఇంతమాత్రముచేత నేను పతివ్రతను కాకపోలేదు. రెండుకోట్లమందిస్త్రీలు కులటలుకారు. లక్షలాదిపురుషులు తండ్రులనుబోలి జన్మింతురు. ఆ స్త్రీలు పతివ్రతలు కారా? భర్తలయొక్క సర్వమూర్తులును ముఖలక్షణములును స్త్రీలయొక్క హృదయములయందు ముద్రితములు కానిచో కొడుకులు తండ్రులను బోలి పుట్టుదురా? మొగముల మాట యట్లుంచి సృష్టిలో వందమంది కొడుకులలో తొంబది తొమ్మండుగురైనను నడకలలో మాటలలో గుణములలో నిష్టానిష్టములలో తండ్రుల గుణములు కలవారే యుందురు. తల్లులు పతివ్రతలు కానిచో నిట్లు పొసగదు. ఇది

వ్యష్టిలక్షణము. ఇది ఆర్షమైన సంప్రదాయము. లేనిచో మానవుడు చేసెడి కర్మలు యథాపూర్వముగ సాగవు. ఇది యట్లుంచి మహారాజునకు నే నొకటి మనవి చేయుచున్నాను. ఇప్పటికప్పుడే పదునేను పదారు దినములు వ్యర్థమైనవి. ఏటిని త్రవ్వట ఈ రాతిదగ్గర నాపివేయబడినది. ఈ రాయి వదలిపెట్టి క్రిందినుండి యేటిని త్రవ్వవలయును. వరదలు వచ్చులోపల నెడారివలకు కాలువ సిద్ధము కావలయును. ఏస్త్రీ వచ్చి తాకినచో నీరాయి కదలునో ఆస్త్రీ. అట్లు వ్రాసియున్నచో, నీలోపుగా వచ్చును. ఈ ప్రతిబంధకముగూడ తీరిపోవును. ఏరు త్రవ్వుట పూర్తియైనతరువాత నప్పటికికూడ నాస్త్రీ కనుపించనిచో నీ రాతికి రెండుపైపుల పైన నది చీలి క్రింద కలిసికొనునట్లు గుండ్రముగా త్రవ్వించవచ్చును. ఈ వెనుకటి త్రవ్వబడిన యోజనములలోని మన్ను రెండువైపుల కట్టగా పోయబడినది. అట్లే దిగువను కూడ కట్ట లేర్పడును. ఈసారి వరదలేమియు చేయలేవు. నేను సెలవు తీసికొని నా గుడారమునకు నేను పోదును." అని యామె వెడలిపోయెను.

మరునాటినుండి మిహిరకులుని మౌనమర్థాంగీకారముగా శిలక్రింది యేరు త్రవ్వ నారంభింపబడెను. ఈసారి త్రవ్వకము కల్యాణవతియొక్క యుపదేశమువలన తొల్లిటికంటె శీఘ్రముగా సాగుచుండెను. ఈసారి యిచటనే మొదలుపెట్టి త్రవ్వి కొంచుబోవుటలేదు. యోజనము నాలుగు భాగములు. యెనిమిదినాళ్ళలు ముప్పదిరెండు భాగములు. ఒక్కొక్కభాగమునందు రెండు మూడులక్షలమంది పనిచేయుచుండిరి. క్రొత్తగా కావలసిన సాధనములు తెప్పింపబడెను. నెలయు పదునేను నిరువది దినములలో నేటియొక్క త్రవ్వకము చివరిదాక పూర్తి యయ్యెను. కొంతమేలు బకుడు, కొంతమేలు గోవర్ధనుడు కొంతమేలు కళ్యాణవతి మరియు గల్యాణవతీ విశ్వాసపాత్రులైన కొందఱుమంత్రులును కొందఱు సేనాధిపతులును వీరి ముప్వురుతో కలిసి ముప్పది రెండుమంది తత్తత్ప్రదేశములయందు పర్యవేక్షకులుగా నుండగా నీ దినమున కింత పని జరుగవలయునని నిర్ణయింపబడి యా పని యే యల్పాధికారికి నియమింపబడునో వాడానాటిసాయంకాలమున కాపనిని చేయింపలేనిచో వాని వేతనమునందు నిరుగకోయుటయు; పనివాండ్రయొక్క యాహారములు సరిగా లేనిచో వారు పనిచేయలేరు. భోజనసామాగ్రి కోశాధికారులు దినవెచ్చము లిచ్చునధికారులు, దినవేతనము నిచ్చు నధికారులు వారివారి ధర్మములు వారు సరిగా పాలించుచున్నారో లేదో చూచుటకు బైన పర్యవేక్షకులపై బర్యవేక్షకులు కల్యాణవతియొక్క విశ్వాసపాత్రులును. వారికి విశ్వాసపాత్రులును నైనవారు గూఢచారులుగా లంచముగాని సోమరిపోతుదనముగాని కవిపించినచోట నక్కడనక్కడనే కఠినములైన శిక్షలు నెఱపుచూ నీ మహాకార్యము కళ్యాణవతిచేత మహాసమర్థతతో నిర్వహింపబడెను. ప్రజ లాశ్చర్యపోయిరి. డెబ్బదియేండ్లు వ్యర్థమైనవి. కళ్యాణవతీదేవియే రాజకార్యములను నిర్వహించినచో దేశ మెంత భద్రముగా నుండెడిది. రాజ్యపాలన మెంత ప్రజాసుఖదాయిగా నుండెడిది యనుకొనిరి. ఇంక మహాశిలకు రెండువైపుల నేటిపాయలు త్రవ్వక తప్పదన్న సమయము వచ్చెను. ఈ నలుబదియైదు నలుబదియారు దినములుగా మంత్రులు రాజాధికారులు మిహిరకులునివద్దకు వత్తురు. ఇంచుమించుగా రెండుకోట్లమంది స్త్రీ లిచట నుండిరి. వారు వారివారి యూళ్ళకు పోదు మనుచుండిరి. తొలుత వందదీనారము లిచ్చినచో పోదుమనిరి. తరువాత తరువాత మాకు దీనారములక్కఱలేదు; మమ్ము పోనిమ్మనిరి. మిహిరకులునియొక్క యనుమతి రాలేదు. మొదట విసుగుదల తరువాత భయము, ధనము నందలి యాసచేత జనులందఱు తమ భార్యలను తరలించికొని వచ్చిరి. ప్రతి పురుషునకును కొంతధనాశ, తన భార్య పతివ్రత యగునో కాదో తేల్చికొందమన్న కోరిక. ప్రతిస్త్రీకిని ధనాశతోపాటు మొత్తముమీద తాను పరపురుషాభిషంగము చేయలేదుగనుక తాను పతివ్రతనే యన్న భావముతోపాటు తన భర్త కధికవిశ్వాసము కలిగించవచ్చునన్న యభిలాష, పరపురుషసంగమము చేసిన స్త్రీలుకూడ దక్కినవారుకూడ దమవంటివారే యన్నధైర్యము. ఆడది ముట్టుకొన్నచో రాళ్ళు కదలునా. ఈ మిహిరకులుడు విచిత్రమైనరాజు. అతడు చేసెడి పనులన్నియు నిట్లే యుండును. ఏదైనా నాపద వచ్చినచో తన కొక్కర్తుకకే రాదు. పదిమందితోడి చావు చావుకాదు. పరిపరివిధములుగా భావించుచు స్త్రీలు వచ్చిరి. వందదీనారములు కావుకదా, మొదటియక్షరము వదలిపెట్టగానైన నారగూడలేదు. వారికిని పోనుపోను భయము వేసినది. కోట్లమందికి భోజనసదుపాయములుకూడ క్రమక్రమముగా తగ్గినవి. ఈ జనము కొన్ని చదరపు వందల మైళ్లాక్రమించిరి. గలీజు, దుర్వాసన-కాలు పెట్టుటకు వీలులేదు. వ్యాధులు పుట్టినవి. కొందఱు దొంగతనముగా పారిపోవలయు ననుకొనిరి. రహస్యమైన రాజాజ్ఞ చేత నిష్కరుణుని సైనికులు లక్షలమంది యెవ్వరిని పోనిచ్చుటలేదు. పతివ్రత యెవ్వరో తేలినతరువాతగాని పోవుటకు వీలులేదట.

ఇట్లుండగా కొన్నివేలమంది తప్పించుకొని పోయినవా రున్నారు. అట్లు పోవుటలో కొన్నివేలమంది సంహరింపబడినవారున్నారు. మహాశిలకు రెండు వైపుల త్రవ్వుట యారంభింపబడినది. అప్పుడు మిహిరకులునికడకు నొకస్త్రీ తీసుకొని రాబడెను. సర్వాధికారు లామెతో వచ్చిరి. మిహిరకులుడే కాక బక, గోవర్ధన, కల్యాణవతీ తద్విశ్వాసపాత్రులుగూడ వచ్చిరి. పెద్దసభ జరిగెను. ఆమె, నామె వెనుక నామెభర్తయు నిద్దరు వచ్చిరి. వారి వర్ణము రజకవర్ణము. మగడు చాకలి; ఆమె చాకిత. మగడు వణకిపోవుచుండెను. ఆమె ధైర్యముగా నుండెను.

చంద్రావతి: మహారాజా! మేము చాకలి వాండ్రము. నాపేరు చంద్రావతి. ప్రభువులు త్రవ్వించెడి కాలువవలన దేశమంతయు సుభిక్ష మగును. జనులకు కడుపునిండ నన్నము దొరకును. మా బ్రతుకు బ్రతుకంతయు కడముట్ట కడచినను వందదీనారములు మేము ప్రోవు చేసికొనలేము. వెళ్ళద మని నేను, వలదని మా యాయన నాలుగు నెలలు కయ్యము లాడితిమి. నాకు వందదీనారము లక్కఱలేదు. నీ వున్నచో చాలునని నా మగడు. క్రొత్తగా నాడవాండ్రెవ్వరు వచ్చుటలేదు. మా యూరిలో వనేకాదు. దారిపొడుగున మున్న నన్ని యూళ్ళలో స్త్రీలే లేరు. ముసలి వాండ్రు, వివాహముకాని బాలురు, బాలికలుగా నన్నియూళ్ళ మిగిలెను. మా యూరిలో నే నొక్కతెనే మిగిలితిని. నా పోరు పడలేక నా మగఁడు నన్ను తెచ్చెను: అ పెద్దబండను ప్రభువులు నన్ను తాకనిచ్చినచో తాకుదును.

అనఁగా మిహిరకులుఁడు కొంతసేపు తల వాంచి చివరకు తల యెత్తెను.

మిహిర: ఓసి నీవు చాకలిదానవు. ఉత్తమ కులముల స్త్రీ లిచ్చట కోటిమంది యున్నారు. నా భార్య యున్నది. వీరందరు కాని పతివ్రతవు నీ వగుదువా.

చంద్రావతి: దొరా!! నేను పతివ్రతనని చెప్పుటకు రాలేదు. ఒకవేళ నేను తాకినచో బండ కదులునేమో! దొరలకు బరువు తగ్గును. జనానికి మేలు కలుగునని వచ్చితిని.

అంతట మిహిరకులుఁడు దీర్ఘముగా నాలోచించెను. చివరి కిట్లనెను.

మిహిర: నీవును తాకుదువు బండ కదలదు. నీకు శిక్ష యేమి విధింపుమందువు.

చంద్రా: నా మెడ నఱకుడు.

దానిమగడు: దొరా అది చనిపోయినచో నేను బ్రతకను. మా యిద్దరిమెడలు నొక్కసారి నరికించినచో దీనికి నే నొప్పుకొందును.

మిహిరకులుఁ డిద్దరిమెడల నఱకుట కంగీకరించెను. త్రవ్వుట యాపివేయబడెను. ఇదివఱకే రాతిచుట్టు పెద్దగోయి యేర్పడియుండెను. అటునిటు త్రవ్వబడి రెండువైపుల పెద్దకట్టలుగా పోయబడిన దిబ్బలమీద నటు యోజనము నిటు యోజనము స్త్రీ లెక్కి చూచుచుండిరి. కనపడినంత కనపడును. ఆ కట్టలమీద పెద్దపెద్ద రాళ్లెక్కించి వానిమీద నిలచి కొందరు చూచుచుండిరి. చంద్రావతి శిలవద్దకు వచ్చెను. తాకుదు ననెను. మిహిరకులుఁ డిట్లనెను. ఇన్నాళ్ళయినది; ఆ బండ దాని యంతట నది కదులునేమో!"

వేయిభటులు వచ్చి రాతిని కదలింపబోయిరి. సాధ్యముకాలేదు. అపుడు చంద్రావతిని తాకుమనిరి. ఆమె స్నానము చేసి వచ్చెను. తల తుడిచికొని. జడ ముడివేసికొని. తలలో పూవులు పెట్టికొని, మొగము నిండ విభూతి పూసికొని. కమతుదల విభూతి రేఖలు తీర్చి. కాటుక పెట్టుకొని, మెడలో రుద్రాక్షలు, చేతులకు రుద్రాక్షలు ధరించి వచ్చెను. మగనికాళ్ళకు దండము పెట్టెను. వచ్చి బండను తాకెను. బండ కదలలేదు. బండను రెండుచేతు లానించి త్రోసెను. చూచెడిజనమునకు బండ కదలినట్లు తోచలేదు. ఆమె "బండ కదలినది." అనెను. ఎవ్వరును నమ్మలేదు మిహిరకులుఁడు వికావిక నవ్వెను. "ఓసి వంచకురాల! నీ తల నఱకింతును," అని యఱచెను. జనములో పెద్ద యల్లరి బయలుదేరెను. ఆమె మిహిరకులునివద్దకు పోయి యిట్లనెను. "దొరా! అంతబండ నెవరైన దొర్లింతురా! వేయిమందికి సాధ్యముకానిది నాకు సాధ్యమగునా! బండ కదిలినదని నాకు తెలియును. దానిక్రింద నొక పట్టున్నది. ఆ పట్టు తొలగినది. బండ కదలినదని నాకు తెలియును. పట్టూడినదని నాకు తెలియును. తమరు పోయి కదిలించుడు. పట్టూడినదని తమరికి కూడ తెలియును. ఇప్పు డెవరు పోయి దానిని త్రోసినను పట్టూడినసంగతి వారికి తెలియును; ఒక్క రెవ్వరు దానిని త్రోయలేరు. పాతికముప్పదిమంది త్రోసినచో నది బాగుగా కదులును. అప్పుడు గునపములతో దొర్లించవలయును;" అనగా వినుచున్న యందరు నిజమే యనుకొనిరి. మిహిరకులుఁడు పోయి బండను త్రోసెను. అతనికి బండ పట్టు తప్పిన దన్నట్లు తోచెను. తరువాత బక, గోవర్ధన, నిష్కరుణ, ఖంక ప్రభృతులైనరాజులు రాజాధికారులు మంత్రులు వచ్చి కదలించిరి ప్రతివారికిని బండ పట్టు తప్పినదని తెలిసెను. అప్పుడు పాతిక ముప్పదిమంది భటులు వచ్చి త్రోసిరి. బండ కదలుట నందఱును చూచిరి. గునపములతో వందలమంది వచ్చిరి. రాతిని దొర్లించిరి గుంటలోనుండి పైకెత్తిరి. ఏటియొద్దు గియబడిన గీతవెలుపలికి దొరలించిరి. ఆ జనముయొక్క కోలాహలము వారి యఱపులు వారి త్రొక్కిళ్ళు వారి యుత్సాహము వారి యానందము పట్టపగ్గములు లేకుండెను. వారిలోవారు చేసికొను వ్యాఖ్యానములకు మొదలుతుదలు లేవు. ఈ నిరంతర బహువ్యాఖ్యాన మహాసముద్రమునకు పైభాగమున నొక డిండీరరేఖ మాటిమాటికి తోచుచుండెను. ఇంతమంది వచ్చి బండ పట్టు తప్పినదన్న విషయమును చూచిరి. కల్యాణవతీదేవి యొక్కతెయే చూడలేదు. ఈవార్త ఆ డిండీరరేఖ.

చంద్రావతి వలనో యని మొత్తుకొనుచుండగా నామె కనేకములు గౌరవములు జరిపిరి. రాజభోజనములు. నడుగులకు మడుగులొత్తుటలు. నీపూట నీ సేనానాయకుని యింట, నాపూట నా మహామంత్రి యింట, మరియొక్కపూట మహారాజ గృహమున, నొకచోటినుండి మరియొకచోటికి బోవుటయనఁగా నది మిక్కిలి సమీపమైననుసరే పల్యంకికమీద నుత్తమాశ్వములమీద నంబారి కట్టిన యేనుగులమీద దీసికొనిపోవుచుండిరి చంద్రావతియొక్క యింత భోగములో నామె భర్త పాల్గొనలేదు. ఆమె పోయిన

చోటికల్ల నతఁడు కాలినడకనే పోవుచుండెను. ఆమెభర్తయని వీనినిరానిత్తురు. ఆమెకు నీరాజనము లిత్తురు. రాజస్త్రీలు ధరించు నుడుపులు కానుక లిత్తురు. ఆమె ఎన్నడును చూచియెరుఁగని భూషణములు చదివింతురు. ఈ వచ్చిన సంభార మంతయు నేమిచేయవలయునో యామెకు తెలియదు. వానిని తెచ్చెడివారులేరు. తొలుత వీరికి చిన్నకుటీర మీయబడెను. ఆమెకు వచ్చిన ధనకనకవసనాదులు పడి కుటీరములు పట్టనన్ని యున్నవి. ఇన్ని యిచ్చినవారు గుఱ్ఱములను గజములనుకూడ నిచ్చినచో వాని మీద నివి మోయించుకొనిపోవచ్చును. అందుచేత నెవరిచ్చిన కానుకలు వారియింటనే యున్నవి. మేము పోవునపుడు తీసికొనిపోదుమని యామె వారితో చెప్పెను. వారు వెడలిపోవలయునవఁగా మిహిరకులుని యాజ్ఞ కావలయును. చంద్రావతికి రాజదర్శన మగుటలేదు. ఎవ్వరును కానిచ్చుటలేదు. ఈమెకు తీరికలేదు. తెలవారక ముందే బలవంతముగా దూరదూరములకు తీసికొనిపోదురు. ఆమెను దేవతవలె బూజింతురు. బిడ్డలురేనివారు తమకు బిడ్డలను ప్రసాదింపుమని యడుగుదురు. ఆమెకు బ్రతుకు దుర్భర మయ్యెను. భార్యాభర్తలిద్దరు నా మహాఘోరమైన స్థితినుండి తప్పింకొనిపోవుట ఎటులా యని విచారింప నారంభించిరి. ఒకనాడు మిహిరకులుఁడు రాజసభ చేసెను. ఆమెకు పదివేల దీనారములిచ్చెను. రెండేనుగులు నాలుగుగుఱ్ఱముల నిచ్చెను. పల్లకి నొకదాని నిచ్చెను. వంద మంది సైనికుల నామెవెంట బంపెను. అప్పటికి వాన కురిసి వెలిసినట్లయ్యెను. ఆమె వెంట వారి యూరిప్రజలు పోదుమనిరి. రాజు పురుషులను బంపెను. యెవరి వందదీనారములను వారి కిచ్చెను. వారిలో చాలమంది వెడలిపోయిరి. వారి భార్యలను రాజు తరువాత పంపించును. లక్షలాది స్త్రీ లున్నారు. ఏమగుదు రన్న ధైర్యముతో, నింటిదగ్గిర నెవ్వరు దిక్కులేరు, గొడ్డుగోద యేమైనదో యన్న యాత్రముతో వెడలిపోయిరి. తరువాత రాజు పురుషు లెచ్చోటివారైననుసరే, భార్యలను వదలిపెట్టిపోయినచో వారి దీనారములను వారి కిత్తుననెను. రెండుకోట్ల పురుషులలో నరువదిడెబ్బదివేలమంది పురుషులు తక్క దక్కినవారందరు ముందు చేతిలో వందదీనారములు పడుచున్నవని ధనమును స్వీకరించి వెడలిపోయిరి. ఈ దీనారము లిచ్చుట, పురుషులు వెడలిపోవుట నెలదినములు పట్టెను. తక్కినవారు భార్యలను వదలిపోలేదు.

ఏటిని మలయించు ప్రయత్నము సర్వము పూర్తియైనది. ఈయేటిమొగమువ చంద్రకుల్యలోనీరు దీనిలోనికి మరలుట కడ్డముగానున్న యేబదిగజముల వెడల్పున కట్టకూడ త్రవ్వివేయబడెను. జలము క్రొత్త యేటిలోనికి ప్రవహింప నారంభించెను. ఆ నీరు ప్రవహించుచుండగా దానివెంట లక్షలాదిస్త్రీలు వేలాదిపురుషులు నీటివెంట బయనింపసాగిరి. తడిసిన నేల, నీరు బుసబుసలాడిన నేల, అరికాళ్ళు తడిసెడి నీరు, నీలమండలదాక వచ్చిన నీరు పిక్కలవఱకు వచ్చిన లోతు, మోకాటివఱకు వచ్చిన జలము, బట్టలు పై కెగబట్టుకొని నడువవలసిన చోట్లు, నడచుచుండగా వెనుకనుండి వచ్చిన జలము తాడింపఁగా తడిసిన గుడ్డలు, నీటితో కొట్టుకొనివచ్చెడి చేపలు నత్తగుల్లలు వానితో నాడుకొనుటలు, మోకాటి లోతు నీళ్ళలో పండుకొని స్నానము చేయుటలు, నొకరిమీద నొకరు నీళ్ళు చల్లుకొనుటలు ప్రధానముగా రెండుకోట్లమందిస్త్రీలు పదునారు యోజనముల యీ క్రొత్తయేటి వెంట నెప్పటికప్పుడు చిత్రచిత్రములుగా క్రీడలాడుచు బయనించుచుండిరి. పలు మందిస్త్రీలయొక్క యూళ్ళు క్రొత్తయేటి కటోయిటో దాపుననో దవ్వుననో యుండుట చేత క్రీడావిలాసమునకు గ్రీడావిలాసము, తమ యూళ్ళకు తరలిపోవుటకు దరలిపోవుటగాఁ బయనించుచుండిరి. పదిదినములైనతరువాత నొకనాటిప్రొద్దున హఠాత్తుగా నీటి రెండువైపుల సేనలు వచ్చి నిలుచుండెను. నదీజలముల జలకేళులు సవరించు స్త్రీలకు వా రెందుకు నిలుచుండిరో తెలియలేదు. కలుకట్టలమీద గజసేనలు వాని వెనుక నశ్వసేనలు లోపల పదాతులు ఒడ్డునకు వచ్చిన ప్రతిస్త్రీని రాజసైనికులు రెండామడలపొడుగున నఱికివేయుచుండిరి. క్రొత్తయేరు మొదలుపెట్టినచోటునుండి మహాశిల యడ్డమువచ్చినచోటువఱకు వధ యెక్కువలేదు. మహారాజులు వారి సైన్యములను చంద్రావతి కదపిన బందవద్ద నుండిరి. ఎగువనీరు బందవద్దకు వచ్చును గదా యని పెక్కుమంది యిందే యుండిరి. అధికోత్సాహము కలవారే యెగువకు పోయిరి. వారిసంఖ్య తక్కువ. ఎగువదిగువల రెంటియందు వధ యొక్కసారియే ప్రారంభింపబడెను పురుషులను సంహరించుటలేదు. సైనికులు ప్రతిస్త్రీని వధించునపుడెల్ల నేదోయొకమాట యందురు. కులటపాంసుల రంకులాడి బొంకులాడి జారిణి భర్తృద్రోహిని అపవిత్రురాలు. ఈ మాటలు మొదలైన వానిలో నేదోయొక మాట యనుటయు, చావు మనుటయు, వధించుటయు. కొందఱిని కత్తులతో బొడుతురు, కొందఱిని మెడలు నరుకుదురు. పారిపోవువారి వెనుక మండి బల్లెములను విసరుదురు. భయపడి నీటిలోనుండి రాని స్త్రీలను కొందఱు సైనికులు నీటిలోనికి దిగి సంహరింతురు. కొందఱుపురుషు లెదిరింతురు. వారుకూడ చత్తురు. స్త్రీలు తిట్టుచుందురు. ఇట్లుండగా మిహిరకులుఁడును బంకుఁడును మహాజవనాశ్వములమీద నది కొకవైపునను విష్కరుఁడింకొకయొద్దునను వధ జరుగుచున్నంతమేర నటునిటు చూచుచున్నారు. ప్రొద్దుగ్రుంకువేళకు రెండు కోట్లమంది స్త్రీలలో మిగిలినవా రెందరో తెలియదు. చంపుటకు సాధ్యముకానిస్త్రీలను, బల్లెములు తగులక తప్పించుకొని పోయినస్త్రీలను సైనికులు మళ్ళవేసిరి. ఆనాటి ప్రొద్దుననే స్త్రీలందరు బయలుదేరినపుడు మస్తీగా మండి

కొందరు, రేపు చూడవచ్చునులే యని కొందరు ఏరు మలుపుతిరిగిన బండవద్ద నున్న విడిదులలో మిగిలిపోయిరి. వారును, మళ్ళ వేసికొని రాబడినవారును దెబ్బదియెనుబదివేల మందిస్త్రీలై రి. వారిలో నెవ్వరును తప్పించుకొనిపోవుటకు వీలులేదు. మరునా డేమగునో తెలియదు. ఆరాత్రియన్న కాలమున కెంత సిగ్గులేదో తెలియదు. నాల్గుజాములును కడచినవి. అంతకంటె సిగ్గులేనివాడు సూర్యుడు. అతఁడు తూర్పున పొడిచెను.

రాజు సభ తీర్చెను. అందరు నుండిరి. కాశ్మీర గాంధారరాజు లిద్దరు నుండిరి. బకుఁడున్నాడు. కళ్యాణవతి యున్నది. మంత్రులు సేనాధిపతులు నున్నారు. అది వట్టి బంగరు బయలు. ఎనుబదివేలమందిస్త్రీలును సమావేశపరుపబడిరి. బలవంతముగా నెట్టికొని రాబడిరి. కొంద రేడ్చుచున్నారు. కొందఱు తలలు వంచికొనియున్నారు. కొందఱు నేలమీద పడిపోయినారు. కొంద రున్మత్తలై తిరుగుచున్నారు. మిగిలినపురుషులు నిర్జీవులవలె నిస్సహాయులై చూచుచున్నారు. మిహిరకులుఁ డిట్లనెను. "మీ రందరు కులటలు. ప్రపంచ మంతయు దుష్టస్త్రీలతో నిండిపోయినది. వర్ణసంకర మైపోయినది. కలి రెండువేలయేండ్లు కడచినది. తండ్రికి పుట్టిన కొడుకైనచో తండ్రి విశ్వాసములు కలిగియుండును. మ్లేచ్ఛు లనగా నెవరు? భారతధర్మము నుండి చెడిపోయిన వారు. పురుషు లెందుకు చెడిపోదురు. ఈ దేశమునందలి పురుషులు భారతీయధర్మము నెందు కవలంబించలేదు. వా రెందుకు మ్లేచ్ఛులై రి. స్త్రీలు దుష్ట లగుటచే కలిగెడి సంతానము దుష్ట లగుదురు. అందుచేత మ్లేచ్ఛు లగుదురు. మి మ్మందరను వధించుచున్నాను. మీకు జరిగినశిక్షను తెలిసికొని భవిష్యత్కాలమునందలి స్త్రీలు పతివ్రత లగుదురు గాక" అనగనే సైనికులు వెనుకనుండి స్త్రీవధ ప్రారంభించిరి. చూచుటకుగాని వినుటకుగాని దుర్భరముగా నుండెను. రెండు మూడుగడియలలో లక్షలాదిస్త్రీలు సంహరింపబడుచుండిరి. రాజుయొక్క ప్రకృతి వంటి ప్రకృతికలవారు మౌన మవలంబించిరి. రాజన్నచో భయపడినవారు మొగములు కందగడ్డలై నిలుచున్నవారు నిలుచుండలేకపోయిరి. కూర్చున్నవారు కూర్చుండలేకపోయిరి. నిర్భయులు రాజు నెదిరించుటకు లేచిరి. నిష్కరుణుని సైనికులు లేచినవారిని లేచినట్లు సంహరించుచుండిరి. బకుని కంటివెంట నేకధారగా నీరు కారుచుండెను. గోవర్ధనుడు "నీ. నేను రాజు నేమిటి" యనుకొనుచుండెను.

ఇంత సేపును కళ్యాణవతీదేవి మనసులో భార్యాధర్మముతో పెనగులాడుచుండెను. ఆమె సభకు వచ్చుచునే సకవచయై వచ్చెను. ఖడ్గమును డాలును పరిచారకులచేత దెప్పించెను. శిరస్త్రాణముకూడ వచ్చెను. ఆమె హఠాత్తుగా లేచినిలుచుండి కత్తిని డాలును చేబూని కవచముపై నున్న చీరను తీసివేసి బకుని బిలచి శిరస్త్రాణమును తనవెంట గొనిరమ్మని యాజ్ఞాపించి తను రాజసభా వేదికనుండి క్రిందికి దూకి సైనికులనడుమగా బోజొచ్చెను. మిహిరకులుఁడు చూచుచుండెను. ఆమె నడ్డగించు డని యనలేదు. పోవుచున్న యామె నాపుటకు భటులకు గుండె నిలువలేదు. ఆమె వెలికి బోయెను. తన సేనాపతులను పిలచెను. తన సేనలను లోనికి బంపించి యీ వధను వెంటనే యాపింపుమని చెప్పెను. ఆమె మరల లోనికి వచ్చెను. యిట్లు బిగ్గరగా నఱచెను. "ఏ సైనికు డింకొక స్త్రీని వధించునో, ఇదిగో నా ఖడ్గమునకు వాని శిరమును బలిచేయుదును." ఆమె కంఠధ్వని వినిపించినంత మేఱ నిష్కరుణుని సైనికులు నిశ్చేష్టులై నిలుచుండిరి. మిహిరకులుడు నిష్కరుణుని వంక జూచెను. నిష్కరుణుడు కళ్యాణవతి దేవి ముందరికి వచ్చి నిలుచుండి యిట్లనెను. "మహారాజ్ఞీ? ఇది మహారాజుగారి యాజ్ఞ.

కళ్యాణ: ఇది మహారాజ్ఞిగారి యాజ్ఞ.

నిష్కరుణుఁడు: నేను రాజు నమ్మినబంటును. నా బొందిలో ప్రాణ మున్నంత వరకు నేను రాజాజ్ఞ చేయుదును.

కళ్యాణ: ఓయీ! ముందు నేను రాజుతో మాట్లాడవలయును. తరువాత నీతో మాట్లాడెదను."

అనుచునే యామె తన ఖడ్గముతో విచిత్రకేళి నెఱపి నిష్కరుణుని చేతిలోని ఖడ్గమును లాగికొనెను. వాని కవచమును ఛేదించెను. అంతటి వీరుడైన నిష్కరుణుఁడు తెల్లబోయి నిలుచుండెను. అంతట రాణి యిట్లనెను. "ఓయీ! నీవు రాజు నమ్మినబంటువు. నిన్ను వధించుట రాజద్రోహము. నేను రాజద్రోహమును చేయను. నీరాజు నాకును రాజే. పైగా నతఁడు నా భర్త" అని రాజుదెస మరలి యిట్లనెను. "మహారాజా! యిన్నిలక్షలమంది స్త్రీలును కులటలు జారిణులు అపతివ్రతలు – సాక్ష్యమేమి? వారు తాకగా బండ కదలలేదు. అదేకారణముచేత నేనును కులటను. నేనును జారిణిని. నేనును అపతివ్రతను. ఇంటిలోని కులటను వధించక దేశములోని కులటల వధింతురా? యిది యన్యాయము. ముందు నన్ను వధింపుడు."

రాజు తల యెత్తలేదు. రాజబంధువులు రాజాధికారులు రాజకుటుంబస్త్రీలు నెల్లరును దిగ్భ్రాంతి బొందియుండిరి. కళ్యాణవతీదేవి మరల నిట్లనెను: "మహారాజా! ముందు నన్ను వధింపుము. విన్ననే క్రొత్తయేటి వెంట నెనిమిదియామడలమేర నించుమించుగా రెండుకోట్ల స్త్రీలు వధింపబడ్డారని విన్నాను. నేను నమ్మలేదు. నేడు ప్రత్యక్షముగా చూచితిని. నేను భార్యను. మీరు భర్తలు. సహజమైన మానవధర్మముచేత విశిష్టమైన భారతీయధర్మముచేత భర్త యెటువంటివాడై నను భార్య యెదిరించరాదు. నేను ని న్నెదిరించలేదు. ధర్మము నుపదేశించుచున్నాను. పరమేశ్వరుఁడైన శ్రీరామచంద్రునకే కొన్ని సమయములయందు పతివ్రతాలోకమునకు తలకట్టయిన సీతాదేవి హితమును చెప్పినట్లున్నది. ఇపుడు నేను చేసెడిది అధర్మముకాదు. పూర్వము మీరు

చాల యధర్మములు చేసితిరి. నేను నోరెత్తలేదు. ఏమగులను సంహరించుటయే పూర్వకార్యముల కన్నింటికి గోపురము పెట్టుట యనుకొంటిని. ఇది దానికి మించి పోయినది. ఇన్నికోట్లమంది స్త్రీలు సహించి పోగా దేశ మేమికావలయును. మరల పాతికముప్పదియేండ్లవఱకు దేశమునందు పసిపిల్ల లుండరు. పెరిగెడివాం డ్రుండరు. ఉద్యోగు లుండరు. ఈ నది ప్రవహింప చేసితిరి. ఈ ప్రవాహము వృథా. దానిక్రింద పండించెడివాడు లేడు. వఱదలు వచ్చినచో జనము చచ్చిపోదురని కదా యీ యేటి మలయింపు. చచ్చిపోయెడివారు లేనపుడు నదిని మలయించు టెందులకు. రేపటినుండి స్త్రీలు లేరు. మిగిలినస్త్రీలయొక్క ప్రాణములకు నా ప్రాణము వెలకట్టుచున్నాను నన్ను వధింపుడు. నన్ను వధించిన తరువాత మిగిలినస్త్రీలనైన వారియిండ్లకు వారిని పోవిత్తు నన్నచో నేను నా ప్రాణముల మీ కర్పింతును. లేనిచో నాకు సైన్యము లున్నవి. నా కొడుకునకు సైన్యము లున్నవి. నా మేనల్లునకు సైన్యము లున్నవి. ఈ మూడు సైన్యములను ప్రోగుచేసితిని. అదుగో చూడుడు. నా సైనికులచేత విష్కరుణుని సైనికులు స్తంభితులై నిలుచున్నారు. నేను విష్కరుణుని వధించుట నాకు గోటిమీదపని. నా సైన్యముతో వాని సైన్యము చెల్లాచెదురు చేయుట నాకు తృణప్రాయమైన విషయము. కొన్నిలక్షలమంది స్త్రీలు బ్రతికియున్నారు. వెంటనే వారిని పంపివేయుము. తరువాత నన్ను వధింపుము. నేను ని న్నెదిరించను. నీసైన్యములకు నా సైన్యము లెదురుచేర్చను. వెంటనే వారిని బంపవలయును.

రాజు సింహాసనమునుండి లేచెను. తన గుడారమునకు బోయెను. వార్తలు కనుగొనెను. సర్వము కళ్యాణవతి చెప్పినట్లుండెను.

నాలుదినములలో మిగిలిన యేబదిలక్షల మంది స్త్రీలు వారివారి యూళ్ళకు బంపబడిరి. వారికి వందవంద దీనారము లీయ లీయబడినవి. అందరును వెడలిపోయిన తరువాత కొండమలువుప్రదేశము రాజు, రాజబంధు, రాజాధికార సేనలు కాక నెవ్వరు లేనిరోజున రాజు మరల సభ చేర్చెను. ఆనాటి విచిత్ర మేమనగా, రాజవేదిక కెదురుగా నొక యున్నతమైన యయోవేదిక యేర్పడియుండెను. దానిపైన బల్లెపుకొనలును ఖడ్గములును గ్రుచ్చబడియుండెను. దానిక్రింద బ్రహ్మాండమైన యగ్నిజ్వాలలతో మండుచున్న పదికొలుము లుండెను. ఆ యగ్నిజ్వాల లినుపబల్లను మ్రింగుచుండెను. కొంతసేపటికి నా వితర్దికయు నా ఖడ్గములును బల్లెపుకొనలును పండగాలి దగ్గరకు పోయి చూడగలిగినచో సూర్యమండల మిట్లుండు ననిపించుచుండెను. ఆ వేడిమి తగిలి సభలో నిలువలేకుండిరి. ఇట్లుండగా మిహిరకులుఁడు కళ్యాణవతికి వార్త బెట్టెను. అందరును రాజామెను పండగాలిన యీ యినుపమేకులమీది కురికించు ననుకొనిరి. ఆమె సకవచశిరస్త్రాణయై ఖడ్గపాణియై డాలుతో వచ్చెను. శిరస్త్రాణముమ తీసి చంక నిడికొని "రాజాజ్ఞ యేమి" అని యడిగెను.

రాజు : రాణియొక్క యాజ్ఞ యేమి ?

రాణి : ఖంకుడు మంత్రిపదవినుండి పోవలయును. విష్కరుణునకు సేనాధిపత్యము తీసివేయవలయును.

మిహిరకులుఁడు వారిద్దరను పిలచి వారి రాజాధికారముద్రల నక్కడ పెట్టించెను. వారధోవదనులై సేవకులవలె చేతులు కట్టుకొని దూరముగా నిలుచుండిరి. రాణి మరల ననెను. "ఈ రెండుద్యోగములు బేతాళభట్టునకు, విజయరాజునకు నీయవలయును."

రాజు వారిద్దరకు నా యుద్యోగము లిచ్చెను. రాజాధికారముద్రలు వారికి సమర్పించెను.

రాణి : మహారాజా ! నేను మహాగ్ని వితర్దికపై దూకుదునా ?


రాజు : అది నీకొఱకుకాదు.

రాణి : నే నిప్పు డేమి చేయవలయును ?

రాజు మాటాడకుండి బకుని బిలచి తాను దిగి, బకుని సింహాసనమునందు గూర్చుండబెట్టి, పూర్వమే సిద్ధముచేసియుంచిన యభిషేకజలమును సమంత్రకముగా పురోహితులచేత నభిషేకము చేయించెను. అపుడు మిహిరకులుఁడు కళ్యాణవతీదేవితో విట్లనెను: "నేను నీతో యుద్ధము చేయలేను. నాకీ సంగతి యిరువదియేండ్లక్రింద తెలియును. విష్కరుణుని నీచేత చంపించను. వానికి నీవే యుపకారము చేసితివి. అన్నిలక్షల మంది స్త్రీల ప్రాణము నీలో నున్నది. నీమాటమీద వారిని వదలితిని.

వెంటనే రాణి తన కవచమును తీసివేసికొని కత్తిపెట్టి గుండెలలో పొడుచుకొనెను. దీనివలన పుట్టిన హాహాకారములు నిముసములో నటు మరలినవి. సర్వజనులు యిటు చూచుచుండగా మిహిరకులు డటు పోయి యా పండగాలిన ఖడ్గముల బల్లెముల యినుపబల్లమీదికి దూకెను. ఇటు పులి చంపిన తల్లిలేడి, అటు తెలియక వెనుకకు దూకి యెండిన వంశనాళమున దిగబడిన పులి, నడుమ నున్న దుప్పిపిల్లవలె బకుడు.

సమాప్తము



పాకిస్థాన పిశాచమా!

శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి

మా కాశ్మీరపవిత్రధాత్రిఁ గబళింపం బూని యన్యాయపున్
సాకుల్ చూపుచు రోజురోజునకు దౌర్జన్యమ్ము మిన్ముట్ట నే
లా కయ్యానికిఁ గాలు దువ్వెదవు ? నీ ప్రాణాలు చేఁదయ్యెనే!
పాకిస్థానపిశాచమా ! యిఁక నహంభావంబు చాలింపుమా!

ఏకమ్మై భరతావనీప్రజలు ని న్నీనాఁడు గెంటంగ దీ
ఱా కౌతూహలు లైరి మాతృధరణీసంరక్షకుల్ యుద్ధవి
ద్యాకౌశల్యమునన్ సుశిక్షితులు సైన్యంబందు మా సోదరుల్
పాకిస్థానపిశాచమా ! యిఁక నహంభావంబు చాలింపుమా !

నీ కంచెన్ బదియాకు లెక్కువగు చైనీయుల్ దురాశామదో
ద్రేకుల్ నేఁడు ప్రగల్భముల్ పలికి రుద్రేకంబునన్, మొన్న "సు
శ్లోకంబైన హిమాద్రి"పైఁ గదిసి భీరుత్వమ్మునన్ మళ్లరే!
పాకిస్థానపిశాచమా! యిఁక నహంభావంబు చాలింపుమా!

ఆకాంక్షింపము మాది కాని దొక రవ్వంతైన భూభాగమున్
జేకొందా మని; శాంతిమార్గమె జగచ్ఛ్రేయస్కరంబంచు నెం
తో కాలంబుగ విశ్వసించితిమి; మాతో యుద్ధసంరంభమా!
పాకిస్థానపిశాచమా! యిఁక నహంభావంబు చాలింపుమా !

మాకై ప్రాణములన్ ద్యజించుటకు నేమాత్రమ్ము వెన్కాడ క
స్తోకస్థైర్యపరాక్రమాఽఢ్యులయి యెందున్ సాటి లేకుండగా
లోకుల్ మెచ్చెడు సైనికుల్ గలరు నీ రోగంబు మాన్పింపఁగా
పాకిస్థానపిశాచమా యిఁక నహంభావంబు చాలింపుమా!

సాహస గాథలు

1965 ఆగస్టు 5 వరోజు మన చరిత్రలో ఒక మలుపుగా జ్ఞప్తి యందు ఉంటుంది. దురాక్రమణకు నాందిగా పాకిస్తాన్ యీరోజున 7000 మందికి పైగా దుండగులను కాశ్మీరులోకి పంపింది. భారత దేశానికి వ్యతిరేకంగా కాశ్మీరు ప్రజలు విప్లవాన్ని లేవతీసే విధంగా యీ దుండగులు వారిని ప్రోత్సాహపరిచి తద్వారా పాకిస్తాన్ సైన్యం అడుగుపెట్టి సునాయాసంగా కాశ్మీరును కబళించడానికి మార్గం ఏర్పరుస్తారని పాకిస్తాన్ భావించింది. కాని విధి మరో విధంగా చేసింది. గత 18 సంవత్సరాలుగా భారతదేశంలో భాగంగా ఉండి పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఫలాలను అనుభవించిన కాశ్మీరు ప్రజలు పాకిస్తాన్ చేతిలో కీలుబొమ్మలు కావడానికి సిద్ధపడలేదు. పాకిస్తాన్ కబంధ హస్తాలలో చిక్కితే తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోవడమే గాక ధన, ప్రాణాలకు కూడ తిలోదకాలు ఇవ్వాల్సివస్తుందని కాశ్మీరు ప్రజలకు బాగా తెలుసు. కాశ్మీరులోని తమ మతావలంబకులైన సహోదరులకు విముక్తి కలిగిస్తామనే పాకిస్తాన్ మోసపు మాటలలోని ఆంతర్యం కాశ్మీరు ప్రజలకు తెలుసు. యుద్ధవిరమణ రేఖ ఆవలి ఆక్రమిత కాశ్మీరులోని ప్రజలు పాకిస్తాన్ బానిసలుగా ఏవిధంగా జీవిస్తున్నారనే సత్యమే పాకిస్తాన్ కపట నాటకం వారికి తెలియజేసింది. పాకిస్తాన్ దేశంలోనే అక్కడి ప్రజలు నియంత కాలిక్రింద నలిగిపోతూ ఎన్నో కష్టాలను అనుభవిస్తున్నారు. అందువల్ల అక్రమంగా ప్రవేశించిన దుండగుల జాడను వెంటనే రక్షణదళాలకు వారు తెలియజేశారు. అప్పటినుండి భారత, పాకిస్తాన్ దేశాల మధ్య భీకర సంఘర్షణ ప్రారంభమైనది. పాశ్చాత్య కూటమి దేశాలవారు పాకిస్తాన్‌కు ఉదారంగా అందజేసిన అపారమైన టాంకులు, ఆయుధాలు, బాంబర్లతో మన సైనికులు, వైమానికులు పోరాడవలసి వచ్చింది. అతి క్లిష్టమైన ఎన్నో అడ్డంకులు ఎదుర్కోవాల్సి వచ్చినప్పటికీ మన దళాలు, అన్ని రంగాలలోను వీరోచితంగా పోరాడి, శత్రుప్రాంతాలలోకి యుద్ధాన్ని మళ్ళింపజేశారు. ఈ పోరాటంలో మన జవానులు నిర్వహించిన ఎన్నో సాహస కృత్యాలు ప్రపంచ సైనిక చరిత్రలోనే శ్లాఘనీయమైనవి. వాస్తవంగా వారి వీర గాథలు సువర్ణ అక్షరాలతో లిఖింపదగినవి. ఎదురు దాడులు జరిపిన వారి సాహసచర్యలలో దురదృష్టవంతులైన కొందరు మన సైనికులు తమ ప్రాణాలను సహితం త్యాగం చెయ్యాల్సి వచ్చింది. తమ వీరగాథలను స్వయంగా వినిపించడానికి కొందరు సజీవంగా ఉన్నారు. వారి పరాక్రమ గాథలను భవిష్యత్ చరిత్రకారులు ప్రస్తావిస్తారనడంలో ఎట్టి సందేహం లేదు. కాని మనం యీ సంఘటనలను తిలకించిన సమకాలీన సాక్షులము. చదువరుల హృదయాలను ఉప్పొంగింపజేసే వ్యక్తిగత సాహస గాథలు గ్రంథస్థం కావలసినవి. ఈ ఉద్దేశంతోనే మన రక్షణదళాల వీరోచితగాథలను లభ్యమైనప్పుడల్లా యీ శీర్షిక క్రింద ప్రకటించాలని నిశ్చయించాము:

---

1. 1965 ఆగస్టు 4వ తేదీన ఒక సామాన్య కాశ్మీరీ గ్రామవాసి మహమ్మద్దీన్ పొలంలో పశువుల్ని మేపుకొంటున్నాడు. అనేకమంది పాకిస్తాన్ దుండగీండ్రు కాశ్మీరు లోయలోకి రావడం చూశాడు. గుల్‌మార్గ్ బస్సుస్టేండుకు మార్గం చెప్తే అతనికి రూ. 400లు లంచం యిస్తామని ఆశపెట్టారు. అందుకతను నిరాకరించగా వారు అతన్ని ధన్‌వాస్ వద్దగల కారడవిలోకి లాక్కుపోయారు. అక్కడ 800 పైగా పాకిస్తానీ దుండగులు కనిపించారు వారివద్ద పెద్ద ఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి, అంతేకాక వైర్‌లెస్‌సెట్లు వున్నాయి. ఆ తర్వాత వారు అతన్ని తాన్‌మర్గ్‌కు తీసుకుపోయి తమకు 10 రూపాయల సిగరెట్లు కొనుక్కురమ్మన్నారు. అయితే మహమ్మద్‌దిన్ మాత్రం దేశభక్తిగలవ్యక్తి. దేశానికి రానున్న ప్రమాదాన్ని అతను అర్థం చేసుకున్నాడు. నేరుగా ఈ అవకాశాన్ని అతను వినియోగించదలుచుకున్నాడు. వెంటనే అబ్దుల్లా కటానా అన్న పోలీసు కానిస్టేబులు దగ్గరకు వెళ్ళి ఈ విషయమంతా సవిస్తరంగా తెలియజేశాడు. ఆ పోలీసు ఆ విషయాన్ని అధికారులకు తెలియ చేశాడు. వెంటనే టాన్‌మార్గ్‌కు సైన్యం తరలింపబడింది. సైన్యాన్ని చూడగానే దురాక్రమణదారులు తుపాకుల్నీ, మందుగుండు సామగ్రినీ ఎక్కడివక్కడ వదిలేసి పలాయన మంత్రం పఠించారు. మహమ్మద్‌దిన్, పోలీసు కానిస్టేబులు అబ్దుల్లా కటానా శ్రీనగర్, కాశ్మీరులను నిజంగా రక్షించారని కాశ్మీరు ముఖ్యమంత్రి శ్రీ సాదిక్ బహిరంగంగా ప్రకటించారు.

2. పాకిస్తానులోని సర్గోడా వైమానిక స్థావరంలోని అమెరికా నిర్మించే రాడారు సంకేత యంత్రాంగం మీద బాంబులు కురిపించాలని ఒక ఐ. ఏ. ఎఫ్. స్క్వాడ్రన్ ప్రయత్నిస్తోంది. ఎన్నిసార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఆస్క్వాడ్రన్‌లో ఒక పైలట్ తన

బృందంనుంచి చీలిపోయి ప్రాణాలకు తెగించి రాడారు సంకేతాల యంత్రాంగం మీదకు తిన్నగా తన విమానాన్ని పోనిచ్చి ఢీకొన్నాడు. ఆ పరికరాలు ఛిన్నాభిన్నమై పనికి రాకుండా పోయాయి. ఆ వైమానికుడు వీరస్వర్గ మలంకరించాడు.

3. శత్రుభూభాగంమీద విమానంలో విహరిస్తుండగా ఆ విమాన చోదకుడు శ్రీ గుర్బక్స్‌సింగ్ శత్రువుల కాల్పులకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అయినా ఎలాగో ఒకలాగున భారతదేశంలోని తన స్థావరానికి విమానాన్ని తీసుకొచ్చాడు. విమానాన్ని నిలిపి, నేలమీద కాలు పెట్టి అలాగే కుప్పలా కూలిపోయి ప్రాణాలు విడిచాడు.

4. జవాన్ మొహీందర్‌సింగ్ దారాబాబా నానక్ రంగంలో టాంకుల భారీ యుద్ధంలో పాల్గొంటున్నాడు. అకస్మాత్తుగా తనవైపు ఓ పెద్ద పాటన్ టాంకు నిప్పులు కురిపిస్తూ రావడం చూశాడు. మరుక్షణంలో అతను తన వాహనం దిగి, ఆ టాంకు వెనక్కు పోయి సాహసంతో ఆ టాంకు మీదకు ఎగిరి దానిపైన వుండే కన్నంలోకి ఒక చేతిబాంబును పడేశాడు. వెంటనే ఆ టాంకు దగ్ధమైపోయింది. అందులోని శత్రువు తుత్తినియలైపోయాడు. మొహీందర్‌సింగ్ చెయ్యిమాత్రం కాలిపోయింది. అయినా మొహీందర్, ఆ టాంకునుంచి జ్వాలలు రేగి ఆ జ్వాలల్లో అది దగ్ధమైపోతుంటే సంతోషంతో గంతులువేశాడు. ఇప్పు డాయన ఆసుపత్రిలో గాయాలనుండి త్వరత్వరగా కోలుకుంటున్నాడు.

5. ఒక సాహసవంతుడైన భారతీయ అధికారి మరో నలుగురు ధైర్యవంతుల సహాయంతో సెప్టెంబరు 6వ తేదీన శత్రువుతో టాంకుల సమరం సాగిస్తున్నాడు. ఈ చిన్న బృందాన్ని నాలుగు శత్రుటాంకులు ఎదుర్కొన్నాయి. ఆ అధికారి వైర్‌లెస్‌వార్త ద్వారా భారతీయ ఆర్టిలరీ దళాన్ని రప్పించాడు. మూడు టాంకులు నాశనం చేయబడ్డాయి. నాలుగోదానిని వశం చేసుకున్నారు. అంతలో అకస్మాత్తుగా 40-50మంది పాకిస్తానీ సైనికులు యీ చిన్న బృందాన్ని ఎదుర్కొన్నారు. తన టాంకుల తుపాకులు పనిచేయడం లేదని ఆ భారతీయ అధికారి తెలుసుకున్నాడు అతని జీపు మెషిన్‌గన్ కాల్పులకు గురైంది. అప్పు డా అధికారి ఎంతోసాహసంతో, ధైర్యంతో తనవారితో అనువైన స్థలం చూసుకుని శత్రువుపై కాల్పులు జరిపారు. అవతలనుంచి పెద్దసైన్యం తమని ఎదుర్కొంటున్నదేమోనని ముందుకు చొచ్చుకొస్తున్న ఆ పాకిస్తాను సైనికులు ఆగిపోయి అక్కడనుండే కాల్పులు సాగించారు. ఇంతలో మన సైనికులకు సహాయంగా మరి కొంత బలగం వచ్చింది. శత్రువును తరిమికొట్టారు.

6. 1965 ఆగస్టు 7 వ తేదీన 200 మంది పాక్ అతిక్రమణదారులు దొంగచాటుగా శ్రీనగర్ వెలుపల ఉన్న విమానాశ్రయం వైపు తరలి వెళ్ళారు. విమానాశ్రయంలో కేవలం 20 మంది జవానులతో ఉన్న సాహసి అయిన భారత సైన్యాధికారి 10 మందికి ఒకరు చొప్పున ఉన్న తన బృందంతో ధైర్యంగా వారిని ఎదుర్కొన్నాడు. అదనపు బలాలు రావడంతో దుండగులను పారదోలగలిగాడు. అయితే యీ సంఘర్షణలో సైన్యాధికారి ప్రాణాలు కోల్పోయాడు.

7. యూరీరంగంలో ఒక భారత సైనిక వీరుడు ప్రాణాపాయాన్ని సరకు చేయక ఆరు అమెరికన్ పాటన్ టాంకులను ఒకదాని తర్వాత ఒకదాన్ని వరసగా ధ్వంసం చేశాడు. ఆయన ధైర్యసాహసాలు ఆయన సహచరులకు మార్గదర్శకమైనవి. "పాటన్ భంజకుడు"గా ఆయనను వ్యవహరిస్తున్నారు.

8. కాశ్మీరులో మన దళాలు ముందుకు వెళ్ళడానికి అవరోధంగా ఉన్న ఒక గోడను కూలగొట్టే పనిని భారత సైన్యానికి చెందిన ఇంజనీరింగ్ విభాగంలోని ఒక చిన్న అధికారికి, సొరంగం త్రవ్వే ముగ్గురు పనివారలకు అప్పగించబడింది. ఆ పనిని పూర్తిచేసిన తర్వాత దగ్గరిపొదలలో సందడి జరుగుతున్నట్టు ఆ అధికారి గమనించాడు అతడు ధైర్యంతో నిల్చుని సవాల్ చేయగా పాకిస్తాన్ బెలూన్ రెజీమెంటుకు చెందిన సుబేదార్ సులేమాన్‌తో సహా సాయుధులైన 19 మంది పాక్ అతిక్రమణదారుల దళం బయటకు వచ్చి భారతీయ అధికారికి దాసోహం అన్నారు. భారతీయ అగ్రగామి దళాల కమ్యూనికేషన్ లైనులను త్రెంపడానికి యీపాకిస్తానీ దళం పంపబడినది.

9. జమ్మూ-కాశ్మీరు ప్రాంతంలో 100 మంది పాకిస్తాన్ అతిక్రమణదారుల దళం చేస్తున్న దురాగతాలను కెప్టెన్ చంద్రనారాయణసింగ్, కొద్దిమంది సైనికులతో ఎదుర్కోవాల్సివచ్చింది కెప్టెన్‌సింగ్ ఒంటరిగా దృఢచిత్తముతో పోరాడి, శత్రువులపై దెబ్బ తీసిన తర్వాత తన అసువులను కోల్పోయాడు.

10. చాంబ్‌రంగంలో మేజర్ భాస్కర్ రాయ్ ఆరు పాకిస్తాన్ పాటన్ టాంకులను ధ్వంసంచేశాడు.

11. పాకిస్తానీ ముజాహిదుల సాయుధ గుంపు, రాజస్థాన్‌లోని భుట్టోవాలా గ్రామంలోని భారతీయ పోలీసు కేంద్రంపై దాడిజరిపారు. ఆ కేంద్రం ఇన్చార్జి హెడ్‌కానిస్టేబిల్ లూన్ సింగ్, 9 మంది పోలీసు బృదంతో వారిని ఎదుర్కొని 9 మంది పాక్ దుండగులను హతమార్చి అధిక మొత్తంలో రైఫిళ్ళు, మందుగుండు సామాగ్రిని వశంచేసుకున్నాడు. మిగతా దుండగులు పారిపోయారు.

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.



Regd. No. H. 133

